ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం జిల్లా వార్తలు
ఆదివారం 14, జూలై 2024

వైసీపీ చేజారనున్న ఒంగోలు కార్పొరేషన్?

- ఆధిక్యతవైపు టీడీపీ కూటమి అడుగులు
- టచ్‌లోకి ఎక్కువ మంది కార్పొరేటర్‌లు
- వారిని కాపాడుకునే ప్రయత్నంలో బాలినేని
- నేడు, రేపు కీలక పరిణామాలు



జిల్లాలో కీలకమైన ఒంగోలు కార్పొరేషన్ పాలకమండలి వైసీపీ నుంచి చేజారే అవకాశం కనిపిస్తోంది. తిరుగులేని ఆధిక్యతతో ఉన్న ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పలువురు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. అందుకు సంబంధించి ఆది, సోమవారాల్లో పలు కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కన్పిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. శనివారం పేర్నమిట్ట ప్రాంతానికి చెందిన కార్పొరేటర్ కూడా సైకిలెక్కారు. దీంతో కూటమి సభ్యుల సంఖ్య 13కు చేరింది. తాజాగా ఎమ్మెల్యే దామచర్ల కార్పొరేషన్‌పై దృష్టిసారిం చడంతో మరికొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

పీఠం కదులుతోంది..

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంగోలులో 50 డివిజన్‌లకుగాను 43చోట్ల వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఆరు డివిజన్‌లలో టీడీపీ, ఒక డివిజన్‌లో జనసేన అభ్యర్థి గెలుపొందారు. కార్పొరేషన్‌లో టీడీపీకి మెజారిటీ రావాలంటే 26 మంది సభ్యుల అవసరం ఉంది. ఇప్పుడున్న 13మందికితోడు ఒంగోలు ఎంపీ మాగుంట, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌లు కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫిషియో సభ్యత్వం తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ మేరకు విజయ్‌కుమార్‌తో జనార్దన్ మాట్లాడినట్లు సమాచారం. ఈ ముగ్గురినీ కలిపితే టీడీపీ బలం కార్పొరేషన్‌లో 16కు చేరుతుంది. మరో 10 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరితే కార్పొరేషన్ ఆ పార్టీ పరమయ్యే అవకాశం ఉంది. శనివారం జరిగిన పరిణామాలతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అలాంటి వారి సంఖ్య 10 నుంచి 15 వరకూ ఉంది. వారిలో ఒకరిద్దరు జనసేన ద్వారా టీడీపీ కూటమిలో చేరేందుకు సిద్ధమయ్యారు. చాకచక్యంగా రాజకీయం చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ కొందరితో ప్రత్యక్షంగా, మరికొందరితో పార్టీ నాయకుల ద్వారా చర్చలు జరిపినట్లు తెలిసింది. మేయర్ గంగాడ సుజాత కూడా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆమెను పక్కనపెట్టి కార్పొరేటర్‌లతో టీడీపీ నాయకులు నేరుగా మంతనాలు ప్రారంభించారు.

కార్పొరేటర్‌లతో బాలినేని సంప్రదింపులు

పరిస్థితిని గమనించిన మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్పొరేషన్‌పై దృష్టిసారించి కార్పొరేటర్‌లతో చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. ఎన్నికల్లో ఓటమి అనంతరం హైదరాబాద్‌కే పరిమితమైన ఆయన కొందరు వైసీపీ కార్పొరేటర్లకు ఫోన్ చేసి తాను సోమవారం ఒంగోలు వస్తానని, తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించినట్లు సమాచారం. ఆ ప్రకారం సోమవారం ఆయన ఒంగోలు వస్తున్న విషయాన్ని కూడా బహిరంగప ర్చారు. దీంతో కొందరు వైసీపీ కార్పొరేటర్లు సోమవారం తర్వాత నిర్ణయం తీసుకుందామన్న ఉద్దేశంతో ఉండగా, మరికొందరు ఆదివారమే పార్టీ ఫిరాయించాలన్న ఆలోచనకు వచ్చారు. దీంతో శనివారం రాత్రికి నగరంలో రాజకీయం వేడెక్కింది.



ఎమ్మెల్యే జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన కార్పొరేటర్ చంద్రశేఖర్

కొందరు మల్లగుల్లాలు

అందిన సమాచారం మేరకు వైసీపీ అధినేత జగన్ తీసుకున్న నిర్ణయాలతో తీవ్ర మనస్తాపంతో ఉన్న బాలినేని ఎలా ముందుకెళ్లాలన్న విషయమై ఆలోచన చేస్తున్నారు. టీడీపీలోకి వెళ్లాలని భావిస్తున్న కార్పొరేటర్లలో కొందరు బాలినేని మాటను గౌరవించి సోమవారం తర్వాత నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనకు వచ్చారు. అలాంటి వారికి 'ముందుగానే పార్టీలోకి వస్తే మీకూ గౌరవం ఉంటుంది. కాదూ కూడదనుకున్నా అవిశ్వాస తీర్మానం చట్టాన్ని సవరించి ముందుకు వెళ్తాం' అన్న సంకేతాన్ని టీడీపీ నేతలు ఇచ్చినట్లు తెలిసింది. అంతేగాక కార్పొరేషన్ అధికారులంతా టీడీపీ చేతుల్లోనే ఉంటారు. కౌన్సిల్‌లో బలం లేకపోయినా వారు తీసుకునే నిర్ణయాలే చెల్లుబాటు అవుతాయి. అప్పుడు తమకు ఎలాంటి విలువ ఉండదని వైసీపీ కార్పొరేటర్లు ఓ భావనకు వచ్చినట్లు సమాచారం. దీంతో వారంతా మల్లగుల్లాలు పడుతున్నారు. వీరు ఆదివారమే టీడీపీలో చేరతారా? లేక బాలినేని వచ్చి వెళ్లిన తర్వాత చేరతారా? అన్నది అలా ఉంచితే ఏదో ఒక రోజు గోడ దూకేందుకు వైసీపీ కార్పొరేటర్లు 10మందికిపైగా సిద్ధంగా ఉన్నారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్ టీడీపీ కూటమి చేతుల్లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పక్కా వ్యూహంతో దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్‌ను టీడీపీ కైవసం చేసుకునేలా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. కార్పొరేటర్లతో బాలినేని మాట్లాడిన విషయం తెలుసుకున్న వెంటనే ఆయన అప్రమత్తమయ్యారు. ఇప్పటికే తనకు టచ్‌లో ఉన్న కార్పొరేటర్లను ఆదివారం పార్టీలో చేర్చుకొని కార్పొరేషన్‌లో వైసీపీ ఆధిపత్యానికి చెక్ పెట్టాలన్న ఆలోచనతో ఉన్నారు. అందుకనుగుణంగా టీడీపీలో చేరేందుకు సుమారు 10మంది కార్పొరేటర్లు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కూడా తెలిసింది. అయితే వైసీపీ నాయకులు సోమవారం బాలినేని వచ్చి ఏం సలహా ఇస్తారో చూద్దాం. ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని కార్పొరేటర్లకు నచ్చజెప్పడం ప్రారంభించారు.

టీడీపీలో చేరిన మరో వైసీపీ కార్పొరేటర్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 13: ఒంగోలు నగరంలోని వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. ఎన్నికలకు ముందు ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరగా, శనివారం 40వ డివిజన్ పేర్నమిట్టకు చెందిన కార్పొరేటర్ టి. చంద్రశేఖర్ ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. దీంతో ఇప్పటివరకు 39 మంది ఉన్న వైసీపీ సభ్యుల సంఖ్య 38కు తగ్గింది. చంద్రశేఖర్‌కు జనార్దన్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అయితే త్వరలో మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే పలువురు ఆ పార్టీ నేతలకు టచ్‌లో ఉన్నారు.

ఎస్పీగా దామోదర్

- మున్నా గ్యాంగ్‌కు ముకుతాడు వేసిన అధికారి
- సుమిత్ సునీల్ హెడ్ క్వార్టర్‌కు బదిలీ



ఒంగోలు (క్రైం), జూలై 13 : జిల్లా ఎస్పీగా ఏఆర్ దామోదర్‌ను నియమిస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలో 37మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు జిల్లాలో ప్రస్తుతం ఎస్పీగా ఉన్న గరుడ్ సుమిత్ సునీల్‌ను హెడ్ క్వార్టర్లో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఆదేశిస్తూఆయన స్థానంలో నూతన ఎస్పీగా దామోదర్‌ను నియమించింది. ప్రస్తుతం ఒంగోలు పోలీస్ శిక్షణ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న దామోదర్ పోలీస్ శాఖలో 2007లో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2008లో జిల్లాలోనే ప్రొబేషరీ డీఎస్పీగా పనిచేశారు. అప్పట్లో తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తూ హైవే కిల్లర్ మున్నా నిశ్శబ్ద హత్యాకాండను బట్టబయలు చేసి పోలీసు శాఖ ప్రతిష్టను పెంచారు. ఆ గ్యాంగ్‌లో 12 మందికి ఉరిశిక్ష పడటం గమనార్హం. ఉద్యోగోన్నతి పొంది విజయనగరం ఎస్పీగా 2019 ఎన్నికల సమయంలో అద్భుత పనితీరు కనబర్చారు. ఎస్పీ దామోదర్ పరిణితి చెందిన అధికారిగా పోలీస్ శాఖలో గుర్తింపు పొందారు. శిక్షణ కాలంలోనే జిల్లాలో ఆరు నెలలపాటు పనిచేయడంతోపాటు 2021 నుంచి ఇప్పటివరకు ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆయనకు జిల్లా సమస్యలతోపాటు అన్ని పరిస్థితులపై అవగాహన, పట్టు ఉంది. ఇప్పటివరకు జిల్లాలో వంద రోజులపాటు పనిచేసిన గరుడ్ సుమిత్ సునీల్‌ను హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

కేజీబీవీలకు ఎన్‌సీసీ యూనిట్లు

- వెంటనే ఏర్పాటు చేయాలని సమగ్ర శిక్ష పీడీ ఆదేశం



ఒంగోలు (విద్య), జూలై 13 : సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో కొత్తగా ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి లభించింది. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర రక్షణ శాఖ ఎన్‌సీసీ యూనిట్ల విస్తరణలో భాగంగా కొత్తగా మూడు లక్షల కేడెట్లకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం నూతనంగా జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, కేజీబీవీల్లో ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు కేంద్ర పాఠశాల విద్యావిభాగం నుంచి రాష్ట్రపాఠశాల విద్యకు, సమగ్రశిక్ష ప్రాజెక్టుకు సమాచారం ఇచ్చింది. కేజీబీవీల్లో ఎన్‌సీసీని ప్రోత్సహించాలని ప్రాజెక్టు డైరెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. డీఈవో, సమగ్ర శిక్ష ఏపీడీలు చొరవ తీసుకోవాలన్నారు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో పనిచేస్తున్న జీసీడీవో, అసిస్టెంట్ జీసీడీవో, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ తమకు అందుబాటులో ఉన్న ఎన్‌సీసీ బెటాలియన్ ఆఫీసర్లను సంప్రదించి వెంటనే ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో శ్రీనివాసరావు ఆదేశించారు.

వైసీపీలో మరింత సంక్షోభం

- జగన్ వింత నిర్ణయం
- చెవిరెడ్డికి జిల్లా పార్టీ పదవి
- ఆయన ఇక్కడికి ఎలా వస్తారో చూస్తానన్న మాజీ మంత్రి
- ఇటు సజ్జల, అటు కొందరు జిల్లా నాయకుల మంతనాలు
- అధినేత నిర్ణయాన్ని తప్పుపడుతున్న కేడర్
- సీనియర్లు మాత్రం గప్‌చుప్
- రేపు ఒంగోలు రానున్న బాలినేని

వివరాలు లోపలి పేజీల్లో..

విధానం బాగు.. సరఫరాలో జాగు

- చతుకుపాడు ఇసుక డంప్ వద్ద బారులు తీరుతున్న వాహనాలు
- నగదు రహిత చెల్లింపులతో జాప్యం
- ప్రస్తుతం కొనసాగుతున్న రెండు కౌంటర్లు
- మరో రెండు ఏర్పాటుకు ప్రజల వినతి



లోడింగ్ చేసుకుని బిల్లుల కోసం వేచి ఉన్న ట్రాక్టర్లు

జరుగుమల్లి (కొండపి), జూలై 13 : ఉచిత ఇసుక విధానంతో గృహ నిర్మాణదారులకు కష్టాలు తీరాయి. అవసరమైన మేర తీసుకెళ్లేందుకు జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు వద్దకు భారీగా వాహనాలతో వస్తున్నారు. అయితే అక్కడ రెండు కౌంటర్లు మాత్రమే ఏర్పాటు చేయడం, నగదు రహిత చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో సరఫరాలో జాప్యం జరుగుతోంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మండలంలోని చతుకుపాడులో ఉన్న రెండు డంప్‌ల వద్ద ఇసుక విక్రయాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రారంభించారు. ప్రస్తుతం ఒక డంప్ నుంచి ఇసుకను విక్రయిస్తున్నారు. ఇక్కడ టన్ను ఇసుక ధరను ప్రభుత్వం రూ.247గా నిర్ణయించింది. నామమాత్రపు రేటుకు వస్తుండటంతో భవనాలను త్వరితగతిన పూర్తి చేసుకునేందుకు నిర్మాణదారులు ఇసుకను తీసుకెళ్లేందుకు భారీగా వస్తున్నారు. పెద్ద సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లు డంప్ వద్ద రోడ్డుపై క్యూలో ఉంటున్నాయి.

చెల్లింపులపై అవగాహన లోపం

ప్రధానంగా ఇసుక కొనుగోలు నగదు రహితంగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఈవిషయంపై అవగాహన లేని వాహనదారులు నగదుతో డంప్ వద్దకు వస్తున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ఇక్కడ సెబ్, పోలీసు సిబ్బంది నలుగురు కాపలా ఉంటున్నారు. వారితోపాటు వాహనదారుల నుంచి ఆన్‌లైన్‌లో పేమెంట్‌లు కట్టించుకునేందుకు మైనింగ్, రెవెన్యూ సిబ్బంది రెండు కౌంటర్లు ఏర్పాటు చేసుకుని పనిచేస్తున్నారు. అయినా ఆన్‌లైన్ పేమెంట్లు తీసుకోవడానికి, రశీదులు ఇవ్వడానికి అధిక సమయం పడుతోంది. దీంతో ఇసుక కోసం వచ్చిన వాహనాలు గంటలకొద్దీ క్యూలో ఉంటున్నాయి. రోజుకు వంద వరకు వాహనాలకు ఇసుకను నింపుతున్నారు. గత రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షంతో మరింత ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది.

మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలి



చతుకుపాడు ఇసుక డంప్ వద్దకు పరిసరాల్లోని దాదాపు పది మండలాల నుంచి ఇసుక కోసం టిప్పర్లు, ట్రాక్టర్లు వస్తున్నాయి. ఇక్కడ ఇసుక నాణ్యమైనది కావడమే అందుకు కారణం. నాకు సొంత అవసరానికి ఇసుక కోసం రెండు రోజులుగా వస్తున్నాను. రోజుకు ఒక ట్రిప్పు మాత్రమే తీసుకెళ్లగలిగాను. దాదాపు పది ట్రిప్పుల ఇసుక అవసరం ఉంది. ప్రస్తుతం ఇక్కడ రెండు కౌంటర్లు మాత్రమే ఏర్పాటు చేయడం వల్ల జాప్యం జరుగుతోంది. మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేస్తే సకాలంలో ఎక్కువ మందికి ఇసుకను ఇవ్వొచ్చు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– అనుమోలు ప్రసాద్, చెరుకూరు, పొన్నలూరు మండలం



చతుకుపాడు ఇసుక డంప్ వద్ద బారులు తీరిన టిప్పర్లు, ట్రాక్టర్లు

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి డాక్టర్ స్వామి
- ప్రభుత్వ ఆసుపత్రి గోడలపై జగన్ ఫొటోలు ఉండటంపై ఆగ్రహం

పొదిలి, జూలై 13 : ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. పొదిలిలోని ప్రాంతీయ వైద్యశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల గోడలపై గత ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు ఉండడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలన మారినా ప్రభుత్వ భవనాలపై ఫొటోలు మార్చకపోవడం ఏమిటని మండిపడ్డారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాల్లో వైద్యులు ఉన్నా చికిత్స చేయకుండా బయట వైద్యశాలలకు పంపుతున్నారని రోగులు, స్థానిక ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలను ఏదో ఉద్ధరించామంటూ గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం మినహా చేసింది ఏమీ లేదన్నారు. అందుకు ఈ వైద్యశాల దుస్థితే నిదర్శనమన్నారు. వైద్యశాలలో అవసరమైన పరికరాలు అందుబాటులో లేవన్నారు. రక్తనిల్వ కేంద్రం ఉన్నా రోగులకు ఉపయోగపడడంలేదన్నారు. త్వరలోనే వైద్యశాలకు అవసరమైన పరికరాలను అందుబాటులోకి తెస్తామని మంత్రి చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. ఉద్యోగులతో ప్రభుత్వం ఫ్రెండ్లీగా ఉంటుందని కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని మంత్రి సూచించారు. కాగా పొదిలి పర్యటనకు వచ్చిన మంత్రి స్వామికి మర్రిపూడి అడ్డరోడ్డు వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.



రోగికి ఇచ్చిన మందులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

ఖరీఫ్ సాగుకు జీవం

- పలు మండలాల్లో మోస్తరు వర్షం
- ఇప్పటికే వేసిన పైర్లకు మేలు
- కంది, పత్తి సాగుకు ఉపయుక్తం



ఒంగోలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఇంచుమించు నెల రోజులుగా కొనసాగుతున్న బెట్ట వాతావరణం నుంచి ఉపశమనం కలిగి చల్లబడింది. శనివారం తెల్లవారుజాము నుంచి జల్లులు పడుతుండగా పలుచోట్ల ఒక మోస్తరు వర్షమే కురిసింది. ఈ వాతావరణం ఖరీఫ్ సీజన్‌కు జీవం పోయనుంది. ఇప్పటికే వేసిన పైర్లకు తాజా వర్షం మేలు చేయనుండగా ఖరీఫ్ ప్రధాన పంటలైన కంది, పత్తి విస్తారంగా సాగుకు ఉపయుక్తం కానుంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లు కాగా ఈ సమయానికి కనీసం 40వేల హెక్టార్లలో పంటలు సాగు కావాలి. తొలకరి పైర్లుగా పిలిచే సజ్జ, పెసర, నువ్వు వంటి సాగు పూర్తయ్యి పైరు దశలో ఉండాలి. అలా కంది, పత్తి సాగు ముమ్మరంగా సాగుతుండాలి. అందుకు వీలుగా జూన్ తొలివారంలో మంచి వర్షాలు కురిసినా తర్వాత వాతావరణం అనుకూలించ లేదు. వర్షం లేకపోవడమే కాక ఎండల తీవ్రత పెరిగింది. దాదాపు నెలరోజులుగా అలాంటి బెట్ట వాతావరణం నెలకొనడంతో సాగు ముందుకు సాగలేదు. దీంతో 2.02లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి కేవలం 14,285 హెక్టార్‌లలో మాత్రమే సాగైంది. తొలకరిగా పిలిచే పెసర, సజ్జ, నువ్వు పంటలు 12వేల హెక్టార్ల విస్తీర్ణానికి కేవలం 3వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. పత్తి, కంది మరో మూడున్నర వేల హెక్టార్లలో రైతులు వేశారు. అవి కూడా చాలాచోట్ల ఎండుముఖం పట్టాయి.

పగలంతా జల్లులు

ఈ పరిస్థితుల్లో నాలుగు రోజుల క్రితం ఒక మోస్తరు జల్లులు పడటం ఊరట కలిగించగా తాజాగా శనివారం మరోసారి కురిసిన వర్షం ఖరీఫ్ సాగుకు ప్రాణం పోసింది. శనివారం తెల్లవారుజామునుంచి జల్లులు పడుతూ ఉదయం 9 గంటల వరకు జిల్లాలో సగటున సుమారు 11.50 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా నాగులుప్పలపాడు మండలంలో 34.0 మి.మీ కురిసింది. ఒంగోలు మండలంలో 30.6, మద్దిపాడులో 29.40. పుల్లలచెరువులో 29.0, సంతనూతలపాడు 27.6. చీమకుర్తిలో 25.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో 15 మండలాల్లో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. అలాగే శనివారం పగటి పూట కూడా జల్లులు పడుతూనే ఉన్నాయి. తాజా వర్షంతో ఖరీఫ్ సాగుపై రైతులు కాస్తంత నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులకు
అన్ని విధాల అండగా ఉంటా

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జూలై 13: కళాకారులకు రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం, ఒంగోలు నియోజకవర్గంలో తాను అండగా ఉంటామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో జరిగిన జిల్లా రంగభూమి కళాకారుల సంఘం వార్షికోత్సవ ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు అధ్యక్ష తన జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం, వారు వినియోగించుకోవటం కోసమే నాడు ఎన్టీఆర్ కళాక్షేత్రంను నిర్మించామ న్నారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా అది కళాకారులకు అందుబాటులో లేకుండా పోయిందని చెప్పారు. ఇక నుంచి కళాక్షేత్రాన్ని కళాకారులు స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కళాకారుల కోరిక మేరకు నగరంలో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కళాకారులు సమాజహితం కోసం పనిచేస్తారని, అటువంటి వారి సంక్షేమం కోసం తాను కట్టుబడి ఉన్నానని, వారికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేస్తే తప్పనిసరిగా పరిష్కరిస్తానన్నారు. జనసేన జిల్లా అధ్య క్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రస్తుత టీడీపీ కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు కళాకారులచే స్థాపించబడ్డాయన్నారు. తెలుగుదేశంను నందమూరి తారకరామారావు స్థాపిస్తే, జనసేనను పవన్‌కళ్యాణ్ స్థాపించారన్నారు. కనుక కళాకారుల సంక్షేమానికి అన్ని విధాలా పాటుపడతారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్లను జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, కళాకారుల సంఘ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, సీవీఎన్ రీడింగ్ రూము ఎన్నికల అధికారి తోట రామస్వామి, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, బీజేపీ నాయకుడు బొద్దులూరి ఆంజనేయులు, ఊసా మధుబాబు, చెంగలశెట్టి అశోక్, కోశాధికారి ధేనువకొండ వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన మరో లారీ

● యజమాని మృతి, డ్రైవర్‌కు గాయాలు



మృతి చెందిన గోవిందరెడ్డి, సహాయక చర్యలు చేపడుతున్న పోలీసు సిబ్బంది

ఒంగోలు(క్రైం), జూలై 13: ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో లారీ యజమాని తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా పెద్దాపురం మండలం చలకుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి గోవిందరెడ్డి(40) మృతి చెందగా, డ్రైవర్ మల్లేపల్లి ప్రభాకర్‌కు గాయాలు అయ్యాయి. వివరాలలోకి వెళితే.. కృష్ణపట్నం నుంచి బొగ్గు లోడుతో రెండు లారీలు గుంటూరు వైపు వెళుతున్నాయి. నిద్రమత్తులో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి రెండో లారీ ఢీకొంది. దీంతో వెనుక ఉన్న లారీ క్యాబిన్ ముందు ఉన్న వాహనంలో ఇరుక్కుపోయింది. ఈ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ ప్రభాకర్, యజయాని గోవిందరెడ్డి చిక్కుకుపోయారు. సుమారుగా గంటసేపు అగ్నిమాపక సిబ్బంది, ఒంగోలు తాలుకా ఎస్సై పావని తమ సిబ్బందితో శ్రమపడి వారిని బయిటకు తీశారు. అయితే అప్పటికే గోవిందరెడ్డి చలనం లేకుండా ఉన్నారు. డ్రైవర్ ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. ఇరువురుని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా గోవిందరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు ఎస్సై పావని కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనలో సుమారుగా గంటసేపు రహదారిపై ట్రాఫిక్ స్తంభించగా పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై
అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సురేష్

పెద్దదోర్నాల, జూలై 13: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సురేష్ సూచించారు. మండలంలోని చింతల, కొర్రప్రోలు, దోర్నాల, అయినముక్కల గ్రామాల్లోని ఏపీఈ డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. వంటశాలల్లో, వసతి గదుల్లో శుభ్రతను పాటించాలని, ఆహార పదార్థాలు చెడిపోకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అదే సమయంలో వైద్యసిబ్బందితో రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శిస్తూ ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని, పెండింగులో ఉన్న సికిల్ షెల్ అనీమియా పరీక్షలు వందశాతం పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.యాగ్నిక్, సాయిప్రశాంతి, శంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పలకల పరిశ్రమకు
పూర్వ వైభవం తీసుకురావాలి



మంత్రి స్వామికి పలకను బహూకరిస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13: మార్కాపురంలోని పలకల పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని బీజేపీ నాయకులు కోరారు. శనివారం ఆయన మార్కాపురం వచ్చిన సందర్భంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురంలోని పలకల పరిశ్రమపై వేలాది మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పరిశ్రమను ఆదుకోవాలన్నారు. ఏపీలో విద్యార్థులకు ఇస్తున్న విద్యాదీవెన కిట్లలో పలకలను, ఎగ్జామ్ ప్యాడ్‌లను ఉండేలా ప్రభుత్వం జీవో తీసుకురావాలని కోరారు. ఎస్సీ బీసీ విద్యార్థులకు శాశ్వత హాస్టల్ భవనలు నిర్మించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు పి.కృష్ణారావు, బి.కృష్ణ, పి.రామచంద్ర, డి.చంద్రశేఖర్, సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, సురేష్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు తక్షణ మరమ్మతులు !

- మంత్రి డాక్టర్ స్వామి
- కొండపి ఆర్‌అండ్‌బీ రహదారి పరిశీలన
- నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- ఇరువైపులా కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచన



రోడ్డులో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్న మంత్రి స్వామి

కొండపి, జూలై 13: రహదారుల తక్షణ మరమ్మతులకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఆయన విమర్శించారు. ఐదేళ్లుగా ఎక్కడా తట్ట మట్టిపోసిన పాపాన పోలేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే మరమ్మతులు చేయించి ప్రయాణ కష్టాలను తీరుస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన కొండపిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆయన శనివారం పరిశీలించారు. పోలీసు స్టేషన్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని సూచించారు. ఇక్కడ 1,100 మీటర్ల దూరం సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.28లక్షలు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ డీఈ దాసరి మాధరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ముందు ఆక్రమణలు తొలగించి, పూడిపోయిన కాల్వలను వెలికి తీస్తేనే కొత్తగా వచ్చిన నిధులతో రోడ్డు వేయాలా? లేదా? అనేది తెలుస్తుందన్నారు. సైడు కాల్వలు వెలికి తీయకుండా రోడ్డు వేసి కూడా ఉపయోగం ఉండదని అభిప్రాయపడ్డారు. కాలువల ద్వారా నీటిని బయటకు పంపిన తర్వాతనే రోడ్డు నిర్మాణం చేపడదామని మంత్రి డీఈకి స్పష్టం చేశారు.

చెరువుల వద్ద అడ్డుగోడలు నిర్మించాలి

నియోజకవర్గంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట ఉన్న చెరువుల కట్టల మీద పడిన వర్షపు నీరు రోడ్లపైకి చేరి దెబ్బతింటున్నాయని మంత్రి డీఈకి వివరించారు. కొండపి మండలంలోని వెన్నూరు, చినవెంకన్నపాలెం, పెట్లూరు, పొన్నలూరు మండలంలోని పొన్నలూరు చెరువు, మర్రిపూడి గ్రామంలోని చెరువు వద్ద రోడ్లు పదేపదే వర్షాకాలంలో దెబ్బతింటున్నాయన్నారు. ఈదృష్ట్యా చెరువు కట్టల వద్ద అడ్డుగోడల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని డీఈని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ కొండపి సెక్షన్ ఏఈ దీప్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పొన్నలూరు మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే దామచర్ల

ఘనంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం ● హాజరైన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ● ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారుల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 13: క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యం లభిస్తాయని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని లార్డ్‌కృష్ణ షటిల్ అకాడమీలో 51వ ఉమ్మడి ప్రకాశం జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఎమ్మెల్యే దామచర్ల, ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో క్రీడలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. అలాగే టీడీపీ హయాంలోనే మినీస్టేడియంకు మహర్దశ లభించిందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అలాగే టీడీపీ పాలనలో ప్రతి నియోజకవర్గంలో మినీ స్టేడియంల ఏర్పాటు చేశామని, త్వరలోనే వాటన్నిటినీ వినియోగంలోకి తీసుకువచ్చి క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళిక రూపొందించారని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఒంగోలులో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, అదే నిజమైన క్రీడాస్ఫూర్తి అన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు ప్రత్యేకమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, అకాడమీ వ్యవస్థాపకులు అద్దంకి మురళీకృష్ణ, అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి విజయ్, రవిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా మొదటి రోజు అండర్-11, 13, 15, 17, 19 వయస్సు విభాగాలలో సుమారు 150మందికి పైగా క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తలపడ్డారు.



మ్యాచ్‌ను ప్రారంభించి ఆడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

అధికారిక పొగాకు కొనుగోళ్లు పూర్తి

టంగుటూరులో 9.91 మిలియన్ కిలోల అమ్మకం ● కిలోకు రూ.262.17 లభించిన సగటు ధర



పొగాకు కొనుగోలులో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు, జూలై 13 : టంగుటూరు వేలం కేంద్రంలో అధికారిక పొగాకు కొనుగోళ్లు శనివారంతో ముగిశాయి. ఈ సీజన్ (2023-24)లో మొత్తం 96 రోజులు వేలం కొనసాగింది. కేంద్రం పరిధిలో 10 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతించగా 2,869 మంది రైతులు 9.91 మిలియన్ కిలోల పంటను అమ్ముకున్నారు. మేలు రకం సగటు ధర కిలోకు రూ.313.60, మధ్యరకం కిలోకు రూ.262.54, లోగ్రేడ్ కిలోకు రూ.239.18 సగటు ధర లభించింది. అన్ని రకాలు కలిపి అది రూ.262.17గా ఉంది. వేలంలో 42 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన తర్వాతనే అదనంగా పండించిన పంట కొనుగోళ్లు ప్రారంభిస్తామని వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 16 నుంచి పొగాకు సూర, ముక్క కొనుగోళ్లు జరుగుతాయని ఆయన చెప్పారు. షెడ్యూల్ ప్రకారం రైతులు వాటిని వేలం కేంద్రానికి తెచ్చి అమ్ముకోవాలని కోరారు. బేలు 150 కిలోలు మించి ఉండకూడదన్నారు. ఇది రెగ్యులర్ అమ్మకం కోటాలో కలవదన్నారు. రైతులు తమ వద్ద ఉన్న పొగాకు సూరను ఒక బ్యారన్‌కు 5 క్వింటాళ్ల చొప్పున అమ్ముకోవచ్చని తెలిపారు. బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైద్యులపై దాడులను నియంత్రించాలి

- ప్రత్యేక రక్షణ చట్టాలు రూపొందించాలి
- ఐఎంఏ ప్రతినిధుల డిమాండ్
- ఒంగోలులో వైద్యుల రాష్ట్ర సదస్సు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ ప్రతినిధులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 13: వైద్యులపై జరిగే దాడులను నియంత్రించేందుకు జాతీయస్థాయిలో కొత్త చట్టాలు రూపొందించాలని ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోరింది. రెండు రోజులపాటు ఒంగోలులోని ఐటీఏ కన్వెన్షన్ హాలు నిర్వహించిన జోన్-2 రీజియన్ అకడమిక్ కాన్ఫరెన్స్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ జాలాది మణిబాబు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో జాతీయ మాజీ అధ్యక్షులు డాక్టర్ సమరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుల్లో ఐఎంఏకు సంబంధించిన డాక్టర్లకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే వైద్యానికి రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 2శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, దానిని 15శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా గుర్తించి ప్రతి గ్రామాన్ని ఆరోగ్యవంతమైన వాటిగా మార్చాలని కోరారు. ఆరోగ్యశ్రీని కేవలం పేదలకే కాకుండా మధ్య తరగతి వారికి కూడా అందించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు జేసీనాయుడు మాట్లాడుతూ వైద్యవిభాగంలో వైద్యులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కోరారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి జయశేఖర్ మాట్లాడుతూ వైద్య పరికరాల కొనుగోలు విషయంలో వైద్యులపై జీఎస్‌టీ భారం పడుతుందని, దీంతో వైద్యం ఖరీదైపోతుందని తెలిపారు. సింగిల్ విండో రిజిస్ట్రేషన్ ఉండేలా చేయాలని కోరారు. ప్రభుత్వాల కొత్త నిబంధనలతో కేరళ రాష్ట్రంలో సుమారు 700లకు పైగా ఆసుపత్రులు మూతపడ్డాయన్నారు. అదే పరిస్థితి మన రాష్ట్రంలో రాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన కోరారు. జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జాలాది మణిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం 304 ఏ సెక్షన్ తీసుకొచ్చిందని, దీనివల్ల వైద్యుల నిర్లక్ష్యం అనిపిస్తే గతంలో రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా ఉండేదని, ప్రస్తుతం దాని ఏడేళ్లకు పొడిగించడం అన్యాయమన్నారు. సమావేశంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షులు నల్లూరి రాఘవరావు, సెక్రటరీ శ్రావణి, కోశాధికారి శ్రీదేవి, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ మన్నే వీరయ్యచౌదరి, రవికృష్ణ, అశోక్, ప్రసాద్, వివిధ ప్రాంతాల నుంచి సుమారు 700 మంది వరకు వైద్యులు తొలిరోజు సదస్సులో పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో తాగునీటి కష్టాలు

● మూతపడిన ఆర్వో ప్లాంట్



మూతపడిన వాటర్‌ప్లాంట్

నాగులుప్పలపాడు, జూలై 13: ఉప్పుగుండూరులో తాగునీటి సమస్య గ్రామస్థులను వేధిస్తోంది. పంచాయతీ పాలకులు, అధికారుల మధ్య సమన్వయం కొరవవడంతో ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ప్రధాన వనరులైన చెరువుల్లో నీరు అడుగంటి దుర్గంధం వెదజల్లుతున్న కలుషిత నీరే దిక్కవుతుంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. గత ఆరు నెలల నుంచి మూడు రోజుల కోసారి మాత్రమే కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఉన్న బావులను పాడుబడిపోయాయి. వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. సర్పంచ్ దేవరకొండ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి హరిబాబు మధ్య వివాదాలతో తాగునీటి సమస్యపై దృష్టి సారించడం లేదని ప్రజలు బాహటంగా విమర్శిస్తున్నారు. దీనికితోడు ఆర్వో వాటర్‌ప్లాంట్ సైతం వారం రోజుల నుంచి మరమ్మతులకు గురై మూతపడటంతో తాగునీటి కష్టాలు మరింత పెరిగాయి. పంచాయతీ కార్యదర్శి సెలవుపై వెళ్లడంతో వాటర్‌ప్లాంట్ వినియోగంలోకి తీసుకొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

పాలిసెట్ ఆప్షన్లకు నేడు తుది గడువు

ఒంగోలు(విద్య), జూలై 13: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్-24 చివరి దశ అడ్మిషన్లకు విద్యార్థులు ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు ఆదివారం చివరి దశ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేశారు. విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో ఎన్ని కళాశాలలు, ఎన్ని గ్రూపులకైనా కళాశాలల వారీగా ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 16వ తేదీన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. అడ్మిషన్లు దక్కిన విద్యార్థులు ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు కళాశాలలకు వెళ్లి లేదా ఆన్‌లైన్‌లో ఆ కళాశాలల్లో చేరుతున్నట్లు రిపోర్టు చేయాలి. తరగతులు వెంటనే ప్రారంభమవుతాయి. ఆప్షన్ల నమోదుకు, సందేహాలను నివృత్తికి ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

63 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 13: ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పౌరసరఫరాలశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నాగులుప్పలపాడు మండలం పోతవరం గ్రామం వద్ద 63 బస్తాల రేషన్ బియ్యంతో వెళ్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆ మండలం నుంచి చీరాల వైపు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం తెల్లవారుజామున అధికారులు పట్టుకొని ఆ బియ్యాన్ని సీజ్ చేసి డ్రైవర్ ఆనంద్, బాధ్యులపై 6ఎ కేసును నమోదు చేశారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఆర్‌వీఎస్.కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి, డేవిడ్, సీహెచ్.కృష్ణమోహన్, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు ఊతకోలు శ్రీనివాసరావు, గుణవంశీ పాల్గొన్నారు.

జిల్లాలో 11.5 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్); జూలై 13 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 11.5 మి.మీ వర్షపాతం నమోదైంది. నాగులుప్పలపాడు మండలంలో 34.0, ఒంగోలు 30.6, మద్దిపాడు 29.4, పుల్లలచెరువు 29.0 సంతనూతలపాడు 27.6, చీమకుర్తి 25.4, టంగుటూరు 22.0. దోర్నాల 21.8, యర్రగొండపాలెం 19.2, ముండ్లమూరు 19.0, కురిచేడు 16.6, అర్ధవీడు 14.6, పెద్దారవీడు 12.4, త్రిపురాంతకం 11.0 తాళ్ళూరు 10.8, దొనకొండ 10.2, కొత్తపట్నం 10.0 దర్శి 10.0 మి.మీ వర్షం కురిసింది. మరో పది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

కళాశాలల సిబ్బంది కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు(విద్య), జూలై 13: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది అయిన సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు అందరూ తమ కోసం ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన సంఘ సమావేశంలో ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ.రంగనాయకులు, ఒంగోలు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.తారకనాథ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా సీహెచ్.శ్రీనివాసరావు(టంగుటూరు), కార్యదర్శిగా ఎస్‌కే.అబ్దుల్‌హయత్(కంభం), కోశాధికారిగా ఎన్‌సీ.సాయికిషోర్(టంగుటూరు) ఎన్నికయాయరు. నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నికల అధికారులతో పాటు ఉద్యోగులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై విచారణ

జరుగుమల్లి (కొండపి), జూలై 13 : ఎన్.ఎన్.కండ్రిగలోని అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ అధ్వానంగా ఉందని గ్రామస్థులు ఇటీవల సీడీపీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో టంగుటూరు సీడీపీవో మల్లీశ్వరి శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి పలు వివరాలను సేకరించారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ మెరిట్‌కార్డులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 13: జిల్లాలో గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ మెన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైన విద్యార్థుల మెరిట్‌కార్డులు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వ పరీక్షల కమిషనర్ కె.శివకుమార్ శనివారం తెలిపారు. ఈ ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు వెంటనే వెబ్‌సైట్ నుంచి మెరిట్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి లేదా తల్లి పేరు వారి ఆధార్‌లో ఉన్న విధంగా ఉందో లేదో తనిఖీ చేసుకోవాలి. మెరిట్ కార్డులోని వివరాలను కేంద్ర విద్యాశాఖ స్కాలర్ షిప్ పోర్టర్‌లో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేయాలి. సంబంధిత పాఠశాలల నోడల్ ఆఫీసరు, జిల్లా నోడల్ ఆఫీసరు లాగిన్ ద్వారా అప్రూవ్ చేయించుకోవాలి. విద్యార్థి పేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీ, మెరిట్ కార్డుల్లో ఉన్న విధంగానే ఆధార్ కార్డులో కూడా ఉండాలి. వివరాలు సరిపోని విద్యార్థులు వెంటనే ఆధార్ మిస్ మ్యాచ్ వివరాలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈవో కార్యాలయానికి తెలియజేయాలి. తప్పని సరిగా విద్యార్థి బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ అనుసంధానం కాకపోతే స్కాలర్‌షిప్ డబ్బులు విద్యార్థి ఖాతాకు జమ కావని శివకుమార్ తెలిపారు.

16న నగర మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట), జూలై 13: ఒంగోలులో ఈ నెల 16న జరిగే మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ నగర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు, జిల్లా నాయకులు, మునిసిపల్ ఇంజనీరింగ్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మునిసిపల్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, నగర కార్యదర్శి టి.మహేష్, యూనియన్ రాష్ట్ర నాయకులు కె.సామ్రాజ్యం, కె.శ్రీనివాసరావు, కె.గోపి, యు.రత్నకుమారి, టి.విజయ, ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి యువకుడు మృతి



మృతి చెందిన రమేష్‌సింగ్

ఒంగోలు(క్రైం), జూలై 13: ప్రమాదవశాత్తు కాలు జారి రెండో అంతస్తు నుంచి కింద పడి రాజస్థాన్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలులోని పెద్ద మసీదు వద్ద శనివారం ఉదయం జరిగింది. కట్ పీసెస్ షాప్‌లో గుమస్తాగా రాజస్థాన్‌కు చెందిన రమేష్‌సింగ్ (35) తన బావ దగ్గర పని చేస్తున్నాడు. పెద్దమసీదు వద్ద ఉన్న మూడంతస్తుల భవనంలో రెండో అంతస్తులో ఓ గదిలో అద్దెకు ఉంటున్నారు. తమ దుకాణంలో పనిచేసే ఇరువురు యువకులతో కలిసి నివసిస్తున్నారు. అయితే వర్షపు నీరు తుడిచే సమయంలో కాలు జారి పై నుంచి కింద పడినట్లు అక్కడ ఉన్న వారు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన టూటౌన్ సీఐ జగదీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు



గాయపడిన యువకులు

చీమకుర్తి, జూలై 13 : మండలపరిధిలోని ఎర్రగుడిపాడుడొంక సమీపంలో కర్నూల్‌రోడ్‌పై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు గాయాలపాల య్యారు. ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. చీమకుర్తి వైపు శ్రీశైలం నుంచి బైక్‌పై వస్తున్న యువకులు ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్న సంఘటనలో గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

వైసీపీలో మరింత సంక్షోభం

జగన్ వింత నిర్ణయం..
చెవిరెడ్డికి జిల్లా పార్టీ పదవి
ఆయన జిల్లాలోకి ఎలా వస్తారో చూస్తానన్న మాజీ మంత్రి
సీనియర్లు మాత్రం గప్‌చుప్
అధినేత నిర్ణయాన్ని తప్పుపడుతున్న కేడర్
ఇటు సజ్జల అటు కొందరు జిల్లా నాయకుల మంతనాలు
రేపు ఒంగోలు రానున్న బాలినేని

ఓటమి భారంతో దిగాలుగా ఉన్న జిల్లాలోని వైసీపీ శ్రేణులకు ఆ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి మరో షాక్ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడుగా తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించాలని ఏకపక్ష నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై బాలినేని భగ్గుమన్నారు. ఆ పార్టీ నాయకుల మధ్య గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్గత వ్యవహారం బహిర్గతమై శనివారం పలు మలుపులు తిరిగింది. చివరికి జగన్ వెనక్కు తగ్గకపోతే బాలినేనితోపాటు పలువురు నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేవరకు పరిస్థితి చేరింది. దీంతో సజ్జల శనివారం రంగంలోకి దిగారు. బాలినేనితో ఆయన జరిపిన చర్చలు సఫలీకృతం కాకపోగా జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న జిల్లాలోని ఆ పార్టీలోని అత్యధికశాతం నాయకులు, కార్యకర్తలు బాలినేనికి బాసటగా వెనక్కు తగ్గవద్దని వత్తిడి తెస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఓటమి అనంతరం జిల్లాలో కిందిస్థాయి వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీకి జైకొట్టేందుకు దారులు వెతుక్కుంటున్నారు. ఇప్పటికే గిద్దలూరు మున్సిపాలిటీ చేజారి టీడీపీ వశమైంది. ఒంగోలు కార్పొరేషన్ కూడా టీడీపీ పరమయ్యే పరిస్థితి నెలకొంది. మార్కాపురం మున్సిపాలిటీలో పరిస్థితిని చక్కదిద్దుకోలేక ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఇరకాటంలో పడి ఉన్నారు. చీరాలలో వైసీపీ, వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు టీడీపీ బాట పట్టారు. అద్దంకి నగర పంచాయతీలో వైసీపీ పాలకమండలి సభ్యులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. పలువురు జడ్పీటీసీ సభ్యులు అవకాశం కోసం వేచిచూస్తున్నారు. దీంతో జిల్లాలో వైసీపీ పరిస్థితి మరింత దిగజారిపోయింది. ఈ నేపథ్యంలో అధినేత జగన్ పాత పద్ధతిలోనే తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీలో మరింత సంక్షోభ పరిస్థితులకు కారణమయ్యాయి.

చెవిరెడ్డికి పార్టీ అధ్యక్ష పదవి

ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఏపీఐఐసీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అదేసమయంలో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత అధిష్ఠానం చెప్పిన అన్ని కార్యక్రమాలను ఆయనే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత జగన్ జిల్లా అధ్యక్ష పదవికి ఒంగోలు ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ విషయాన్ని జగన్ నేరుగా జిల్లా నాయకులకు చెప్పలేదు. పార్టీ కార్యాలయం నుంచి ఒకరు బాలినేనికి ఫోన్ చేసి జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి మీరుంటారా అని అడిగినట్లు తెలిసింది. ఇప్పుడు మార్పు ఎందుకు, కొంతకాలం వేచి ఉండండని బాలినేని తన అభిప్రాయంగా చెప్పారు. రెండోరోజే బాలినేనికి పార్టీ కార్యాలయం నుంచి మరొకరు ఫోన్‌చేసి ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించాలని జగన్ నిర్ణయించినట్లు చెప్పారు.

బాలినేని రివర్స్

జిల్లా అధ్యక్షుడిగా చెవిరెడ్డిని నియమించాలన్న జగన్ ప్రతిపాదనను వినగానే బాలినేని తీవ్రంగా వ్యతిరేకించారు. అధ్యక్షుడిగా అతన్నే నియమిస్తే జిల్లాలోకి ఎలా అడుగుపెడతాడో చూస్తానంటూ హెచ్చరించి ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది. ఆ తర్వాత ఇదే సమాచారాన్ని జిల్లాలోని మాజీ మంత్రి సురేష్‌తోపాటు మరికొందరు నాయకులకు ముఖ్యంగా వైవీ సుబ్బారెడ్డికి కూడా ఆ పార్టీ నాయకులు తెలియజేసినట్లు తెలిసింది. కొందరు ఊ అంటూ స్పందించగా మరికొందరు సమాచారాన్ని విని ఫోన్ పెట్టేశారు. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగానే ఉన్నట్లు తెలిసింది. మాజీమంత్రి సురేష్‌తోపాటు మరికొందరు జగన్ నిర్ణయం తీసుకుంటే మనకెందుకులే అని సైలెంట్ అయిపోయారు. జిల్లాలోని కొందరు వైసీపీ నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాలినేనికి సమాచారమిచ్చారు. లోక్‌సభ స్థానాలకు వివిధ కారణాలతో వేరే ప్రాంత అభ్యర్థులను రంగంలోకి దింపటం సహజం. కానీ జిల్లా పార్టీ అధ్యక్ష పదవినే వేరే జిల్లావారికి అప్పజెప్పటం ద్వారా స్థానిక నాయకులందరినీ జగన్ చిన్నబుచ్చారని ఆ పార్టీ నాయకులు ప్రధానంగా అభిప్రాయపడినట్లు తెలిసింది. అదే అభిప్రాయంతో కొందరు బాలినేనికి ఈ విషయంలో తలొగ్గొద్దని మీ నిర్ణయమే మా నిర్ణయమని చెప్పినట్లు సమాచారం. ఆ పార్టీ తరఫున గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలలో దర్శి ఎమ్మెల్యే మౌనరాగం పాటించగా వైపాలెం ఎమ్మెల్యే బాలినేనికి ఫోన్ చేసి అన్నా మీరే ఆలోచించండని చెప్పినట్లు తెలిసింది.

రంగంలోకి సజ్జల

జగన్ నిర్ణయంపై బాలినేని రివర్స్ కావటంతో అధిష్ఠానం ఆలోచనలో పడింది. వెంటనే ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జలను రంగంలోకి దింపారు. ఆయన శనివారం బాలినేనిని కలిసి మంతనాలు ప్రారంభించారు. పార్టీ అధ్యక్ష పదవి వేరే జిల్లావారికి ఇచ్చే పద్ధతిని తాను అంగీకరించలేనని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మాగుంటను కాదని చెవిరెడ్డిని తేవటమే జగన్ చేసిన మొదటి తప్పని మరోసారి స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా జగన్ మారకపోతే ఈ పార్టీని ఎవరూ కాపాడలేరని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది.

వైవీపై భారం మోపండి

ఇలాఉండగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై జిల్లా పార్టీని నడిపే భారాన్ని ఎందుకు మోపకూడదని జిల్లాలోని కొందరు ముఖ్య నాయకులు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లటం విశేషం. 2014లో ఎంపీగా గెలుపొందిన ఆయన కొద్దినెలలకే జిల్లా పార్టీ కార్యాలయానికి తాళాలు వేశారు. ఆ తర్వాత ప్రతిపక్షంలో పార్టీ బాధ్యతను భారాన్ని బాలినేని, ఇతర నాయకులు తీసుకున్నారు. ఇప్పుడు ఓటమితోపాటు ఆర్థికపరమైన ఇబ్బందులతో జిల్లాలోని నాయకులు ఉన్నారు. అప్పనంగా పదవి పొందిన వైవీకి పార్టీ బాధ్యతలు అప్పగించి ఆర్థిక అవసరాలు తీర్చమని కొందరు సూచించినట్లు తెలిసింది.

రేపు ఒంగోలుకు బాలినేని

ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా బాలినేని సోమవారం ఒంగోలు రానున్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో వైసీపీ కార్పొరేటర్లు పార్టీ మారే ఆలోచనతో ఉండటం, జిల్లా పార్టీ అధ్యక్ష పదవిపై సంక్షోభం నెలకొన్న దశలో ఆయన ఒంగోలు రానుండటం విశేషం. కార్పొరేటర్లను కాపాడుకోవటంతోపాటు జగన్ తీసుకుంటున్న ఒంటెత్తు పోకడ నిర్ణయాలపై తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తపరిచే అవకాశం ఉంది. ఇప్పటికిప్పుడు మరో పార్టీలోకి ఆయన వెళ్లే అవకాశాలు లేనప్పటికీ వైసీపీ వ్యవహారాలకు దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది.



చక్రం ఊడిన బస్‌ను పరిశీలిస్తున్న డిపో మేనేజర్ శ్యామల

ఊడిన ఆర్టీసీ బస్సు చక్రం

● తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, జూలై 13 : చీరాల పట్టణంలో అకస్మాత్తుగా ప్రయాణికులు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి చక్రం అకస్మాత్తుగా ఊడింది. ఈఘటన శనివారం సాయంత్రం చీరాల ముంతావారి సెంటర్‌లో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఇంకొల్లు నుంచి చీరాలకు సుమారు 20 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్ బయలుదేరింది. ఈనేపథ్యంలో సాల్మన్ సెంటర్ వద్దకు రాగానే బస్ నుంచి ప్రతికూల శబ్దంను అప్పటికే డ్రైవర్ ఈశ్వర్‌రెడ్డి గమనించారు. అలాగే చిన్నగా వస్తుండగా ముంతావారి సెంటర్‌కు రాగానే ఒక్కసారిగా హబ్ విరిగి చక్రం బస్ నుంచి పూర్తిగా ఊడిపోయి పక్కకు వెళ్లింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ జాగ్రత్తగా బస్‌ను నిలిపి వేశాడు. అయితే ప్రయాణికులు భీతిల్లిపోయారు. సమాచారం అందుకున్న డిపో మేనేజర్ శ్యామల సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి బస్‌ను డిపోకు తరలించారు. అయితే ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రావూరు - తిమ్మసముద్రం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో బస్సులు దెబ్బతింటున్నాయని ఈక్రమంలోనే ప్రమాదం జరిగి ఉంటుందని ఆర్టీసీ సిబ్బంది చెప్తున్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భానుమూర్తి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ నిరంతర పోరు

దర్శి, జూలై 13: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తూ ముందంజలో ఉందని ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి పేర్కొన్నారు. దర్శిలో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఏపీ టీఎఫ్ ఉద్యమ, అధ్యయన తరగతులకు జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించారు ఈసందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ 1947 నుంచి గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, విద్యా ప్రగతికి ఏపీటీఎఫ్ కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్క రించటంలో నూతన ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగ వరప్రసాదరావు, ఎస్.గురునాధశర్మ, బెజవాడ రఘుబాబు, డి.శ్రీనివాసులు, నాయబ్‌రసూల్, హనుమంతరావు, ఎల్.ప్రసాద్, శివరామకృష్ణ, శేషారావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

పామూరు(సీఎస్‌పురం), జూలై 13: వేగనియంత్రణ అదుపుకాక విద్యుత్ స్థంబాన్ని కారు ఢీకొన్న సంఘటన శనివారం సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లిలో చోటుచేసుకుంది. విద్యుత్ శాఖకు చెందిన ఓఉద్యోగి సీఎస్‌పురం నుంచి కనిగిరికి వెళుతున్నారు. ఈక్రమంలో పెదగోగులపల్లి గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా గేదెలు రావడంతో, వాటిని తప్పించబోయి విద్యుత్‌స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈఘటనతో విద్యుత్ స్తంభం విరిగిపోయి తీగెలు తెగి రోడ్డుపై పడ్డాయి.

మార్టూరు స్టేషన్ నుంచి నలుగురు బదిలీ

మార్టూరు, జూలై 13 : మార్టూరు పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారిలో హెడ్ కానిస్టేబుల్ రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయిరాం వెదుళ్లపల్లి స్టేషన్‌కు బదిలీ కాగా, కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న రమేష్ మేదరమెట్ల స్టేషన్‌కు, హరిబాబు బల్లికురవ స్టేషన్‌కు, రాజు అద్దంకి స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం స్టేషన్‌కు ఆదేశాలు వచ్చాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గర్నెపూడి(పర్చూరు), జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పర్చూరు మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన ఏ పేరయ్య(55) ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి ఈనెల 11న స్వగ్రామం వస్తుండగా అన్నంబొట్లవారిపాలెం సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి గాయపడ్డారు. అతనిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అద్దంకి, జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో భవనాసి కాలువ సమీపంలో శుక్రవారం రాత్రి 37 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన వ్యక్తిని 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందారు. ఈ మేరకు ఒంగోలు రిమ్స్ అవుట్‌పోస్టు నుంచి అద్దంకి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందింది.

బండిదారిలో ఆక్రమణలు తొలగిస్తాం

దర్శి, జూలై 13: దర్శి - కురిచేడు రోడ్డులోని బండిదారి ఆ క్రమణలను పూర్తిగా తొలగిస్తామని తహసీల్దార్ జీ సుజాత శనివారం ప్రకటనలో తెలిపారు. బండిదారి స్థలం తెర వీడే నా శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. దర్శి రెవెన్యూలోని 244 సర్వే నెంబర్‌లో 1.65 ఎకరాల లోకల్ ఫండ్ రోడ్డు భూమి, 247, 248, 266 సర్వే నెంబర్లలో 9 ఎకరాల బండిదారి భూమి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆ బండిదారి భూమి ఎక్కడ ఉన్నదో గుర్తించేం దుకు అధికారులతో సర్వే చేయిస్తామని తెలిపారు. హద్దుల ను గుర్తించాక కంచెను ఏర్పాటు చేసి ఆ భూముకి రక్షణ కల్పిస్తామని తహసీల్దార్ ఆప్రకటనలో పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్టుకు గాయాలు

పామూరు, జూలై 13: జాతీయ రహదారిపై ఉన్న డివైడ ర్‌ను బైకిస్టు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని చిలం కూరుకు చెందిన ఎర్రసింగ్ వెంకటేష్ అనే యువకుడు పామూరు నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో వగ్గంపల్లి గ్రామంవద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పామూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించినట్లు బంధువులు తెలిపారు.


రిజర్వాయర్‌గా మార్చాల్సిన భవనాసి చెరువు.. గుండ్లకమ్మ నీటిని భవనాసి రిజర్వాయర్‌కు మళ్లించేందుకు తవ్వి ఆగిన కాలువ పనులు

భవనాసి రిజర్వాయర్ ఎప్పటికి పూర్తయ్యేనో..?

- 15 ఏళ్లుగా సాగుతున్న పనులు
- భూసేకరణ, బ్లాస్టింగే ప్రధాన అడ్డంకి
- మంత్రి రవికుమార్‌పైనే రైతుల ఆశలు

అద్దంకి, జూలై 13 : అద్దంకి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ భవనాసి రిజర్వాయర్. 106 సంవత్సరాల కిందట భవనాసి చెరువు నిర్మాణం జరగ్గా, రిజర్వాయర్‌గా చేసే పనుల నిమిత్తం సుమారు రూ.27కోట్లతో 2009లో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అప్పటి గుంటూరు జిల్లా ప్రస్తుత పల్నాడు జిల్లా పరిధిలోని గోకనకొండ సమీపంలో గుండ్లకమ్మ నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం చేసి అక్కడ నుంచి సుమారు 12 కి.మీ దూరం నేలకాలువ ద్వారా నీటిని భవనాసి చెరువును నింపాల్సి ఉంది. అదేసమయంలో భవనాసి చెరువు పటిష్ఠం చేసి అలుగు ఎత్తు పెంచటం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఈక్రమంలో గుండ్లకమ్మ నదిలో చెక్ డ్యామ్ నిర్మాణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. భవనాసి చెరువు కట్ట అభివృద్ధి చేసే పనులు కూడా పూర్తయ్యాయి.

గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు వరకు కాలువ తవ్వకం పనులు కొంతమేర పూర్తయినా పలు చోట్ల అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రధానంగా కొన్నిచోట్ల భూసేకరణ జరగకపోవడంతో పాటు మైలవరం, ఉప్పలపాడు సమీపంలో కాలువ తవ్వకం సమయంలో పెద్ద రాళ్లు పడ్డాయి. వాటిని పగులగొట్టడానికి బ్లాస్టింగ్ చేయాల్సి ఉంది. బ్లాస్టింగ్‌కు అనుమతులు రాకపోవడం, ఆయా గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగింపు, భూసేకరణ కూడా జరగాల్సి ఉంది.

ఈనేపథ్యంలో భూసేకరణ వ్యయం, కాలువ తవ్వకం వ్యయం పెరగడంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.45 కోట్లకు పెంచారు. దీంతో కొద్ది రోజులు పనులు హడావుడి చేసినా మరలా ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గత ఏడెనిమిది సంవత్సరాల నుంచి ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవనాసి రిజర్వాయర్ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, శంకుస్థాపన చేసినప్పటి నుంచి నేటి వరకు అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి దక్కడంతో మధ్యలో నిలిచిపోయిన భవనాసి రిజర్వాయర్ పనులు పునఃప్రారంభమై వేగవంతంగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. భవనాసి రిజర్వాయర్ పూర్తయితే ప్రస్తుతం ఉన్న రెండు వేల ఎకరాల ఆయకట్టుతో పాటు శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆయకట్టులో ఉన్న సుమారు నాలుగు వేల ఎకరాలకు పూర్తి స్థాయిలో ఏడాది పొడవునా నీటి లభ్యత ఏర్పడనుంది. సాగర్ ఆయకట్టు చివరిప్రాంతమైన పమిడిపాడు మేజర్ ఆయకట్టు లోని అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాల పరిధిలోని సుమారు పది వేల ఎకరాలకు సాగునీటి భరోసా కలగనుంది. అదే సమయంలో పలు గ్రామాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కూడా కలుగనుంది. ఇప్పటికైనా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి భవనాసి రిజర్వాయర్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అద్దంకి ప్రాంత రైతులు కోరుతున్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

ఈఈ నల్లూరి మస్తాన్‌రావు


మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, జూలై 13 : క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ సిబ్బందితో శనివారం స్థానిక గీతామందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ నల్లూరి మస్తాన్‌రావు మాట్లాడుతూ సిబ్బంది నిత్యం విద్యుత్ లైన్‌లను పరిశీలిస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందిపై పలు చోట్ల వస్తున్న ఫిర్యాదులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. సమావేశంలో అద్దంకి, మార్టూరు డీఈఈలు సత్యనారాయణ, సురేం ద్రబాబు, డివిజన్ పరిధిలోని ఎఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్‌లకు అదనంగా చెల్లించవద్దు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల మంజూరుకు విద్యుత్ శాఖ అధికారులకు రైతులు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు శనివారం తెలిపారు. డివిజన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు అధికారులు వెంటనే అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం మంజూరైన వ్యవసాయ కనెక్షన్‌లతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వవద్దన్నారు. బల్లికురవ మండలంలో పలువురు రైతుల వద్ద నుంచి అదనంగా వసూలు చేస్తున్నట్లు అందిన ఫిర్యాదుపై విద్యుత్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

మోపాడు కాలువపై వంతెన నిర్మాణం

పామూరు, జూలై 13: మండలంలోని మోపాడు రిజర్వా యర్ ప్రధాన కాలువపై వాకంవారిపల్లి గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఇందుకుసంబంధించిన పనులను శనివారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.గిడ్డయ్యయాదవ్, తిరుపతయ్య, కోదండరామిరెడ్డి పరిశీలించారు. గతంలో కాలువ కట్టపై నడక బ్రిడ్జి ఉండటంతో గ్రామస్థులు ఇబ్బందులుపడేవారు. కాలు వల్లో నీరు ఉధృతంగా ప్రవహించేటప్పుడు నడక బ్రిడ్జిపై రాక పోకలకు చేయడానికి భయపడేవారు. ప్రస్తుతం రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బ్రిడ్జి అవస రం గురించి ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తీసుకుపోయారు. ఆయన ఆదేశాలతో బ్రిడ్జి పనులు చేపట్టడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చురుకుగా సాగుతున్న బ్రిడ్జి పనులు

హడలెత్తిస్తున్న రహదారి


నెరజాముల తాండా సమీపంలో గోతులమయంగా ఉన్న రహదారి

• నలమల్ల అడవిలో అనుమతి లేక నిలిచిన పనులు
• పదేళ్లుగా చొరవ చూపని అధికారులు, పట్టించుకోని పాలకులు

పేరుకు అది జాతీయ రహదారి ఇటువైపు రేణిగుంట సమీపం నుంచి ప్రారంభమై హైదరాబాద్ మహానగరానికి దారితీస్తుంది. నిత్యం వేలాది వాహనాలు ఈ దారి వెంట వెళుతుంటాయి. అయితే నల్లమల్ల అటవీ ప్రాంతానికి రాగానే ఈ జాతీయ రహదారి వాహన చోదకుల సహనానికి పరీక్ష పెడుతుంది. చిట్టడవిలో సింగిల్‌రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇది 565 నంబరు జాతీయ రహదారి దుస్థితి

ఎర్రగొండపాలెం, జూలై 13: జాతీయ రహదారి 565 ఎర్రగొండపాలెం మీదగా హైదరాబాద్‌కు వెళుతుంది. ఈ రహదారి వెంబడి పుల్లలచెరువు మండలంలో రోడ్డుకు ఇరువైపుల 22 కిలోమీటర్ల పొడవునా నల్లమల అడవి ఉంది. ఈ 22 కిలోమీటర్లు జాతీయ రహదారిలో భాగంగా ఉన్నప్పటికీ, సాంకేతికంగా నేటికీ ఆర్‌అండ్‌బీ పరిధిలోనే ఉంది. 2013-14 సంవత్సరాలలో జాతీయ రహదారి పనులు చేసినప్పటికీ, ఈ 22 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారి ఏర్పాటుకు అటవీశాఖ అనుమతి ఇవ్వలేదు. దీంతో నేటికీ ఆర్‌అండ్‌బీ పరిధిలోనే ఉంది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం నుంచి పుల్లలచెరువు మండలం మల్లాపాలెం క్రాస్ రోడ్డు వరకు జాతీయ రహదారి నిర్మించలేదు. గతంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డులోనే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ రోడ్డులో ట్రాఫిక్ పెరగడంతో తరచూ రోడ్డు మరమ్మతుకు గురవుతోంది. రహదారి అంచులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డుపై అనేక చోట్ల గోతులు పడ్డాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

2021లో నిధులు వచ్చినా...

2013-14లో ప్రారంభమైన ఈ జాతీయ రహదారిలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి 2021లో ప్రపంచ బ్యాంకు నిధులు ఇచ్చింది. రూ.50 కోట్లతో 45 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి నిధులు వెచ్చించాలని నిర్ణయించారు. అయినప్పటికీ, ఈ 22 కిలోమీటర్లకు నిధులు వెచ్చించి రోడ్డు వేయలేదు. ఇంచుమించు ఎనిమిదేళ్ల కాలం గడిచినప్పటికీ, అటవీశాఖ అనుమతులు తీసుకోక పోవడంతో అడవిలో 22 కి.మీ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. సింగిల్‌రోడ్డుగానే నేటికీ మిగిలి ఉంది. దీంతో ఈ అడవి మార్గంలో ప్రయాణించాలంటే ప్రయాణికులు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రహదారి అంచుల్లో తారు కోతకు గురైంది. రోడ్డుపై అడుగులోతు గోతులు పడి ఉన్నాయి. ఎదరుగా వచ్చే వాహనాలను తప్పించడానికి అంచుల్లోకి కారును దించితే కింద బ్యానెట్ రోడ్డుకు గుద్దుకొని మరమ్మతులకు గురవుతోంది. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అయినప్పటికీ, మరోమార్గం లేకపోవడంతో వాహన చోదకులు అనివార్యంగా ఈ దారినే రాకపోకలు సాగిస్తున్నారు. నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి వెళ్లే బస్సులు అన్ని ఎర్రగొండపాలెం వైపు నుంచి ఇదే రోడ్డు నుంచి హైదరబాద్ వెళ్ళాల్సి ఉండడంతో వాహనచోదకులుతో పాటు ప్రయాణికులు అవస్థలుకు గురవుతున్నారు. వాహనాలు మర్మత్తులకు గురైన సమయంలో ప్రయాణికులు కూడా రాత్రిపూట రోడ్లపై అడవిలో ఇబ్బందులకు గురవుతున్నారు.


ప్రమాదభరితంగా రోడ్డు అంచులు

మరమ్మతులు చేయరూ..!

నిత్యం రద్ధీగా ఉన్నప్పటికీ, గతంలో ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతులు చేస్తారనుకుంటే అదిలేదు. ఆర్‌అండ్‌బీ పరిధిలో రోడ్డు కావడంతో అటవీశాఖ అనుమతి లేదని జాతీయ రహదారి అథారిటీ ఇంజనీర్లు మరమ్మతులు చేయడానికి చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన పాలకులైన అడవిలో నిలిచిన 22 కి.మీ పొడవునా రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతి మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తారని ప్రకాశం, పల్నాడు జిల్లాలలో ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అవీ.. ఇవీ..

మురుగునీటిలోనే తాగునీటి కొళాయి


మురుగునీటి మధ్యన ఉన్న కొళాయి

గిద్దలూరు, జూలై 13 : పట్టణంలోని నల్లబండ బజారు చివరన ఉన్న మంచినీటి కొళాయి మురుగునీటి మడుగు మధ్యలో ఉంది. ఈ వీధిలో ప్రధానంగా జంగాల కుటుంబాలు నివసిస్తున్నా యి. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సాధారణ ప్రజల నివాస గృహాలు కూడా ఉన్నాయి. పబ్లిక్ కొళాయి వద్ద నీటిని పట్టుకొనే సమయంలో కిందపడే వృథా నీరు దూరంగా వెళ్లే మార్గం లేక పోవడంతో అక్కడే నిలిచిపోతోంది. దాంతో ఆ వృథా నీరు బురదనీటిగా మారి దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారవుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడ నీరు పట్టుకోవాలంటే బురదనీటిని తొక్కుకుంటూ ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో నీరు నిల్వలేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

డెడ్‌బాడీ ఫ్రీజర్ ఏర్పాటు


ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కొమరోలు, జూలై 13: దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొమరోలులోని ప్రభుత్వ వైద్యశాల వద్ద డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. కొమరోలు పరిసర ప్రాంతాల వారి కోసం ఈ ఫ్రీజర్ బాక్స్‌ను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు లొక్కు శరత్‌బాబు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు కామూరి శ్రీనివాసరెడ్డి, వైద్యులు చైతన్యదీపక్‌ల సమక్షంలో దీనిన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా మృతిచెందితే వారి మృతదేహాన్ని నిల్వ ఉంచడానికి ఇక్కడ ఇప్పటి వరకు ఫ్రీజర్ లేదన్నారు. దీంతో కుటుంబ సభ్యులు చివరిచూపు చూసేందుకు కూడా అవకాశం లేని సందర్భాలు ఉన్నాయన్నారు. ఫ్రీజర్ బాక్సులు కావాలంటే సుదూర ప్రాంతాలైన గిద్దలూరు, పోరుమామిళ్ల నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు దాతల సహకారంతో డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను కొనుగోలు చేసి ప్రభుత్వ వైద్యశాల వద్ద అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో సభ్యులు కారుమంచి పీరయ్య, సిద్ధయ్య, సునీల్, కుమార్ నాయుడు, సుమన్, రామ్‌మోహన్, బెంజిమెన్ అంజి, చెన్నయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి శాంతికల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామికి శాంతికళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కాశిం పీరుకు పగలు ఉత్సవం


పగలు ఉత్సవంలో కాశింపీరు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని మార్కాపురం పట్టణం గొర్లగడ్డలోని కాశింపీరుకు సంప్రదాయ బద్ధంగా శనివారం పగలు ఉత్సవం నిర్వహించారు. వివిధ పుష్పమాలలు, పూలగుమ్మటం, దట్టీలు, వెండి గొడుగులు, నాగాభరణాలు అలంకరించి కాశింపీరును మకానంలోనుంచి బయటకు తీసుకొచ్చారు. భక్తులు పెద్దఎత్తున హర్షధ్వానాలు చేశారు. పీరును ఎత్తుకొని భక్తులు అగ్నిగుండం తొక్కారు. ముజావర్లు భవిష్యవాణి వినిపించారు. మొక్కలు తీర్చుకున్న భక్తులు పీరుకు బొరుగులు, పప్పులు ఫాతేహాలుగా సమర్పించారు. పీర్ల గుండంలో కొబ్బరి వేసి కాల్చారు. అనంతరం పట్టణ వీధులలో పీరుకు ఉత్సవం నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా దర్శించుకుని పూజలు చేశారు.

చినుకు పడితే చిత్తడే


తర్లుపాడులోని ప్రధాన వీధి దుస్థితి

తర్లుపాడు, జూలై 13: మండలంలోని పలు గ్రామాల్లో చినుకుపడితే ప్రధాన వీధులు చిత్తడిగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షాలకు కూడా ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండి ప్రజలు నడవలేని దుస్థితి ఏర్పడింది. తర్లుపాడులోని ప్రధాన వీధిలో నేరెళ్ల శంకర్ ఇంటి ముందు మోకాళ్ల లోతు గుంతలు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడినా నీరు పోయే మార్గం కూడా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రధాన వీధి కావడంతో వేలాది మంది ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ వీధిలోకి వస్తే ముక్కుమూసుకుని నడవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. గ్రామంలో చిన్నపాటి గుంతలు కూడా పంచాయతీ అధికారులు పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తర్లుపాడులోని కోట వీధి, రైల్వే గేటు వద్ద బీసీ కాలనీలోని రోడ్లకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. తర్లుపాడులోని ప్రధాన వీధిలోని రహదారి దుస్థితి గురించి పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు కనీసం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పలు కేసులను ఛేదించిన పోలీసులు

బేస్తవారపేట, జూలై 13: మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో చోరీ కేసులపై దృష్టిసారించిన పోలీసులు పలు కేసులను ఛేదించారు. తక్కువ సమయంలో బేస్తవారపేట పోలీసులు కేసులను ఛేదించినట్లు కంభం సీఐ రామకోటయ్య విలేకర్ల సమావేశంలో తెలిపారు. బేస్తవారపేట ఒంగోలు రోడ్డులోని రైతు భరోసా కేంద్రంలో సీలింగ్ ఫ్యాన్లు, టీవి చోరీ ఘటనతోపాటు, రైతులకు సంబంధించిన బోర్ల కేబుల్, శంకర్‌రెడ్డి ఫ్యార్మసీ కళాశాలవద్ద ఫినిస్సింగ్ వైరు, రాగితీగ చోరీ, టీ.వి, పూసలపాడు బస్టాండ్ సమీపంలో వెలిగొండ నిర్వాసితుల కోసం నిర్మింస్తున్న కాలనీలో ఇనుప గేట్లు, టన్ను ఇనుప రాడ్లు ఈ మధ్యకాలంలో చోరీకి గురయ్యాయి. అయితే పాపాయిపల్లె గ్రామానికి చెందిన కత్తి రోహిత్ ఆటో నడుపుకుంటూ మద్యానికి బానిసై డబ్బులు సరిపడక ఇటువంటి చోరీలకు పాల్పడుతున్నాడని పోలీసులు గుర్తించారు. రైతుభరోసా కేంద్రంలో చోరీ చేసి దరగ రోడ్డులో ఒక గదిలో చోరి చేసిన ఫ్యాన్లు టీవీ దాచి ఉంచగా, వాటిని స్వాధీనం చేసుకొని రోహిత్‌ను అరెస్టు చేశారు. అలాగే బాపట్ల జిల్లా మార్టూరు గ్రామానికి చెందిన చిన్నకత్తుల ఇస్రాయిల్ శంకర్‌రెడ్డి పార్మసీ కళాశాలలో చోరీ చేశాడు. ఈ ఘటనలో కలసపాడు మండలానికి చెందిన బొమ్మి కాశయ్య, నుంచి టీవీని స్వాధీనం చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీ.ఐ.రామకోటయ్య తెలిపారు. బేస్తవారపేట ఎస్సై నరశింహరావు తన సిబ్బందితో తక్కువ సమయంలో కేసులను ఛేదించినందుకు అభినందించారు.

కాలినడకన తిరుమలకు

• కూటమి అధికారంలోకి రావాలని మొక్కుకున్న టీడీపీ అభిమాని


కాలినడకన బయలుదేరిన వెంకటేష్

పెద్దదోర్నాల, జూలై 13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పట్టణానికి చెందిన దాసరి వెంకటేష్ శనివారం కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. దోర్నాలకు చెందిన వెంకటేష్ టీడీపీ అభిమాని. కాగా ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటూ తిరుమలకు కాలినడకన వస్తానని మొక్కుకున్నాడు. ఈ క్రమంలో స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం కాలినడకను ప్రారంభించాడు. ఆయనకు టీడీపీ మండల నాయకులు బండారు సుబ్బరాయుడు, వెచ్చా హర గోపాల్, కొప్పుల సుబ్బారెడ్డి, ఏర్వ మల్లికార్జునరెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, రావిక్రింది సుబ్బరత్నం, నాగెళ్ల రమేష్, చలపతి, జనసేన నాయకులు గుర్రం ప్రసాద్, పండు, తదితరులు సంఘీభావం తెలిపారు. కొంత దూరం ఆయన వెంట నడిచారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

• ఉపాధ్యాయులకు డీఎంహెచ్‌వో సురేష్ సూచన


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సురేష్

పెద్ద దోర్నాల, జూలై 13: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు అప్రమ త్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సురేష్ సూచించారు. మండలంలోని చింతల, కొర్రప్రోలు, దోర్నాల, అయిన ముక్కుల గ్రామాల్లోని ఏపీఈ డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలని, వంటశాలల్లో, వసతి గదుల్లో శుభ్రతను పాటించాలని ఆహార పదార్థాలు చెడిపోకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అదే సమయంలో వైద్యసిబ్బందితో రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శిస్తూ ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని, పెండింగులో ఉన్న సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు వందశాతం పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.యాగ్నిక్, సాయిప్రశాంతి, శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి మంత్రి స్వామి పరామర్శ


నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రిస్వామి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

మార్కాపురం, జూలై 13: కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం పరామర్శించారు. స్థానిక జవహర్ నగర్ కాలనీలోని నారాయణరెడ్డి స్వగృహానికి వచ్చిన మంత్రి స్వామి ముందుగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలు కొని ఈ నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాలకు రావాలని చెప్పారు. అంతేకాక మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అక్కడే ఉన్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబులు డివిజన్‌లోని పలు సమస్యలను మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా అధికారుల బదిలీల ప్రక్రియ చేపట్టకపోవడంతో కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నట్లు వివరించారు. ఐదేళ్లపాటు ఇబ్బందులకు గురైన కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థ గురించి కూడా ఇంకా స్పష్టత లేకపోవడంతో తాము ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేక పోతున్నామని మంత్రికి తెలిపారు. స్పందించిన మంత్రి స్వామి త్వరలోనే ప్రభుత్వం అధికారుల బదిలీల ప్రక్రియను ప్రారంభిస్తుందన్నారు. ఈలోపే జాబితాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వలంటీర్ల వ్యవస్థపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే విధివిధానాలు తెలియజేస్తారన్నారు. అప్పటివరకు వేచి చూడాల్సిందేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పలకల పరిశ్రమను ఆదుకోండి

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని పలకల పరిశ్రమకు పూర్వవైభవం తీసుకు రావాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిని బీజేపీ నాయకులు కోరారు. శనివారం ఆయన మార్కాపురం వచ్చిన సందర్భంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురంలోని పలకల పరిశ్రమపై వేలాది మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పరిశ్రమను ఆదుకోవా లన్నారు. ఏపీలో విద్యార్థులకు ఇస్తున్న విద్యాదీవెన కిట్లలో పలకలను, ఎగ్జామ్ ప్యాడ్‌లను ఉండేలా ప్రభుత్వం జీవో తీసుకురావాలని కోరారు. ఎస్సీ, బీసీ విద్యార్థులకు శాశ్వత హాస్టల్ భవనలు నిర్మించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు పి.కృష్ణారావు, బి.కృష్ణ, పి.రామచంద్ర, డి.చంద్రశేఖర్, సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, సురేష్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

అడుగంటిన కంభం చెరువు

• ఐదు మండలాల్లో పడిపోతున్న భూగర్భజలాలు
• ఆందోళనలో ఆయకట్టు రైతులు


చిన్నకంభం తూము వద్ద చేరని నీరు

కంభం, జూలై 13 : రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ, ఇతర రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకుంటున్నాయి. కానీ ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన కంభం చెరువుకు ఇప్పటి వరకు ఒక్క అడుగుమేర కూడా నీరు రాలేదు. దీంతో ఆయకట్టు రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. ప్రస్తుతం కంభం చెరు వులో 4 అడుగులకు మించి నీరు లేదు. చిన్నకంభం తూము పరిసరాలు పూర్తిగా ఎండిపోయాయి. పెద్దకంభం తూము వద్ద కొద్దిపాటి నీరు వస్తుండడంతో ఆ పరిధిలోని రైతులు సాగు చేసిన మెట్ట పైర్లను బతికించుకొనేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మెట్ట పైర్ల సాగు ఇలా ఉంటే చెరువుకింద మాగాణి భూములు బీళ్లగా మారాయి. కంభం చెరువు చివరి ఆయ కట్టులో పదేళ్లకు పైగా సాగుకు నోచుకోలేదు. పశ్చిమ ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవ డంతో చెరువులోని కొద్దిపాటి నీరు ఉండడంతో బోర్లు మొరాయిస్తున్నాయి. పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది. రైతులు పొలాలు దున్నుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ కృష్ణ



మాట్లాడుతున్న సంపత్ కృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13: రాష్ట్రంలో నూతన ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రీయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.సంపత్ కృష్ణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. తొలుత నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి విద్యాశాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. పాఠశాల స్థాయిలోని సమస్యలు బాషా బోధకులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి తీర్మానాలు చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాతపింఛన్ విధానం అమలు చే యాలన్నారు. పాఠశాల స్థాయిలో బోధనా మాధ్యమంగా తమ ప్రాంతీయ మాతృభాషలను ఉంచుకునే అవ కాశం కల్పిస్తూ 12వ తరగతి వరకు విద్యార్థులు తమ బోధనా మాధ్యమాన్ని ఎంచుకునే విధంగా సీబీఎస్ఈ ఆదేశాలు ఇవ్వాలన్నారు. తద్వారా గుణాత్మక విద్యను అందించ వచ్చన్నారు. జీవో నెంబర్ 117 రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. సమావేశంలో పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్, కోశాధికారి రాజాబాబు, సహాధ్యక్షులు ఎర్రిస్వామి, అదనపు ప్రధాన కార్యదర్శులు దయాకర్, పద్మనాబయ్య, ప్రచార కార్యదర్శి సాంబయ్య, మహిళా కార్యదర్శులు డాక్టర్ మున్నంగి రాజకుమారి, లిలితా, ఏసు మేరి, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

వైసీపీలో మరింత సంక్షోభం

• జగన్ వింత నిర్ణయం.. చెవిరెడ్డికి జిల్లా పార్టీ పదవి
• ఆయన జిల్లాలోకి ఎలా వస్తారో చూస్తానన్న మాజీ మంత్రి
• సీనియర్లు మాత్రం గప్‌చుప్
• అధినేత నిర్ణయాన్ని తప్పుపడుతున్న కేడర్
• ఇటు సజ్జల అటు కొందరు జిల్లా నాయకుల మంతనాలు
• సోమవారం ఒంగోలు రానున్న బాలినేని

ఓటమి భారంతో దిగాలుగా ఉన్న జిల్లాలోని వైసీపీ శ్రేణులకు ఆ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి మరో షాక్ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడుగా తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించాలని ఏకపక్ష నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై బాలినేని భగ్గుమన్నారు. ఆ పార్టీ నాయకుల మధ్య గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్గత వ్యవహారం బహిర్గతమై శనివారం పలు మలుపులు తిరిగింది. చివరికి జగన్ వెనక్కు తగ్గకపోతే బాలినేనితోపాటు పలువురు నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేవరకు పరిస్థితి చేరింది. దీంతో సజ్జల శనివారం రంగంలోకి దిగారు. బాలినేనితో ఆయన జరిపిన చర్చలు సఫలీకృతం కాకపోగా జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న జిల్లాలోని ఆ పార్టీలోని అత్యధికశాతం నాయకులు, కార్యకర్తలు బాలినేనికి బాసటగా వెనక్కు తగ్గవద్దని ఒత్తిడి తెస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఓటమి అనంతరం జిల్లాలో కిందిస్థాయి వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు టీడీపీకి జైకొట్టేందుకు దారులు వెతుక్కుంటున్నారు. ఇప్పటికే గిద్దలూరు మున్సిపాలిటీ చేజారి టీడీపీ వశమైంది. ఒంగోలు కార్పొరేషన్ కూడా టీడీపీ పరమయ్యే పరిస్థితి నెలకొంది. మార్కాపురం మున్సిపాలిటీలో పరిస్థితిని చక్కదిద్దుకోలేక ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఇరకాటంలో పడి ఉన్నారు. చీరాలలో వైసీపీ, వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు టీడీపీ బాటపట్టారు. అద్దంకి నగర పంచాయతీలో వైసీపీ పాలకమండలి సభ్యులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. పలువురు జడ్పీటీసీ సభ్యులు అవకాశం కోసం వేచిచూస్తున్నారు. దీంతో జిల్లాలో వైసీపీ పరిస్థితి మరింత దిగజారిపోయింది. ఈ నేపథ్యంలో అధినేత జగన్ పాత పద్ధతిలోనే తీసుకుంటున్న నిర్ణయాలు ఆ పార్టీలో మరింత సంక్షోభ పరిస్థితులకు కారణమయ్యాయి.

చెవిరెడ్డికి పార్టీ అధ్యక్ష పదవి

ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఏపీఐఐసీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అదేసమయంలో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత అధిష్ఠానం చెప్పిన అన్ని కార్యక్రమాలను ఆయనే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత జగన్ జిల్లా అధ్యక్ష పదవికి ఒంగోలు ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ విషయాన్ని జగన్ నేరుగా జిల్లా నాయకులకు చెప్పలేదు. పార్టీ కార్యాలయం నుంచి ఒకరు బాలినేనికి ఫోన్ చేసి జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి మీరుంటారా అని అడిగినట్లు తెలిసింది. ఇప్పుడు మార్పు ఎందుకు, కొంతకాలం వేచి ఉండండని బాలినేని తన అభిప్రాయంగా చెప్పారు. రెండోరోజే బాలినేనికి పార్టీ కార్యాలయం నుంచి మరొకరు ఫోన్‌చేసి ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించాలని జగన్ నిర్ణయించినట్లు చెప్పారు.

బాలినేని రివర్స్

జిల్లా అధ్యక్షుడిగా చెవిరెడ్డిని నియమించాలన్న జగన్ ప్రతిపాదనను వినగానే బాలినేని తీవ్రంగా వ్యతిరేకించారు. అధ్యక్షుడిగా అతన్నే నియమిస్తే జిల్లాలోకి ఎలా అడుగుపెడతాడో చూస్తానంటూ హెచ్చరించి ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది. ఆ తర్వాత ఇదే సమాచారాన్ని జిల్లాలోని మాజీ మంత్రి సురేష్‌తోపాటు మరికొందరు నాయకులకు ముఖ్యంగా వైవీ సుబ్బారెడ్డికి కూడా ఆ పార్టీ నాయకులు తెలియజేసినట్లు తెలిసింది. కొందరు 'ఊ' అంటూ స్పందించగా మరికొందరు సమాచారాన్ని విని ఫోన్ పెట్టేశారు. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగానే ఉన్నట్లు తెలిసింది. మాజీమంత్రి సురేష్‌తోపాటు మరికొందరు జగన్ నిర్ణయం తీసుకుంటే మనకెందుకులే అని సైలెంట్ అయిపోయారు. జిల్లాలోని కొందరు వైసీపీ నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాలినేనికి సమాచారమిచ్చారు. లోక్‌సభ స్థానాలకు వివిధ కారణాలతో వేరే ప్రాంత అభ్యర్థులను రంగంలోకి దింపటం సహజం. కానీ జిల్లా పార్టీ అధ్యక్ష పదవినే వేరే జిల్లావారికి అప్పజెప్పటం ద్వారా స్థానిక నాయకులందరినీ జగన్ చిన్నబుచ్చారని ఆ పార్టీ నాయకులు ప్రధానంగా అభిప్రాయపడినట్లు తెలిసింది. అదే అభిప్రాయంతో కొందరు బాలినేనికి ఈ విషయంలో తలొగ్గొద్దని మీ నిర్ణయమే మా నిర్ణయమని చెప్పినట్లు సమాచారం. ఆ పార్టీ తరఫున గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలలో దర్శి ఎమ్మెల్యే మౌనరాగం పాటించగా వైపాలెం ఎమ్మెల్యే బాలినేనికి ఫోన్ చేసి అన్నా మీరే ఆలోచించండని చెప్పినట్లు తెలిసింది.

రంగంలోకి సజ్జల

జగన్ నిర్ణయంపై బాలినేని రివర్స్ కావడంతో అధిష్ఠానం ఆలోచనలో పడింది. వెంటనే ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జలను రంగంలోకి దింపారు. ఆయన శనివారం బాలినేనిని కలిసి మంతనాలు ప్రారంభించారు. పార్టీ అధ్యక్ష పదవి వేరే జిల్లావారికి ఇచ్చే పద్ధతిని తాను అంగీకరించలేనని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మాగుంటను కాదని చెవిరెడ్డిని తేవటమే జగన్ చేసిన మొదటి తప్పని మరోసారి స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా జగన్ మారకపోతే ఈ పార్టీని ఎవరూ కాపాడలేరని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది.

వైవీపై భారం మోపండి

ఇలాఉండగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై జిల్లా పార్టీని నడిపే భారాన్ని ఎందుకు మోపకూడదని జిల్లాలోని కొందరు ముఖ్య నాయకులు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లటం విశేషం. 2014లో ఎంపీగా గెలుపొందిన ఆయన కొద్దినెలలకే జిల్లా పార్టీ కార్యాలయానికి తాళాలు వేశారు. ఆ తర్వాత ప్రతిపక్షంలో పార్టీ బాధ్యతను బారాన్ని బాలినేని, ఇతర నాయకులు తీసుకున్నారు. ఇప్పుడు ఓటమితోపాటు ఆర్థికపరమైన ఇబ్బందులతో జిల్లాలోని నాయకులు ఉన్నారు. అప్పనంగా పదవి పొందిన వైవీకి పార్టీ బాధ్యతలు అప్పగించి ఆర్థిక అవసరాలు తీర్చమని కొందరు సూచించినట్లు తెలిసింది.

రేపు ఒంగోలుకు బాలినేని

ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా బాలినేని సోమవారం ఒంగోలు రానున్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో వైసీపీ కార్పొరేటర్లు పార్టీ మారే ఆలోచనతో ఉండటం, జిల్లా పార్టీ అధ్యక్ష పదవిపై సంక్షోభం నెలకొన్న దశలో ఆయన ఒంగోలు రానుండటం విశేషం. కార్పొరేటర్లను కాపాడుకోవటంతోపాటు జగన్ తీసుకుంటున్న ఒంటెత్తు పోకడ నిర్ణయాలపై తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తపరిచే అవకాశం ఉంది. ఇప్పటికిప్పుడు మరో పార్టీలోకి ఆయన వెళ్లే అవకాశాలు లేనప్పటికీ వైసీపీ వ్యవహారాలకు దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

» నిరుపయోగంగా టాయిలెట్లు

» ప్రయాణికులు లేక వెలవెలబోతున్న వైనం

దర్శి, జూలై 13: ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ లోపంతో అధ్వానంగా మారింది. కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నీ బస్సులు బస్టాండ్‌కు రాకపోవటంతో అధికశాతం మంది ప్రయాణికులు అక్కడకు రావటం లేదు. బస్టాండ్ ఆవరణలో నిర్మించిన టాయిలెట్ గదుల తలుపులు విరిగిపోయి చాలాకాలంగా పనిచేయటం లేదు. నీటి వసతిలేక దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. కనీసం మంచినీటి వసతి కూడా లేదు. కుళాయిలు నీళ్లు లేక ఖాళీగా ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బస్టాండ్‌కు రావటం లేదు. ప్రధానంగా హైదరాబాద్, నిజామాబాద్ నగరాలకు వెళ్లే బస్సులు దర్శి పట్టణంలో నుంచి నేరుగా వెళ్తున్నాయి. పొదిలి, అద్దంకి, వినుకొండ డిపోలకు చెందిన పాసింజర్ సర్వీసులు మాత్రమే బస్టాండ్‌కు వస్తున్నాయి. అన్నీ బస్సులు బస్టాండ్‌కు రాకపోవటంతో ప్రయాణికులు ఎక్కువమంది దర్శి పట్టణంలో వేచి ఉండి ఎక్కుతున్నారు. అక్కడ కనీస వసతులు లేకపోవటంతో బస్టాండ్ అలంకారప్రాయంగా మారింది. అక్కడ ఒక ఆర్టీసీ ఉద్యోగి, మరోపార్శిల్ సర్వీస్ ఉద్యోగి అందుబాటులో ఉంటున్నారు.


దర్శి ఆర్టీసీ బస్టాండ్


నిరుపయోగంగా టాయిలెట్ రూములు


నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న మంచినీటి కొళాయిలు

ఆకతాయిలకు అడ్డాగా మారిన బస్టాండ్

ఆర్టీసీ బస్టాండ్ వద్ద జనసంచారం లేకపోవటంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. పట్టపగలు బస్టాండ్ ఆవరణలో మద్యం సేవిస్తున్నారు. రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సుమారు రూ.25 లక్షలతో బస్టాండ్‌కు అన్ని హంగులు ఏర్పాటుచేశారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేయటంతో బస్సుల సంఖ్య తగ్గిపోయింది.

ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావటంతో ఆర్టీసీ బస్టాండ్‌లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటుచేసి పూర్వవైభవం తేవాలని ప్రజలు కోరుతున్నారు.

తూర్పుగంగవరం ఆసుపత్రి అభివృద్ధికి కృషి

» ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, జూలై 13: తూర్పుగంగవరం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. నిధులు సమకూర్చి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. శనివారం జరిగిన తూర్పుగంగవరం పీహెచ్‌సీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి ఆవరణలో గదుల కోసం ఎంపీ మాగుంట, టీడీపీ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మితో సంప్రదించి అదనపు నిధులు సమకూర్చి నిర్మాణం చేపడతామన్నారు. ఆసుపత్రిలో అభివృద్ధి నిధులతో చేపడుతున్న పనుల వివరాలు ముందుగా తమదృష్టికి తీసుక రావాలన్నారు. ఈ సందర్భంగా పలుసమస్యలను వైద్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఆసుపత్రిలో మందుల నిల్వ ఉంచేందుకు ఉన్న గది సరిపోవడంలేదని డాక్టర్ మౌనిక తెలిపారు. దీంతో బయట వరండాలో మందులు ఉం చాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. లాబ్‌లో పరికరాలు ఉన్నప్పటికి గది సరిపోక ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించేందుకు సరిపడ హాలు లేదన్నారు. ప్రతి ఏటా రూ.లక్షా 75 వేల ఫండ్ వస్తుందని చెప్పారు. ఆ నిధులతో మందుల కొనుగోలు, ఆసుపత్రిలో చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు.

సమావేశంలో వైద్యులు సీహెచ్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలత, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. శనివారం తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన పారిశుధ్య కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు ఆవాసాలుగా ఉండే మురుగుపై ఫినాల్ చల్లించి దోమలను నివారించాలన్నారు. జ్వరపీడితులకు డెంగ్యూ మలేరియా వంటి పరీక్షలు చేయించి తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వైద్యసిబ్బంది బాధ్యతా పని చేస్తూ ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యురాలు మౌనిక మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య లోపాన్ని గుర్తించి తాము పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లినా సరిగా స్పందించటం లేదన్నారు. సమావేశంలో వైద్యులు శ్రీకాంత్, సర్పంచ్ సుమలత, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థాన భూములను ఆక్రమిస్తే చర్యలు

» ఈవో గిరిరాజు నరసింహబాబు

పామూరు, జూలై 13: పామూరు మదనవేణుగోపాల, వల్లీభుజంగేశ్వర, వర దరాజ, ఆంజనేయ స్వామివార్లకు చెందిన భూములు, ఇనాం భూములను ఆక్ర మిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈవో గిరిరాజు నరసింహబాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో దేవస్థానానికి చెందిన భూములను సర్వే యర్ పవన్, ఆలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. త్వరలో పూర్తిస్థాయిలో భూములను కొలతలు వేసి హద్దులు వేస్తామన్నారు. ఈసందర్భంగా 256/2లో గల ఇనాం భూమిలో కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్న కొందరు తాము భూ ములను ఆక్రమించుకోలేదని తెలిపారు. కొనుగోలు చేసుకొని ఇళ్లు నిర్మించుకున్నట్టు ఈవోకు తెలిపారు. దేవస్థాన, ఇనాం భూములు కొనుగోలు, అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆలా కొనుగోలుచేస్తే నేరమన్నారు. దేవస్థాన భూముల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించుకొన్న వారి జోలికి వెళ్లకుండా పేదలు ఇళ్లు కట్టుకొంటే సమస్య వచ్చిందా పలువురు ప్రశ్నించారు. ముందుగా వాటిని తొలగించి మా దగ్గరకు రావాలన్నారు. ఒక్కొక్కటిగా అన్ని భూముల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి కొలతలు వేసి ఫెన్సింగ్ వేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్ పి.రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.


దేవస్థాన భూములను పరిశీలిస్తున్న ఈవో నరసింహబాబు

బండిదారిలో ఆక్రమణలు తొలగిస్తాం

దర్శి, జూలై 13: దర్శి - కురిచేడు రోడ్డులోని బండిదారి ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని తహసీల్దార్ జీ సుజాత శనివారం ప్రకటనలో తెలిపారు. బండిదారి స్థలం తెర వీడేనా శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. దర్శి రెవెన్యూలోని 244 సర్వే నెంబర్‌లో 1.65 ఎకరాల లోకల్ ఫండ్ రోడ్డు భూమి, 247, 248, 266 సర్వే నెంబర్లలో 9 ఎకరాల బండిదారి భూమి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆ బండిదారి భూమి ఎక్కడ ఉన్నదో గుర్తించేందుకు అధికారులతో సర్వే చేయిస్తామని తెలిపారు. హద్దులను గుర్తించాక కంచెను ఏర్పాటు చేసి ఆ భూముకి రక్షణ కల్పిస్తామని తహసీల్దార్ ఆప్రకటనలో పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్టుకు గాయాలు

పామూరు, జూలై 13: జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను బైకిస్టు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని చిలం కూరుకు చెందిన ఎర్రసింగ్ వెంకటేష్ అనే యువకుడు పామూరు నుంచి స్వ గ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో వగ్గంపల్లి గ్రామంవద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. పామూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించినట్లు బంధు వులు తెలిపారు.

మోపాడు కాలువపై వంతెన నిర్మాణం


చురుకుగా సాగుతున్న బ్రిడ్జి పనులు

పామూరు, జూలై 13: మండలంలోని మోపాడు రిజర్వాయర్ ప్రధాన కాలువపై వాకంవారిపల్లి గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఇందుకుసంబంధించిన పనులను శనివారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.గిడ్డయ్యయాదవ్, తిరుప తయ్య, కోదండరామిరెడ్డి పరిశీలించారు. గతంలో కాలువ కట్టపై నడక బ్రిడ్జి ఉండటంతో గ్రామస్థులు ఇబ్బందులుపడేవారు. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహించేటప్పుడు నడక బ్రిడ్జిపై రాకపోకలకు చేయడానికి భయపడేవారు. ప్రస్తుతం రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బ్రిడ్జి అవసరం గురించి ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తీసుకుపోయారు. ఆయన ఆదేశాలతో బ్రిడ్జి పనులు చేపట్టడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలల సిబ్బంది కార్యవర్గం

ఒంగోలు(విద్య), జూలై 13: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాసరావు(టంగుటూరు), కార్యదర్శిగా ఎస్‌కే అబ్దుల్‌హయత్(కంభం), కోశాధికారిగా ఎన్‌సీ సాయికిషోర్(టంగుటూరు) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఉద్యోగులు అభినందించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

తాళ్లూరు, జూలై 13: మొక్కలు వాతావరణ సమతుల్యాన్ని కాపాడతాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం పీహెచ్‌సీ ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలో నీడని చ్చే మొక్కలు నాటడం వల్ల రోగులకు నీడ నివ్వటం జరుగుతుందన్నారు. నాటిన మొక్కలు పెద్దవిగా ఎదిగే వరకు పరిరక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ఆవరణలో ఎంపీపీ బాదం మొక్కను నాటారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, శ్రీకాంత్, వైద్యసిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

పామూరు(సీఎస్‌పురం), జూలై 13: వేగనియంత్రణ అదుపుకాక విద్యుత్ స్థంబాన్ని కారు ఢీకొన్న సంఘటన శనివారం సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లిలో చోటుచేసుకుంది. విద్యుత్ శాఖకు చెందిన ఓఉద్యోగి సీఎస్‌పురం నుంచి కనిగిరికి వెళుతున్నారు. ఈక్రమంలో పెదగోగులపల్లి గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా గేదెలు రావడంతో, వాటిని తప్పించబోయి విద్యుత్‌స్థంబాన్ని కారు ఢీకొట్టింది. ఈ ఘటనతో విద్యుత్ స్థంబం విరిగిపోయి తీగెలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వసతి గృహానికి ఒనగూరిన సౌకర్యాలు

» విద్యార్థినుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 13: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నిరకాల వసతులు కల్పించారు. ఈనెల 7న ఎమ్మెల్యే సదరు వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తొలుత సమస్యలు చెప్పేందుకు వెనుకాడారు. ఈక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దాదాపు రెండు గంటలపాటు వారితో కలసిపోయి సమస్యలను రాబట్టారు. గోడలపై పెయింట్ పోయి పిచ్చి గీతలు ఉన్న దృశ్యాలను ఎమ్మెల్యే గమనించారు. మంచినీటిని బయటి నుంచి బబుల్ కొనుగోలు తెచ్చుకోవటం వంటి విషయాలను తెలుసుకున్నారు. హాస్టల్ గదుల్లో లైట్లు, ఫ్యాన్‌లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్నిఎమ్మెల్యే తెలసుకున్నారు. చీకటి పడితే కిటికీల నుంచి దోమలు తాండవం చేస్తూ కుడుతున్నాయని విద్యార్థినులు ఏకరువు పెట్టారు. సమస్యలన్నీ తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


హాస్టల్ గదులకు వేస్తున్న రంగులు

ఆయా పనులను గత ఐదు రోజుల నుంచి ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చేయించారు. హాస్టల్‌లోని గదులకు రంగులు వేయిస్తున్నారు. విద్యార్థినులు ఉండే గదులకు ఫ్యాన్లు, లైట్లు వేయించారు. ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుచేయిస్తున్నారు. కిటికీలకు దోమలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. టాయిలెట్స్‌ను శుభ్రం చేయించి ఫ్లోర్ లేచిపోయిన ప్రాంతాల్లో టైల్స్ వేయిస్తున్నారు. టాయిలెట్స్‌లకు తలుపులు వేయించారు. దీంతో హాస్టల్ విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గదుల్లో ఫ్యాన్ల ఏర్పాట్లు


టాయిల్‌ట్స్ గదుల వద్ద కొత్త టైల్స్‌వేసి ఏర్పాటుచేసిన తలుపులు

ప్రభుత్వాసుపత్రిలో పరిశుభ్రతకు చర్యలు

కనిగిరి, జూలై 13: ప్రభుత్వాసుపత్రిలో అపరిశుభ్రతపై వైద్యులు స్పందించారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం గది పక్కన ఉన్న మోటార్ వద్ద, వాటర్ సరఫరా పైపు లీకేజీతో ఆసుపత్రిలోని ఆయా ప్రాంతాల్లో పాచిపట్టి దోమలు ప్రబలుతున్నాయి. ఈసమస్యపై 'ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ కంపు' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆసుపత్రి అధికారులు ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. వాటర్ సరఫరా జరిగే పైపు లీకేజీ పనులు చేయించారు. పోస్టుమార్టం గది వద్ద ఉన్న మోటర్ రిపేరు చేయించారు. ఈ పనులను మున్సిపల్ ఛైర్మన్ గఫార్ పరిశీలించారు.


పోస్టుమార్టం గది వద్ద ఉన్న మోటార్‌కు మరమ్మతులు చేస్తున్న మెకానిక్


పీర్ల చావిడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్

దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

ముండ్లమూరు, జూలై 13: దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. శనివారం రాత్రి పులిపాడులో జరిగిన పీర్ల చావిడి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారుల నుంచి తీర్థప్రసాదాలు అందుకున్నారు. తదనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న లలిత్ సాగర్ మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి నెలరోజులలోపే పలు పథకాలను అమలుచేస్తున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానంగా మెగా డీఎస్సీతో పాటు పలు పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో ప్రతిగ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తాగునీరు, డ్రైనేజీలతో పాటు రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీలు కె.నాగరాజు, వరగాని పౌలు, మాజీ సర్పంచ్ గణపం వెంకటేశ్వర రెడ్డి, ఏరేసు వెంకటేశ్వరరెడ్డి, ఆలమూరి రమణారెడ్డి, లక్కిరెడ్డి గంగిరెడ్డి, వెంకటరెడ్డి, ఏరేసు పిచ్చిరెడ్డి, మొదుళ్ళ రమణారెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, జిల్లెలమూడి చౌదరి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, గోపన బోయిన పిలిప్‌రాజు, కాసా అంజిరెడ్డి, ఆకుమళ్ళ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ రామానాయక్

పామూరు, జూలై 13: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సీఐ ఎం.రామానాయక్ తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మొహర్రం నిర్వాహకులు, వడ్డెపాలెం రామాలయ నిర్వాహకులతో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత సామరస్యానికి చిహ్నంలా జరుపుకొనే మొహర్రం వేడుకల్లో భాగంగా జరిగే పెద్దపీర్ల సరగత్తు గ్రామోత్సవాలు, అంకాలమ్మవీధి రామాలయ వేడుకలు ఒకేరోజున ఉన్నాయన్నారు. ఒకరికొకరు సంప్రదాయాలను గౌరవించుకొంటూ గ్రామోత్సవాలను జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విఘాతానికి అవకాశాలు ఇవ్వకుండా నిర్వాహకులందరూ బాధ్యతగా ఉంటూ పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ ఎం.సైదుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రామాపురం ఎత్తిపోతల మంజూరుకు చర్యలు


ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, ఇరిగేషన్ ఈఈతో చర్చిస్తున్న దొనకొండ టీడీపీ నాయకులు

దొనకొండ, జూలై 13 : మండలంలోని రామాపురం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులడు కామేపల్లి చెంచయ్య ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ద్వారా ఇరిగేషన్ ఈఈ వి.హజ రత్తయ్యకు శనివారం విజ్ఞప్తి చేశారు. దామచర్ల జనార్దన్ ఇంటివద్ద ఈఈని రామాపురం గ్రామానికి చెందిన చెంచయ్య కలిశారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రామాపురం వద్ద గుండ్ల కమ్మపై ఎత్తిపోతల పథకం నిర్మాణం రూ. 13 కోట్లతో మంజూరయిందన్నారు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టెండర్లు పిలవకుండా ఎత్తిపోతల పథకాన్ని గాలికొదిలేసిందని చెప్పారు. ఫలితంగా రైతులు పడుతున్న ఇబ్బందులను ఈఈకి చెంచయ్య వివరించారు. స్పందించిన ఈఈ ఎత్తిపోతల పథకం ప్రాముఖ్యతను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లి మంజూరుకు చర్యలు చేపడతామన్నారు.

ఉపాధ్యాయల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ నిరంతర పోరు


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భానుమూర్తి

దర్శి, జూలై 13: ఉపాధ్యాయల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తూ ముందంజలో ఉందని ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి పేర్కొన్నారు. దర్శిలో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఏపీటీఎఫ్ ఉద్యమ, అధ్యయన తరగతులకు జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించారు ఈసందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ 1947 నుంచి గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయల సంక్షేమం కోసం, విద్యా ప్రగతికి ఏపీటీఎఫ్ కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించటంలో నూతన ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగ వరప్రసాదరావు, ఎస్.గురునాధశర్మ, బెజవాడ రఘుబాబు, డి.శ్రీనివాసులు, నాయబ్‌రసూల్, హనుమంతరావు, ఎల్‌.ప్రసాద్, శివరామకృష్ణ, శేషారావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.





ఎస్పీ శ్రీనివాసరావు (పల్నాడు జిల్లా)



ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ (గుంటూరు జిల్లా)



● పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మాజీ సీజేఐ ఎన్వీ రమణ



పాలనలో ఆధ్యాత్మికతతోపాటు ఆధునికతను జోడిస్తాను. పేదరికం లేని రాష్ట్రమే ధ్యేయం. రాష్ట్రంలో నవ్వులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం జీవితాల్లో ఆనందం నింపుతుందని అందరూ చెబుతుంటే సంతోషకరంగా ఉంది. దేశంలో ఉన్న గొప్ప సంపద కుటుంబ వ్యవస్థ. దీనిని భావితరాలకు అందించాలి. ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న శక్తి భగవంతుడే. ప్రార్థనాలయాలు ఏ మతానికి సంబంధించిన వైనా ఈ భూమిపై లేకపోతే నేరాలు ఘోరాలు ఎన్నో జరిగేవి. సైంటిస్టులు, డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, న్యాయవ్యవస్థ ఇలా అందరూ విధులు ప్రారంభించడానికి ముందు రెండు నిమిషాలు దేవుడిని ప్రార్థిస్తారు. హరేకృష్ణ మూమెంట్, ఇస్కాన్‌లు పోటీ పడి మన సంస్కృతిని కాపాడుతున్నాయి. - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆధ్యాత్మికత.. ఆధునికత

- పాలనతో జీవితాలు ఆనందమయం
- ధర్మాన్ని కాపాడుతున్న ధార్మిక సంస్థలు
- అక్షయ పాత్ర, గోకుల క్షేత్ర సేవలు భేష్
- కొలనుకొండ గోకులక్షేత్రంలో సీఎం చంద్రబాబు నాయుడు

తాడేపల్లి, జూలై 13: ప్రపంచాన్ని ముందుకు నడిపించేది నమ్మకమేనని, మనకు తెలియని ఏకైక శక్తి దేవుడేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. తాడేపల్లి మండలం బైపాస్‌లోని కొలనుకొండ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ అనంత శేష స్థాపన, గర్భాలయ భూస్పర్శ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ ధర్మాన్ని కాపాడడానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండడం అందరి అదృష్టమన్నారు. ప్రభుత్వం తరఫున కూడా ఇలాంటి సంస్థలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఏ కార్యక్రమాన్ని అయినా సజావుగా చేయగలమన్న నమ్మకాన్ని హరేకృష్ణ మూమెంట్ కలిగిస్తుందన్నారు. హరేకృష్ణ మూమెంట్‌తో పోటీ పడి ఇస్కాన్ కూడా కార్యక్రమాలు చేస్తుందని చెప్పారు. మధు పండిత దాస అనుకున్నది సాధిస్తారని, నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడతారని తెలిపారు. హరేకృష్ణ మూమెంట్‌లో సత్య గౌర చంద్రదాస సహా ఐఐటీలో చదివిన వారు 50 మంది ఉన్నారని తెలిపారు. ఇస్కాన్‌లో కూడా ఐఐటీ గ్రాడ్యుయేషన్ పొందిన వారు ఉన్నారన్నారు. తానెప్పుడు వేంకటేశ్వరస్వామినే నమ్ముతానని, తమ కుటుంబ ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి అని చెప్పారు. 2003లో తిరుపతిలో క్లైమోర్ మైన్స్ పేలినప్పుడు తనకు ప్రాణ భిక్ష పెట్టింది వేంకటేశ్వరస్వామి అని చెప్పారు.

అమరావతి.. ఆధ్యాత్మికం

హరేకృష్ణ గోకుల క్షేత్రంలో 6.5 ఎకరాల్లో వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం జరుగుతుందని 216 అడుగుల ఎత్తున్న ప్రధాన గోపురంతో వేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారని, అమరావతిలో ఇదొక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు. కూటమి గెలుపుతో ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. తెలుగువారు నెంబర్ వన్‌గా ఉండాలని తాను కోరుకుంటానన్నారు. ప్రపంచంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో 30 శాతం మంది తెలుగువారు ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల ధరలు పెరిగాయన్నారు. ఒక శాతం వృద్ధి రేటు పెరిగితే రాష్ట్రానికి 15 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

అన్న క్యాంటిన్లకు భోజన సరఫరా బాధ్యతలను గతంలో అక్షయపాత్రకు తాను అప్పగించినట్లు చంద్రబాబు చెప్పారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు నాడు నిర్వహించగా గత ప్రభుత్వం మూసేసిందన్నారు. త్వరలో రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. శ్రీకృష్ణ ఆలయం ఉన్న పది కిలోమీటర్ల పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదని లాలా ప్రభుపాద స్ఫూర్తితో అక్షయపాత్రను ప్రారంభించారన్నారు. 23 ఏళ్లలో 400 కోట్ల మందికి భోజనం పెట్టారని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో పరిశుభ్రంగా నాణ్యతతో 22 లక్షల మందికి ప్రతి రోజూ అక్షయపాత్ర ద్వారా ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు, సక్కు గ్రూప్, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూప్ రూ.కోటి చొప్పున ఇస్కాన్ సంస్థకు విరాళం ప్రకటించగా చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, రాజ్యసభ సభ్యుడు రవీంద్రకుమార్, మంత్రి సవిత, మంత్రి నారాయణ, గోకుల క్షేత్ర, ఇస్కాన్ ప్రతినిధులు మధు పండిత్ దాస, సత్య గౌర చంద్రదాస, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్‌డూడి, మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజు, పలువురు అధికారులు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఒరవడి: జస్టిస్ రమణ

అమరావతిలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకా రం చుట్టడం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. ఆధ్యాత్మికతతోపాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడడం ముఖ్యమన్నారు. గోకుల క్షేత్ర నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందన్నారు. ఎవ్వరూ ఆర్థాకలితో ఉండకూడదనే అక్షయ పాత్ర ద్వారా ఇస్కాన్ అన్నదానం చేస్తుందని చెప్పారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ తోడ్పాటు ఇచ్చిందన్నారు. అన్న క్యాంటీన్లను త్వరలో పునరుద్ధరించడం శుభపరిణామమని చెప్పారు.

ఉత్తమ నగరంగా అమరావతి : మధు పండిత్

ప్రపంచ ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్ తెలిపారు. ఉత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వెలుగొందాలన్నారు. పాండవులు నడయాడిన అమరావతిలో నవ యుగ ధర్మరాజుగా చంద్రబాబు రాజధాని అమరావతి నిర్మాణం తలపెట్టారన్నారు. అమరావతిలో గోకుల క్షేత్రం ప్రాజెక్టును 150 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.



గోకుల్ క్షేత్రంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్, మంత్రి నారాయణ, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తదితరులు

ఎస్పీలు బదిలీ

- మూడు జిల్లాలకు మారారు
- బాపట్లకు గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ
- పల్నాడుకు శ్రీనివాసరావు
- గుంటూరుకు సతీష్‌కుమార్

గుంటూరు/ నరసరావుపేట, బాపట్ల జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు ఎస్పీలు మారారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఎస్పీలను నియమించారు. ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయగా వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్పీలు ఉన్నారు. గుంటూరు ఎస్పీ తుషార్ డూడీని బాపట్లకు మార్చగా, ఆయన స్థానంలో ఎస్ సతీష్‌కుమార్‌ను నియమించారు. గత ఎన్నికలకు ముందు నుంచి తుషార్ డూడీ గుంటూరు ఎస్పీగా పనిచేస్తున్నారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సతీష్‌కుమార్ ప్రస్తుతం కాకినాడ ఎస్పీగా ఉన్నారు. ఇప్పటివరకు బాపట్ల ఎస్పీగా ఉన్న వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎస్పీగా నియమించారు. ఇక పల్నాడు ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన విజయవాడ రూరల్ డీసీపీగా ఉండగా ఆయన్ను పల్నాడు జిల్లాకు మార్చారు. ఇప్పటివరకు పల్నాడు ఎస్పీగా విధులు నిర్వహించిన మల్లికాగర్గ్‌ను విజయనగరం జిల్లా 5వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు.



ఎస్పీ తుషార్ డూడీ (బాపట్ల జిల్లా)

ఇక త్వరలో డీఎస్పీలు, సీఐల వంతు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిగా శనివారం ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఎట్టకేలకు తాజాగా ఐపీఎస్‌ల బదిలీ ప్రక్రియ పూర్తి కాగా త్వరలో డీఎస్పీలు, ఆ తర్వాత సీఐల బదిలీలు ఉంటాయని సమాచారం. బదిలీల కోసం ఆయా అధికారులు ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరి నెల రోజులు గడిచినా ఇంకా పాత సీఐలే ఆయా విధుల్లో కొనసాగుతున్నారు. దీనిపై పార్టీ కేడర్ నుంచే కాక ప్రజల నుంచి, సంబంధిత పోలీసు వర్గాల నుంచి కూడా కొంత వరకు అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఐపీఎస్‌ల బదిలీల నేపథ్యంలో ఇక అదనపు ఎస్పీలు, డీఎస్పీలను రెండు, మూడు రోజుల్లో బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఐల బదిలీలు జరగనున్నాయని సమాచారం.

తుషార్‌డూడీకి రెండో పోస్టింగ్

2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి తుషార్‌డూడీ ఎస్పీగా తొలి పోస్టింగ్ గుంటూరు జిల్లా కాగా రెండో పోస్టింగ్ బాపట్ల జిల్లా. బాపట్ల ఎస్పీగా సుదీర్ఘకాలం పనిచేసిన వకుల్‌జిందాల్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా ఆవిర్భావం తర్వాత వకుల్‌జిందాల్‌కు తొలిసారి ఎస్పీగా ఇక్కడే పోస్టింగ్ దక్కింది. 26 నెలలు పాటు వకుల్ జిందాల్ బాపట్ల ఎస్పీగా సేవలందించారు. అత్యంత కీలకమైన ఎన్నికల ఘట్టం కూడా ఆయన సారథ్యంలోనే ముగిసింది. వైసీపీ పాలనలో జిల్లాలు ఏర్పడ్డాక దాదాపు ప్రతి జిల్లాకు కొత్త ఎస్పీలను నియమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే చోట విధుల్లో ఉన్న ఎస్పీలు ముగ్గురు కాగా అందులో వకుల్ ఒకరు కావడం గమనార్హం.

కాకినాడ నుంచి గుంటూరుకు..

ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న సతీష్ కుమార్ గుంటూరుకు బదిలీపై రానున్నారు. తమిళనాడులోని ఈరోడ్ ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ 2016లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2018లో మొదటిసారిగా చింతపల్లి ఏఎస్పీగా ఏడాదిన్నర విధులు నిర్వ హించారు. ఆ తర్వాత మావోయిస్టు కార్యకలాపాల అణచివేతకు సంబంధించి నర్సీపట్నం ఓఎస్‌డీగా 14 నెలలు, విశాఖ పరిధిలో సెబ్ ఏ ఎస్పీగా తొమ్మిది నెలలు, అల్లూరు సీతారామరాజు మన్యం జిల్లా ఎస్పీగా 13 నెలలు పని చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఐపీఎస్‌గా సతీష్‌కుమార్ నాలుగేళ్లు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కార్యకలాపాలను అణచి వేసే క్రమంలో సతీష్‌కుమార్ అనేక కార్యక్రమా లను చేపట్టి విజయవంతమయ్యారు. గంజాయి పెంపకం, అక్రమ రవాణా, విక్రయాలపై కూడా ఉక్కు పాదం మో పారు.

26 నెలలు.. నలుగురు ఎస్పీలు

పల్నాడు జిల్లా ఏర్పడి 26 నెలలు అవుతుంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ముగ్గురు ఎస్పీలు పనిచేశారు. జిల్లాకు నాలుగో ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు విజయవాడ రూరల్ డీసీపీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పల్నాడుకు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఎస్పీలు ఎన్నికల కమిషన్ చర్యలతో బదిలీ అయ్యారు. బొప్పుడి వద్ద జరిగిన ప్రధాని మోదీ సభకు సంబంధించి భద్రతా వైఫల్యాల నేపథ్యంలో రవి శంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. పోలింగ్, అ తర్వాత జిల్లా లో జరిగిన హింసాత్మక సంఘటలను పురష్కరించుకుని బిందు మాధవ్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మల్లికా గార్గ్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు.

శాంతి భద్రతలపై కఠిన వైఖరి - సతీష్‌కుమార్

శాంతి భద్రతలను పరిరక్షించే విషయంలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తానన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

రేపు విధుల్లో చేరే అవకాశం

ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. అదే రోజు ఎస్పీ తుషార్‌డూడీ విధుల నుంచి రిలీవ్ కానున్నారు.

రేపల్లెకు పట్టిసీమ

- గోదారమ్మతో కాల్వలు కళకళ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

రేపల్లె, జూలై 13: పట్టిసీమ ప్రవాహంతో తీరప్రాంతంలోని రేపల్లె పులకించింది. నాలుగేళ్ల తర్వాత గోదావరి నీరు రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రేపల్లె మెయిన్ కెనాల్‌కు పట్టిసీమ నీరు భారీగా చేరింది. దీంతో ప్రధాన కాల్వలన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. కాల్వల్లో నీరు సమృద్ధిగా రావడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే కొంతమంది నీరు ఎప్పుడు వస్తుందో తెలియక వర్షాలపై ఆధారపడి వెద పద్ధతిలో సాగుకు విత్తనాలు చల్లుకున్నారు. వర్షాభావంతో రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ప్రస్తుతం గోదావరి నీరు జిల్లాలోకి ప్రవేశించడంతో ఆయా గ్రామాల్లోని చెరువులు నింపే పనిలో అధికారు లు నిమగ్నమయ్యారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పట్టి సీమపై దృష్టి సారించి ఇటీవల నీటిని విడుదల చేయడంతో అవి శనివారానికి తీరానికి చేరాయి. వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లు పట్టిసీమను నిర్వీర్యం చేయడంతో డెల్టాలో వేలాది ఎకరాలకు నీరందక రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు. ఈ పరిస్థితుల్లో పట్టి సీమ నీరు రాకతో అటు సాగునీరు, ఇటు తాగు నీటి కష్టాలు తీరినట్లేనని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లలో చివరి భూముల వరకు ఇదే విధంగా నీటిని అందిస్తే పంటలు బాగా పండతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేపల్లె ప్రాంతంలో మెయిన్ కెనాల్‌కు చేరిన పట్టిసీమ నీరు



తీరంలో అప్రమత్తంగా ఉండాలి

- బీచ్‌లను పరిశీలించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 13: వర్షాకాలంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. తీరప్రాంతాల్లో ఇటీవల అలల తాకిడికి అనేకమంది గల్లంతై మృత్యువాతపడిన నేపథ్యంలో శనివారం కలెక్టర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. బాపట్ల మండలం సూర్యలంక, చిన గంజాం మండలం మోటుపల్లి, రుద్రమాంబపురం, నిరీక్షణగిరి, వేటపాలెం మండలం కటావారిపాలెం, చీరాల మండలం ఓడరేవు బీచ్‌ల్లో కలెక్టర్ పర్యటించారు. బీచ్‌ల వద్ద భద్రత పెంచాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ మత్స్యకారులకు సూచించారు. వేటకు అవసరమైన బోట్లు, ఇతర పరికరాలపై ఆరా తీశారు. మత్స్యకార జీవన స్థితిగతులు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమిళనాడుకు చెందిన బోటు అక్రమంగా జిల్లా పరిధిలోని సముద్ర జలాల్లోకి ప్రవేశించి వలలు తెంపుకుని వెళుతున్నాయని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని మత్స్యకారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పర్యాటకులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా వారికి అవగాహన కల్పించాలని మత్స్యకారులకు సూచించారు. ఎవరైనా మద్యపానం చేసి సముద్రంలోకి వెళుతున్నట్లు గుర్తిస్తే మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గంధం రవీందర్, సూర్యనారాయణ రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకట మురళి



● గుంటూరు రూరల్ మండలంలో సాగు చేసిన పత్తి పంట

వర్షం.. హర్షం

- సమృద్ధిగా కురిసిన వర్షాలు
- సాగుకు సిద్ధమైన అన్నదాతలు
- పత్తి, వరి వైపు అధిక శాతం మొగ్గు
- పల్నాడులో ఇప్పటికే వేసిన పంటలకు ఊపిరి

గుంటూరు సిటీ, జూలై 13: వరుణుడు కరుణలేదు.. వాతావరణశాఖ చెప్పినట్లు వర్షాలు లేవు.. అదును తప్పుతోంది.. అని ఆందోళనలో ఉన్న అన్నదాతలను మురిపిస్తూ శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో కరువుతీరా వర్షం పడింది. నాన్పుడు వానతో భూమి పదునెక్కింది. దుక్కిదున్ని సిద్ధంగా ఉంచుకున్న పొలాల్లో విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు. నైరుతి రుతుపవనాలు వచ్చాక కొంత వాన కురిసినప్పటికీ పదును చాలదని రైతులు ఇన్ని రోజులు సాగుకు దూరంగా ఉన్నారు. తాజాగా కురిసిన వర్షాలకు పుడమి దాహం పూర్తిగా తీరడంతో నాట్లుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం కురిసిన వాన గుంటూరు జిల్లాలోనే అధికంగా పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పల్నాడులో గత వారంలో కొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాలపై ప్రస్తుతం వరుణుడు కరుణించాడు. బాపట్ల జిల్లాలో కూడా పంటల సాగుకు ప్రస్తుత వర్షపాతం సరిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దుగ్గిరాలలో అత్యధికం..

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దుగ్గిరాలలో 148.8 మి.మీ అధికశాతం వర్షపాతం నమోదైంది. గుంటూరు పశ్చిమలో 142.2, గుంటూరు తూర్పులో 136.2, తెనాలిలో 123.4, కొల్లిపరలో 115.8, చేబ్రోలులో 107, ఫిరంగిపురంలో 105, పెదకాకానిలో 103.4, వట్టిచెరుకూరులో 86.6, ప్రత్తిపాడులో 85.4, మేడికొండూరులో 80.6, పొన్నూరులో 48, పెదనందిపాడులో 42.4, తాడికొండలో 37.6, కాకుమానులో 37.2, మంగళగిరిలో 33, తుళ్లూరులో 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 37.5, నూజెండ్లలో 21, పిడుగురాళ్లలో 18.5, శావల్యాపురంలో 17, నాదెండ్లలో 12, బెల్లంకొండలో 10, బాపట్ల జిల్లా అమర్తలూరులో 93.5, చెరుకుపల్లిలో 67.5, రేపల్లెలో 41.5, నిజాంపట్నంలో 38, నగరంలో 33, చీరాలలో 26.25 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు ప్రకటించారు.

అన్ని పంటలకు అనుకూలమే..

ప్రస్తుతం కురిసిన వర్షంతో అన్ని పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. భూమి పదునెక్కడంతో తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు, ఫిరంగిపురం మండలాల్లో పత్తి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. పొన్నూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాల్లో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేసుకుం టున్నారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తి సాగుతో పాటు, మిరప నారుమళ్లు పోశారు. బాపట్ల జిల్లాలో వరి నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.




శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

వైసీపీతో అంటకాగిన శింగరకొండ సిబ్బందిని తొలగించాలి

● మంత్రి గొట్టిపాటికి టీడీపీ నేతల ఫిర్యాదు

అద్దంకి, జూలై 13 : రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఒకటి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే పలు సందర్భాలలో సిబ్బంది తీరుతో భక్తులు ఇబ్బంది పడ్డ సందర్భాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక భావనతో ఉండాల్సిన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ సిబ్బంది గత వైసీపీ ప్రభుత్వ పాలనలో వైసీపీతో అంటకాగారన్న విమర్శలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సిబ్బంది చేసిన ఆగడాలను పలు గ్రామాల నేతలు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో వైసీపీ నేతల కార్యక్రమాలు ఎక్కడ జరిగినా పలువురు సిబ్బంది దేవాలయం విధులకు డుమ్మా కొట్టి నాయకులకంటే ముందే హాజరై అన్నీ తామై చేసిన సందర్భాలు కూడా ఉన్నాయని పలువురు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. దేవాలయంలో పనిచేసే సిబ్బంది సాధారణంగా తమ వాట్సాప్, ఫేస్‌బుక్‌కు స్వామి వారి ఫొటో పెట్టుకుంటారు. కానీ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పనిచేసే కొందరు రెగ్యులర్ సిబ్బందితో పాటు అత్యధిక శాతం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది వైసీపీ జెండా, నేతల ఫొటోలను ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు పెట్టుకున్న విషయాలను కూడా ఈ సందర్భంగా టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. దేవాలయానికి చిన్న నాయకుడు వచ్చినా ఎలాంటి ప్రొటోకాల్ పాటించకుండా మంది మార్బలంతో స్వాగతం పలుకుతూ అన్ని క్యూలైన్‌లలో భక్తులను ఆపి వైసీపీ నేతలను ప్రధాన ద్వారం నుంచి దర్శనాలు కల్పించారు. శింగరకొండలో ముఖ్యమైన ఉత్సవాలు జరిగిన సమయంలో, తిరుణాళ్ల వేళ స్థానిక ఎమ్మెల్యేని ఆహ్వానించి కార్య క్రమాలు ప్రారంభింపచేయడం ఆనవాయితీగా ఉంది. అయితే గత వైసీపీ పాలనలో ఈ ఆనవాయితీని పక్కన పెట్టడాన్ని పలువురు టీడీపీ నేతలు ఆక్షేపిస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తుందని కొందరు సిబ్బంది బెట్టింగ్‌లు కట్టినట్లు తెలిసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీతో అంటకాగిన పలువురు సిబ్బంది విధులకు దూరంగా వెళ్లినప్పటికీ మరలా పిలిపించి విధులు కేటాయించడం విమర్శలకు తావిస్తుంది. మరికొందరు సిబ్బంది అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో ఒక్క సారిగా ప్లేట్ ఫిరాయించడంతో పాటు వాట్సాప్, ఫేస్‌బుక్‌లో వైసీపీ జెండా, నాయకుల ఫొటోలు తొలగించడం చర్చనీయాంశంగా మారింది. తమకు తెలిసిన వ్యక్తుల ద్వారా అన్ని రకాల రాయబారాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో టీడీపీ నేతలను కలిసి ఫొటోలు దిగి వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడంపై మిగిలిన సిబ్బంది, టీడీపీ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలలో వైసీపీ విజయానికి పనిచేసిన విషయాన్ని కూడా టీడీపీ నేతలు రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. వైసీపీతో అంటకాగిన రెగ్యులర్ సిబ్బందితో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని వెంటనే తొలగించాలని మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదే సమయంలో గ్రామాలలో టీడీపీ విజయం కోసం పనిచేసిన కార్యకర్తలకు ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించాలని కూడా కోరినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతి విషయాన్నీ ఒకింత లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకునే మంత్రి గొట్టిపాటి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని టీడీపీ శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


నిరీక్షణగిరి గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

మోటుపల్లి తీరంలో కలెక్టర్ పర్యటన

● సమస్యలు పరిష్కరిస్తానని మత్స్యకారులకు హామీ
● వీరభద్రస్వామి ఆలయం సందర్శన

చినగంజాం, జూలై 13 : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీలో తీరప్రాంతమైన నిరీక్షణగిరి, సముద్ర తీరప్రాంతాన్ని, పురాతన వీరభద్రస్వామి దేవాలయాన్ని కలెక్టర్ జె.వెంకటమురళి శనివారం పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ తీరప్రాంత ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు వచ్చారు. మోటుపల్లి సముద్ర తీర ప్రాంతాన్ని ఆయన పరిశీలించి అక్కడ ఉన్న మత్స్యకారులతో మాట్లాడి వారి బోటులను పరిశీలించారు. మేము సముద్రంలో 30 కిలోమీటర్లకు పైగా వేటకు వెళ్తామని, వేటకు వెళ్లినప్పుడు తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు మత్స్యకారలు దౌర్జన్యంగా మా వలలు లాక్కోవడంతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని, చేపల వేట విరామ సమయంలో ప్రభుత్వం నుంచి భృతి ఇంత వరకు అందలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్త చేశారు. వేట విరామ సమయంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారుడు కొండూరి గోవిందు కలెక్టరు దృష్టికి తీసుకొని వెళ్లారు. అనంతరం అయన నిరీక్షణగిరి గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. 50 కుటుంబాలు ఇక్కడ జీవిస్తున్నామని, ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం గాని, ప్రాథమిక పాఠశాల కూడా లేకపోవడంతో దూరంగా ఉన్న రుద్రమాంబపురం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ, పాఠశాలకు పిల్లలను భయపడుతూ పంపించాల్సి వస్తోందని ప్రళయకావేరి ఏసుదాసు, రాణిమ్మ, వాయిల ఏసురత్నం తదితరులు కలెక్టర్‌కు తెలిపారు. గ్రామానికి వచ్చే నీటి పైపులు దెబ్బతిని తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ అధికారులను గ్రామానికి పంపి మీ సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం కాకతీయులు, చోళల కాలం నాటి వీరభద్రస్వామి దేవాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆలయంలోని శాసనాలను పరిశీలించి, దేవాలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సముద్రతీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులు ప్రమాదలకు గురికావడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, భూ రీసర్వే డీటీ దాసరి శ్రీకాంత్, గ్రామ రెవెన్యూ అధికారులు నాగిరెడ్డి నాగరాజు, పి.నాగరాజురెడ్డి, షేక్ మునీర్, ఏడుకొండలు, బండారు దానియేలు, ఆమంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ పీఠం కదులుతోంది !

చేజారనున్న ఒంగోలు కార్పొరేషన్
ఆధిక్యత వైపు
టీడీపీ కూటమి అడుగులు
ఎక్కువ శాతం మంది టచ్‌లోకి..
కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నంలో బాలినేని
నేడు, రేపు కీలక పరిణామాలు

జిల్లాలో కీలకమైన ఒంగోలు కార్పొరేషన్ పాలకమండలి వైసీపీ నుంచి చేజారే అవకాశం కనిపిస్తోంది. తిరుగులేని ఆధిక్యతతో ఉన్న ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పలువురు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. అందుకు సంబంధించి ఆది, సోమవారాల్లో పలు కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కన్పిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. శనివారం పేర్నమిట్ట ప్రాంతానికి చెందిన కార్పొరేటర్ కూడా సైకిలెక్కారు. దీంతో కూటమి సభ్యుల సంఖ్య 13కు చేరింది. తాజాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్పొరేషన్‌పై దృష్టిసారించడంతో మరికొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంగోలులో 50 డివిజన్‌లకుగాను 40చోట్ల వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఆరు డివిజన్‌లలో టీడీపీ, ఒక డివిజన్‌లో జనసేన అభ్యర్థి గెలుపొందారు. కార్పొరేషన్‌లో టీడీపీకి మెజారిటీ రావాలంటే 26 మంది సభ్యుల అవసరం ఉంది. ఇప్పుడున్న 13మందికితోడు ఒంగోలు ఎంపీ మాగుంట, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌లు కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫిషియో సభ్యత్వం తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ మేరకు విజయ్‌కుమార్‌తో జనార్దన్ మాట్లాడినట్లు సమాచారం. ఈ ముగ్గురినీ కలిపితే టీడీపీ బలం కార్పొరేషన్‌లో 16కు చేరుతుంది. మరో 10 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరితే కార్పొరేషన్ ఆ పార్టీ పరమయ్యే అవకాశం ఉంది. శనివారం జరిగిన పరిణామాలతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అలాంటి వారి సంఖ్య 10 నుంచి 15 వరకూ ఉంది. వారిలో ఒకరిద్దరు జనసేన ద్వారా టీడీపీ కూటమిలో చేరేందుకు సిద్ధమయ్యారు. చాకచక్యంగా రాజకీయం చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ కొందరితో ప్రత్యక్షంగా, మరికొందరితో పార్టీ నాయకుల ద్వారా చర్చలు జరిపినట్లు తెలిసింది. మేయర్ గంగాడ సుజాత కూడా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆమెను పక్కనపెట్టి కార్పొరేటర్‌లతో టీడీపీ నాయకులు నేరుగా మంతనాలు ప్రారంభించారు.

కార్పొరేటర్‌లతో బాలినేని సంప్రదింపులు

పరిస్థితిని గమనించిన మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్పొరేషన్‌పై దృష్టిసారించి కార్పొరేటర్‌లతో చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. ఎన్నికల్లో ఓటమి అనంతరం హైదరాబాద్‌కే పరిమితమైన ఆయన కొందరు వైసీపీ కార్పొరేటర్లకు ఫోన్ చేసి తాను సోమవారం ఒంగోలు వస్తానని, తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించినట్లు సమాచారం. ఆ ప్రకారం సోమవారం ఆయన ఒంగోలు వస్తున్న విషయాన్ని కూడా బహిరంగపర్చారు. దీంతో కొందరు వైసీపీ కార్పొరేటర్లు సోమవారం తర్వాత నిర్ణయం తీసుకుందామన్న ఉద్దేశంతో ఉండగా, మరికొందరు ఆదివారమే పార్టీ ఫిరాయించాలన్న ఆలోచనకు వచ్చారు. దీంతో శనివారం రాత్రికి నగరంలో రాజకీయం వేడెక్కింది.

పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్న దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్‌ను టీడీపీ కైవసం చేసుకునేలా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. కార్పొరేటర్లతో బాలినేని మాట్లాడిన విషయం తెలుసుకున్న వెంటనే ఆయన అప్రమత్తమయ్యారు. ఇప్పటికే తనకు టచ్‌లో ఉన్న కార్పొరేటర్లను ఆదివారం పార్టీలో చేర్చుకొని కార్పొరేషన్‌లో వైసీపీ ఆధిపత్యానికి చెక్ పెట్టాలన్న ఆలోచ న తో ఉన్నారు. అందు క న ు గు ణ ం గా టీ డీ పీలో చే రేం దు కు సు వ వా రా ు 10మంది కార్పొరేటర్లు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కూడా తెలిసింది. అయితే వైసీపీ నాయకులు సోమవారం బాలినేని వచ్చి ఏం సలహా ఇస్తారో చూద్దాం. ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని కార్పొరేటర్లకు నచ్చజెప్పడం ప్రారంభించారు.

కొందరు కార్పొరేటర్ల మల్లగుల్లాలు

అందిన సమాచారం మేరకు వైసీపీ అధినేత జగన్ తీసుకున్న నిర్ణయాలతో తీవ్ర మనస్తాపంతో ఉన్న బాలినేని ఎలా ముందుకెళ్లాలన్న విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. టీడీపీలోకి వెళ్లాలని భావిస్తున్న కార్పొరేటర్లలో కొందరు బాలినేని మాటను గౌరవించి సోమవారం తర్వాత నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనకు వచ్చారు. అలాంటి వారికి 'ముందుగానే పార్టీలోకి వస్తే మీకూ గౌరవం ఉంటుంది. కాదూ కూడదనుకున్నా అవిశ్వాస తీర్మానం చట్టాన్ని సవరించి ముందుకు వెళ్తాం' అన్న సంకేతాన్ని టీడీపీ నేతలు ఇచ్చినట్లు తెలిసింది. అంతేగాక కార్పొరేషన్ అధికారులంతా టీడీపీ చేతుల్లోనే ఉంటారు. కౌన్సిల్‌లో బలం లేకపోయినా వారు తీసుకునే నిర్ణయాలే చెల్లుబాటు అవుతాయి. అప్పుడు తమకు ఎలాంటి విలువ ఉండదని వైసీపీ కార్పొరేటర్లు ఓ భావనకు వచ్చినట్లు సమాచారం. దీంతో వారంతా మల్లగుల్లాలు పడుతున్నారు. వీరు ఆదివారమే టీడీపీలో చేరతారా? లేక బాలినేని వచ్చి వెళ్లిన తర్వాత చేరతారా? అన్నది అలా ఉంచితే ఏదో ఒక రోజు గోడ దూకేందుకు వైసీపీ కార్పొరేటర్లు 10మందికిపైగా సిద్ధంగా ఉన్నారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్ టీడీపీ కూటమి చేతుల్లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.


ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం

టీడీపీలో చేరిన మరో వైసీపీ కార్పొరేటర్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 13: ఒంగోలు నగరంలోని వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. ఎన్నికలకు ముందు ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరగా, శనివారం 40వ డివిజన్ పేర్నమిట్టకు చెందిన కార్పొరేటర్ టి. చంద్రశేఖర్ టీడీపీ కండువా కప్పుకున్నారు. దీంతో ఇప్పటివరకు 39 మంది ఉన్న వైసీపీ సభ్యుల సంఖ్య 38కు చేరింది. ఈ మేరకు చంద్రశేఖర్ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీ చేరగా, కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అయితే త్వరలో మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కొందరు ఆ పార్టీశ్రేణులకు టచ్‌లో ఉన్నారు.


ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన 40వ డివిజన్ కార్పొరేటర్ టి.చంద్రశేఖర్

ఖరీఫ్ సాగుకు జీవం

పలు మండలాల్లో మోస్తరు వర్షం
చల్లబడ్డ వాతావరణం
ఇప్పటికే వేసిన పైర్లకు మేలు
కంది, పత్తి సాగుకు ఉపయుక్తం

ఒంగోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఇంచుమించు నెల రోజులుగా కొనసాగుతున్న బెట్ట వాతావరణం నుంచి ఉపశమనం కలిగి చల్లబడింది. జిల్లావ్యాప్తంగా శనివారం తెల్లవారుజాము నుంచి జల్లులు పడుతుండగా పలుచోట్ల ఒక మోస్తరు వర్షమే కురిసింది. ఈ వాతావరణం ఖరీఫ్ సీజన్‌కు జీవం పోయనుంది. ఇప్పటికే వేసిన పైర్లకు తాజా వర్షం మేలు చేయనుండగా ఖరీఫ్ ప్రధాన పంటలైన కంది, పత్తి విస్తారంగా సాగుకు ఉపయుక్తం కానుంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లు కాగా ఈ సమయానికి కనీసం 40వేల హెక్టార్లలో పంటలు సాగు కావాలి. తొలకరి పైర్లుగా పిలిచే సజ్జ, పెసర, నువ్వు వంటి సాగు పూర్తయ్యి పైరు దశలో ఉండాలి. అలా కంది, పత్తి సాగు ముమ్మరంగా సాగుతుండాలి. అందుకు వీలుగా జూన్ తొలివారంలో మంచి వర్షాలు కురిసినా తర్వాత వాతావరణం అనుకూలించలేదు. వర్షం లేకపోవడమే కాక ఎండల తీవ్రత పెరిగింది. దాదాపు నెలరోజులుగా అలాంటి వాతావరణం సాగుతుండటంతో సాగు ముందుకు సాగలేదు. దీంతో 2.02లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి కేవలం 14,285 హెక్టారలలో మాత్రమే సాగు జరిగింది. తొలకరిగా పిలిచే పెసర, సజ్జ, నువ్వు పంటలు 12వేల హెక్టార్ల విస్తీర్ణానికి కేవలం 3వేల హెక్టార్లలో మాత్రమే సాగు కాగా, పత్తి, కంది మరో మూడున్నర వేల హెక్టార్లలో సాగయ్యాయి. అవి కూడా చాలాచోట్ల ఎండుముఖం పట్టాయి.


ఒంగోలులో శనివారం ఉదయం కురుస్తున్న వర్షం

పగలంతా జల్లులు

ఈ పరిస్థితుల్లో నాలుగు రోజుల క్రితం ఒక మోస్తరు జల్లులు పడటం ఊరట కలిగించగా తాజాగా శనివారం మరోసారి కురిసిన వర్షం ఖరీఫ్ సాగుకు జీవం పోసింది. శనివారం తెల్లవారుజామునుంచి జల్లులు పడుతూ ఉదయం 9 గంటల వరకు జిల్లాలో సగటున సుమారు 11.50 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా నాగులుప్పలపాడు మండలంలో 34.0 మి.మీ వర్షపాతం నమోదు కాగా ఒంగోలులో 30.6, మద్దిపాడులో 29.40. పుల్లలచెరువులో 29.0, సంతనూతలపాడు 27.6. చీమకుర్తిలో 25.4 మి.మీ వర్షం కురిసింది. మరో 15 మండలాల్లో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. అలాగే శనివారం పగటి పూట కూడా జల్లులు పడుతూనే ఉన్నాయి. తాజా వర్షంతో ఖరీఫ్ సాగుపై రైతులు కాస్తంత నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.


మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు సమీపంలో కాలువలో పడిపోయిన ఆర్టీసీ బస్సు

బస్సు బోల్తాపై స్పందించిన మంత్రి గొట్టిపాటి

● విచారణకు ఆదేశాలు

పంగులూరు, జూలై 13 : మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటనపై విచారణ చేపట్టాలని పోలీస్ అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి అద్దంకి నుంచి చీరాల వైపు ప్రయాణికులతో బయలుదేరిన బస్సు 8.30 గంటల సమయంలో తక్కెళ్లపాడు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి సమీప గ్రామాల పార్టీ శ్రేణులతో పాటు పోలీస్ అధికారులను అప్రమత్తం చేసి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. బస్సు బోల్తా పడిన సమయంలో సిబ్బందితో పాటు 19 మంది ప్రయాణికులు ఉండగా, ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి మంత్రి గొట్టిపాటి స్పందించి సహాయక చర్యలకు ఆదేశించడం, ఘటనపై తక్షణ విచారణ చేపట్టాలన్నారు. ఎస్ఐ తిరుపతిరావు ఘటనపై విచారణ చేట్టారు.

జిల్లా ఎస్పీగా ఏఆర్ దామోదర్

మున్నా గ్యాంగ్‌కు ముకుతాడు వేసిన అధికారి
గరుడ్ సుమిత్ సునీల్ హెడ్ క్వార్టర్‌కు బదిలీ

ఒంగోలు(క్రైం), జూలై 13 : జిల్లా ఎస్పీగా ఏఆర్ దామోదర్‌ను నియమిస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలో 37మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు జిల్లాలో ప్రస్తుతం ఎస్పీగా ఉన్న గరుడ్ సుమిత్ సునీల్‌ను హెడ్ క్వార్టర్లో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఆయన స్థానంలో నూతన ఎస్పీగా ఏఆర్ దామోదర్‌ను నియమించారు. ప్రస్తుతం ఒంగోలు పోలీస్ శిక్షణ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఏఆర్ దామోదర్ పోలీస్ శాఖలో 2007లో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2008లో ప్రకాశం జిల్లాలో ప్రొబెషరీ డీఎస్పీగా పనిచేశారు. అప్పట్లో తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తూ హైవే కిల్లర్ మున్నా నిశ్శబ్ద హత్యాకాండను బట్టబయలు చేసి పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచారు. ఆ గ్యాంగ్‌లో 12 మందికి ఉరిశిక్ష పడటం గమనార్హం. పదోన్నతులు పొంది విజయనగరం ఎస్పీగా 2019 ఎన్నికల సమయంలో అద్భుత పనితీరు కనబర్చారు. ఎస్పీ దామోదర్ పరిణితి చెందిన అధికారిగా పోలీస్ శాఖలో గుర్తింపు పొందారు. శిక్షణ కాలంలోనే జిల్లాలో ఆరు నెలల పాటు పనిచేయడంతోపాటుగా 2021 నుంచి ఇప్పటివరకు ఒంగోలు పీటీసీలో పనిచేయడంతో జిల్లా సమస్యలతోపాటు అన్ని పరిస్థితులు ఆయనకు అవగాహన, పట్టు ఉంది. ఇప్పటివరకు జిల్లాలో వంద రోజుల పాటు ఎన్నికల సమయంలో పనిచేసిన గరుడ్ సుమిత్ సునీల్‌ను హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.



బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

● మార్టూరులో కలకలం

మార్టూరు, జూలై 13 : మార్టూరులో ఇస్మాయేల్ టీ సెంటర్ సమీపంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న కరణం మన్నస్ అనే పదేళ్ల బాలుడిను కిడ్నాపు చేయడానికి కొంత మంది వ్యక్తులు ప్రయత్నించగా ఈ బాలుడు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చిన సంఘటన శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో జరిగింది. బాలుడి తండ్రి కరణం కుటుంబరావు ఇచ్చిన సమాచారం మేరకు కుమారుడు మన్నస్ చిలకలూరిపేటలో ప్రైవేట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. కుటుంబరావు మార్టూరులో సెల్ షాపు నిర్వహిస్తున్నారు. శనివారం స్కూల్‌కి సెలవు కావడంతో సాయంత్రం ఇంటి వద్ద అడుకుంటున్న కుమారుడు వద్దకు ఇద్దరు అఘంతకులు వచ్చి మొఖం మీద మత్తు మందు చల్లి బాలుడిను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని హీరో షోరూమ్ ఎదురుగా ఒంగోలు వైపు సర్వీస్ రోడ్డులో ఉన్న కారులో కూర్చోబెట్టారు. అయితే అపస్మారక స్థితి నుంచి కోలుకున్న బాలుడు కారు తలుపులు తీసుకుని హీరో షోరూమ్ ఎదురుగా మార్టూరు సెంటర్‌కు వచ్చే సర్వీస్ రోడ్డులో వేగంగా నడుచుకుంటూ వచ్చాడు. ఆ సమయంలో గుర్తు తెలియని మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై బాలుడును ఎక్కించుకుని రాయల్ పైనీర్ స్కూల్ వద్ద రోడ్డుపై వదిలిపెట్టాడు. అప్పటికే కుమారుడు కనిపించడం లేదని గాబరాపడిన తల్లిదండ్రులు కుమారుడు ఇంటికి రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. అప్పటికే కొంత బయందోళనతో ఉన్న కుమారుడిను తీసుకుని స్టేషన్‌కు వెళ్లి సీఐ రాజశేఖర్‌రెడ్డికి తెలిపారు. ఈ విషయంపై సీఐ దర్యాప్తు ప్రారంభించారు. బాలుడు చెప్పిన విషయాలపై విచారణ చేస్తున్నారు. అయితే ఈ సంఘటన మార్టూరులో సంచలనం కలిగించింది. బాలుడి కిడ్నాప్‌కు ఎవరైనా ప్రయత్నించారా.. లేదా.. అని పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



బోర్‌ను తీస్తున్న సిబ్బంది

ముక్తేశ్వరంలో రెండు బోర్లు ఏర్పాటు

బల్లికురవ, జూలై 13 : మండలంలోని ముక్తేశ్వరంలో ప్రజల తాగు నీటి అవసరాలకు గ్రామ పంచాయతీ నిధులతో శనివారం రెండు బోర్లను వేశారు. గురువారం ఆంధ్రజ్యోతితో ముక్తేశ్వరంలో దాహం కేకలు అన్న కథనం ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు గ్రామాన్ని సందర్శించి నీటి సమస్య అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పంచాయతీ నిధులతో బోర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. నీరు లేక ఎండి పోయిన గిలకల బావి వద్ద, రామాలయం సమీపంలో రెండు బోర్లను తీస్తున్నారు. బోర్లకు చేతి పంపులను ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలో మరో అయిదు చేతి పంపులను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటి ఎద్దడి రాకుండా చూడాలని, మహల్ బావిలో పూడిక తీయించాలని, పైపు లైన్ ద్వారా గ్రామంలోకి నీటిని సరఫరా చేయాలని కోరారు.





రిజర్వాయర్‌గా మార్చాల్సిన భవనాసి చెరువు.. గుండ్లకమ్మ నీటిని భవనాసి రిజర్వాయర్‌కు మళ్లించేందుకు తవ్వి ఆగిన కాలువ పనులు

భవనాసి రిజర్వాయర్ ఎప్పటికి పూర్తయ్యేనో..?

- 15 ఏళ్లుగా సాగుతున్న పనులు
- భూసేకరణ, బ్లాస్టింగే ప్రధాన అడ్డంకి
- మంత్రి రవికుమార్‌పైనే రైతుల ఆశలు

అద్దంకి, జూలై 13 : అద్దంకి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ భవనాసి రిజర్వాయర్. 106 సంవత్సరాల కిందట భవనాసి చెరువు నిర్మాణం జరగ్గా, రిజర్వాయర్‌గా చేసే పనుల నిమిత్తం సుమారు రూ.27కోట్లతో 2009లో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అప్పటి గుంటూరు జిల్లా ప్రస్తుత పల్నాడు జిల్లా పరిధిలోని గోకనకొండ సమీపంలో గుండ్లకమ్మ నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం చేసి అక్కడ నుంచి సుమారు 12 కి.మీ దూరం నేలకాలువ ద్వారా నీటిని భవనాసి చెరువును నింపాల్సి ఉంది. అదేసమయంలో భవనాసి చెరువు పటిష్టం చేసి అలుగు ఎత్తు పెంచటం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఈక్రమంలో గుండ్లకమ్మ నదిలో చెక్ డ్యామ్ నిర్మాణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. భవనాసి చెరువు కట్ట అభివృద్ధి చేసే పనులు కూడా పూర్తయ్యాయి.

గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు వరకు కాలువ తవ్వకం పనులు కొంతమేర పూర్తయినా పలు చోట్ల అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రధానంగా కొన్నిచోట్ల భూసేకరణ జరగకపోవడంతో పాటు మైలవరం, ఉప్పలపాడు సమీపంలో కాలువ తవ్వకం సమయంలో పెద్ద రాళ్లు పడ్డాయి. వాటిని పగులగొట్టడానికి బ్లాస్టింగ్ చేయాల్సి ఉంది. బ్లాస్టింగ్‌కు అనుమతులు రాకపోవడం, ఆయా గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యకం కావడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగింపు, భూ సేకరణ కూడా జరగాల్సి ఉంది.

ఈనేపథ్యంలో భూసేకరణ వ్యవయం, కాలువ తవ్వకం వ్యయం పెరగడంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.45 కోట్లకు పెంచారు. దీంతో కొద్ది రోజులు పనులు హడావుడి చేసినా మరలా ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గత ఏడెనిమిది సంవత్సరాల నుంచి ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవనాసి రిజర్వాయర్ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, శంకుస్థాపన చేసినప్పటి నుంచి నేటి వరకు అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి దక్కడంతో మధ్యలో నిలిచిపోయిన భవనాసి రిజర్వాయర్ పనులు పునఃప్రారంభమై వేగవంతంగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. భవనాసి రిజర్వాయర్ పూర్తయితే ప్రస్తుతం ఉన్న రెండు వేల ఎకరాల ఆయకట్టుతో పాటు శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆయకట్టులో ఉన్న సుమారు నాలుగు వేల ఎకరాలకు పూర్తి స్థాయిలో ఏడాది పొడవునా నీటి లభ్యత ఏర్పడనుంది. సాగర్ ఆయకట్టు చివరిప్రాంతమైన పమిడిపాడు మేజర్ ఆయకట్టు లోని అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాల పరిధిలోని సుమారు పది వేల ఎకరాలకు సాగునీటి భరోసా కలగనుంది. అదే సమయంలో పలు గ్రామాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కూడా కలుగనుంది. ఇప్పటికైనా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి భవనాసి రిజర్వాయర్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అద్దంకి ప్రాంత రైతులు కోరుతున్నారు.

రహదారులు అధ్వానం..!

- చినుకు పడితే బురదమయం
- నరకం చూస్తున్న ప్రయాణికులు

పర్చూరు, జూలై 13 : చినుకు పడితే చిత్తడే అన్న విధంగా రహదారులు పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా రహదారులు పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లపైకి నీరు చేరడంలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకం చూస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన ఆయా గ్రామాల్లోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షం కురిస్తే నీరు పారుదల లేక రోడ్లపై ప్రవహించడం, రోజుల తరబడి నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో సమస్య మరింత దారుణంగా మారుతోంది. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే పర్చూరు - చీరాల రహదారిలో పరిస్థితి దయనీయంగా మారింది. అదేవిధంగా పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్డులోని అడుసుమల్లి సమీపం రోడ్డు చినుకు పడితే రోడ్లు బురదమయమవుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పర్చూరు - గుంటూరు రోడ్డులోని అడుసుమల్లి వద్ద ఇలా

చిత్తడిగా ప్రధాన రహదారులు కాలువలు అధ్వానం

చీరాలటౌన్ : చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకు కూడా ప్రధాన రహదారులు సైతం చిత్తడిగా మారుతున్నాయి. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి ఉండడంతో నీటి పారుదల లేక డ్రైన్‌లు కంపుకొడుతున్నాయి. మురుగు కాలువలు చెత్తతో నిండిపోయి ఉన్నాయి. కాలువల నుంచి వచ్చే కంపుతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు రాకపోకలు సాగించాలంటే నానా యాతన పడుతున్నారు. డ్రయిన్‌లు శిథిలావస్థకు చేరడంతో వ్యర్థాలు, మురుగు నీరు రోడ్లపైకి చేరుతున్నాయి. కొన్నిచోట్ల చెత్త సేకరణ అసంపూర్తిగా ఉంది. మరోవైపు వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముక్కోణపు పార్క్ సమీపంలో సులాభ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే వ్యర్థాలను కాలువలకు కలిపారు. ఆ ప్రాంతంలో డ్రైన్‌లో పారుదల సక్రమంగా లేదు. ఇదిలావుండగా శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రధాన రహదారులు చిత్తడిగా మారాయి. ఈక్రమంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, ప్రయాణికులు వేడుకుంటున్నారు.



వ్యర్థాలతో నిండిన కాలువ.. చీరాలలో గుంతలో నిలిచిన వాన నీరు



కొండయ్య దంపతులను అభినందిస్తున్న ప్రముఖులు

వైజాగ్‌లో కొండయ్యకు ఘన సన్మానం

చీరాల, జూలై 13 : ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆయన సతీమణి బాలకొండమ్మను శనివారం విశాఖ పోర్టు కళావాణీ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. ఆర్‌కే టౌన్ షిప్ అధినేతగా 1995 నుంచి కొండయ్య వైజాగ్ ప్రాంతానికి సుపరిచితులు. తరువాత విద్యా సంస్థల నిర్వహణలో ఆయనకు ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో గత ఎన్నికలకు సుమారు రెండు సంవత్సరాల ముందు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొండయ్య చీరాల నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు తీసుకున్నారు. తనదైన శైలిలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ శ్రేణులకు సమన్వయం చేసుకుంటూ, 2024 ఎన్నికలలో గెలుపొందారు. ఈ క్రమంలో కొండయ్య దంపతులు వైజాగ్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆయనకు పురప్రముఖులు, ఆర్‌కే సంస్థల ప్రతినిధులు, కూటమి శ్రేణులు, శ్రేయోభిలాషులు వరుస క్రమంలో కొండయ్య దంపతులను సన్మానిస్తూ, శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వ్యాపారవేత్తగా, రాజకీయనాయకునిగా విస్తృత పరిచయాలు ఉండడం, సేవా కార్యక్రమాల్లో ముందుండడం అందుకు కారణం. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పెద కుమారుడు గౌరీఅమర్‌నాథ్, ఆర్‌కే టౌన్‌షిప్ సంస్థల పర్యవేక్షణ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, పలువురు పురప్రముఖులు పాల్గొన్నారు.

ఊడిన ఆర్టీసీ బస్సు చక్రం

తప్పిన ప్రమాదం



చక్రం ఊడిన బస్సును పరిశీలిస్తున్న డిపో మేనేజర్ శ్యామల

చీరాలటౌన్, జూలై 13 : చీరాల పట్టణంలో అకస్మాత్తుగా ప్రయాణికులు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి చక్రం అకస్మాత్తుగా ఊడింది. ఈఘటన శనివారం సాయంత్రం చీరాల ముంతావారి సెంటర్‌లో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఇంకొల్లు నుంచి చీరాలకు సుమారు 20 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్ బయలుదేరింది. ఈనేపథ్యంలో సాల్మన్ సెంటర్ వద్దకు రాగానే బస్ నుంచి ప్రతికూల శబ్దంను అప్పటికే డ్రైవర్ ఈశ్వర్‌రెడ్డి గమనించారు. అలాగే చిన్నగా వస్తుండగా ముంతావారి సెంటర్‌కు రాగానే ఒక్కసారిగా హబ్ విరిగి చక్రం బస్ నుంచి పూర్తిగా ఊడిపోయి పక్కకు వెళ్లింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ జాగ్రత్తగా బస్‌ను నిలిపివేశాడు. అయితే ప్రయాణికులు భీతిల్లిపోయారు. సమాచారం అందుకున్న డిపో మేనేజర్ శ్యామల సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి బస్‌ను డిపోకు తరలించారు. అయితే ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రావూరు - తిమ్మసముద్రం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో బస్సులు దెబ్బతింటున్నాయని ఈక్రమంలోనే ప్రమాదం జరిగి ఉంటుందని ఆర్టీసీ సిబ్బంది చెప్తున్నారు.

ఆదమరిస్తే అంతే..!

- బొమ్మల సెంటర్ కూడలిలో ప్రమాదంగా కుంట
- పట్టించుకోని అధికారులు

పర్చూరు, జూలై 13 : పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో మురుగు కాలువ మరమ్మతులకు తీసిన కుంట ప్రమాదకరంగా మారింది. డ్రైనేజ్ కాలువ మరమ్మతులు చేపట్టిన అధికారులు కుంట వద్ద ఎలాంటి ప్రమాద సూచికలను ఏర్పాటు చేయలేదు. పోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న ప్రధాన రహదారి వెంబడి కాలువపై కుంటను ఏర్పాటు చేసి ఉండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తుంది. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గ్రామంలోకి వెళ్లే మలుపులో ప్రమాదకరంగా ఉన్న కుంట ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టిసారించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బొమ్మల సెంటర్ మలుపు వద్ద కాలువపై కుంట

తెగిన విద్యుత్ తీగ గేదె మృతి

బల్లికురవ, జూలై 13 : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో శుక్రవారం అర్థరాత్రి ఈదురు గాలులు పెద్ద ఎత్తున వీయడంతో విద్యుత్ తీగలు తెగి పడి గంగవరపు ఆదినారాయణకు చెందిన పాడి గేద మృతి చెందింది. ఇంటి ముందు ఉన్న గేదపై విద్యుత్ వైర్లు తెగి పడడంతో గేద అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేద విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతు తెలిపారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. వైరు తెగిపోవడంతో సిబ్బంది సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.



మృతి చెందిన గేదె

సదరం శిబిరాన్ని వినియోగించుకోవాలి

పర్చూరు, జూలై 13 : పర్చూరు నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ మామిడిపాక హరిప్రసాద్ కోరారు. శనివారం స్థానిక వైద్యశాలలో ఏర్పాటు చేసిన సదరం క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పత్యేక ఏర్పాట్లు చేసే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా దివ్యాంగులకు కావలసిన మౌలిక వసతులు కల్పించే విధంగా తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు పళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పళ్లను పంపిణీ చేస్తున్న హరిప్రసాద్

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, జూలై 13 : క్షేత్ర స్థాయిలో విద్యుత్ సిబ్బంది మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బందితో శనివారం స్థానిక గీతామందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ నల్లూరి మస్తాన్‌రావు మాట్లాడుతూ సిబ్బంది నిత్యం విద్యుత్ లైన్‌లను పరిశీలిస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పై పలు చోట్ల వస్తున్న ఫిర్యాదులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. సమావేశంలో అద్దంకి, మార్టూరు డీఈఈలు సత్యనారాయణ, సురేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

వ్యవసాయ కనెక్షన్‌లకు అదనంగా చెల్లించవద్దు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల మంజూరుకు విద్యుత్ శాఖ అధికారులకు రైతులు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు శనివారం తెలిపారు. డివిజన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు అధికారులు వెంటనే అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం మంజూరైన వ్యవసాయ కనెక్షన్‌లతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వవద్దన్నారు. బల్లికురవ మండలంలో పలువురు రైతుల వద్ద నుంచి అదనంగా వసూలు చేస్తున్నట్లు అందిన ఫిర్యాదుపై విద్యుత్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.



ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా నూతన కార్యవర్గం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన కమిటీ

అద్దంకి, జూలై 13 : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా నూతన అధ్యక్షుడిగా ఆర్.అమర్నాథ్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా యూనిట్ సమావేశం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అద్దంకి తహసీల్దార్ కార్యాలయం ఏఎస్‌వో అమర్నాథ్, కార్యదర్శిగా మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కే చెంచయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా అద్దంకి మండల వ్యవసాయాధికారి కొ్రపాటి వెంకటకృష్ణ, ట్రెజరర్‌గా కొటికలపూడి పంచాయతీ కార్యదర్శి విజయ్ పాల్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు రోశయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ

అద్దంకి టౌన్, జూలై 13 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం నేత్రాలను సేకరించారు. అద్దంకిలోని కొత్తపేటకు చెందిన కురిచేటి కోటయ్య (78) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో కోటయ్య కళ్లను దానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళి సుధాకరరావు శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వైద్యులను సంప్రదించారు. డాక్టర్ దీక్ష సిబ్బందితో వచ్చి కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నేత్రాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఏపీజీఈఏ మార్టూరు అధ్యక్షుడిగా సింగారెడ్డి



ఏపీజీఈఏ నూతన కమిటీ సభ్యులు

మార్టూరు, జూలై 13 : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మార్టూర్ తాలూకా యూనిట్ నూతన కమిటీ ఎన్నికలు శనివారం మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం భవనంలో జరిగాయి. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. వాటిలో మార్టూరు తాలూకా అధ్యక్షుడిగా ఇండేల సింగారెడ్డి, కార్యదర్శిగా జీ ఆంజనేయులు, కోశాధికారిగా డి మురళి గౌరవ అధ్యక్షులుగా దంత వైద్యులు భానుచంద్రనాయుడు ఎన్నికయ్యారు. అదేవిధంగా సభ్యులుగా పీ శైలజ, ఏ తిరుమల, కే సుష్మ, కే ప్రమీల, రమణమూర్తి, చెన్నకేశవులు, కే రారాజు, హనుమంతరావు మీరావలి, దుర్గాదేవి, భూపేల్ రెడ్డిని ఎంపిక చేశారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కే రోశయ్య, కార్యదర్శి కే శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికైంది.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 13: విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య తన భార్య సులోచన జ్ఞాపకార్థం శనివారం స్థానిక అమ్మ ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టరు కొ్రపాటి లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, సతీష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు, జూలై 13 : మండలంలోని పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు తాటిపర్తి నారపరెడ్డి మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు వెంకటరత్నం, అంజిరెడ్డి, సుబ్బారెడ్డి, బద్రిరెడ్డిని రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోమనరావు, జెట్టి స్వామి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, సాంబశివరావులు అభినందించారు.

మార్టూరు స్టేషన్ నుంచి నలుగురు బదిలీ

మార్టూరు, జూలై 13 : మార్టూరు పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారిలో హెడ్ కానిస్టేబుల్ రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయిరాం వెదుళ్లపల్లి స్టేషన్‌కు బదిలీ కాగా, కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న రమేష్ మేదరమెట్ల స్టేషన్‌కు, హరిబాబు బల్లికురవ స్టేషన్‌కు, రాజు అద్దంకి స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం స్టేషన్‌కు ఆదేశాలు వచ్చాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గన్నెపూడి(పర్చూరు), జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పర్చూరు మండలం గన్నెపూడి గ్రామానికి చెందిన ఏ పేరయ్య(55) ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి ఈనెల 11న స్వగ్రామం వస్తుండగా అన్నంబొట్లంవారిపాలెం సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి గాయపడ్డారు. అతనిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అద్దంకి, జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో భవనాసి కాలువ సమీపంలో శుక్రవారం రాత్రి 37 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన వ్యక్తిని 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్థరాత్రి దాటిన తరువాత మృతి చెందారు. ఈ మేరకు ఒంగోలు రిమ్స్ అవుట్‌పోస్టు నుంచి అద్దంకి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందింది.

కోలలపూడి శతాబ్దికి అవార్డు

మార్టూరు, జూలై 13 : మండలంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కోలలపూడి శతాబ్దికి ఉత్తమ అధ్యక్షురాలిగా కందిమళ్ల నిర్మలకు, మరో 11 అవార్డులు వచ్చినట్లు ఇన్నర్‌వీల్ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌లో జరిగిన ఇన్నర్ వీల్ క్లబ్ కార్యక్రమంలో నిర్మలకు డిస్ట్రిక్-315 అసోసియేషన్ అధ్యక్షురాలు సునీతజైన్, డిస్ట్రిక్ ఛైర్‌పర్సన్ కోలా విజయలక్ష్మి చేతుల మీదగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలలో చైతన్యం తీసుకు వచ్చే కార్యక్రమాలతోపాటు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించిన కోలలపూడి క్లబ్-71 ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు 11 ఉత్తమ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.



అవార్డును అందజేస్తున్న ఇన్నర్‌వీల్ ప్రతినిధులు



ఆంధ్రజ్యోతి



పండుగ శోభ!

విద్యుద్దీప కాంతుల్లో బారాషహీద్ దర్గా

సుదూర ప్రాంతాల నుంచి భక్తుల రాక

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 13 : మత సామరస్యానికి ప్రతీక, కోరిన కోర్కెలు తీర్చే రొట్టెల పండుగ కోసం బారాషహీద్ దర్గా మైదానం, స్వర్ణాల చెరువు ఘాట్‌లు ముస్తాబవుతున్నాయి. శనివారం రాత్రి దర్గాతోపాటు పరిసర ప్రాంగణాల్లో విద్యుద్దీపాలు వెలిగించడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. ఈ నెల 17వ తేదీన ప్రారంభమయ్యే పండుగ 21 వరకు జరగనుంది. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం పండుగ ప్రారంభానికి ముందే భక్తులు దర్గాకు తరలి వస్తున్నారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు నాగ్‌పూర్, అనంతపురం, కడప తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వర్ణాల చెరువులో స్నానమాచరిచి వరాల రొట్టెలను మార్చుకుంటున్నారు. అలాగే బారా షహీద్‌లను దర్శించుకుని పూజలు చేశారు. తరలివస్తున్న భక్తుల కు ఎలాంటి లోటు కలగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ షేక్.ఖాదర్‌బాషా, సభ్యు లు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం నుంచే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

● ఎస్పీ పరిశీలన

నెల్లూరు (క్రైం) : దర్గా పరిసరాలను ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ శనివారం పరిశీలిం చారు. పండుగ ఏర్పాట్లను పరిశీలించి, పోలీసు అధికా రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుత రద్దీకి తగ్గట్లుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎఎస్పీలు, డీఎస్పీలు డీఎస్పీ వెంట ఉన్నారు.

జిల్లా పోలీసు బాస్‌గా కృష్ణకాంత్

- 2017లో ఐపీఎస్‌కి ఎంపిక
- డీజీపీ కార్యాలయానికి ఆరీఫ్ హఫీజ్ బదిలీ



నూతన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైం), జూలై 13 : జిల్లా పోలీస్ బాస్‌గా జీ కృష్ణకాంత్‌ను నియమిస్తూ శనివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు ఎస్పీగా పనిచేస్తున్న జీ కృష్ణకాంత్‌ను నియమించారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం ఎస్ఎస్ పల్లికి చెందిన జి కృష్ణకాంత్ అనంతపురం సీఎంఐ కళాశాలలో బీఎస్సీ బయోటెక్నాలజీ, హర్యానాలోని ఎన్‌డీఆర్ కల్నల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. కృష్ణకాంత్ తండ్రి రామాంజనేయులు ఇండియన్ రైల్వేలో ఉద్యోగిగా చేసి పదవీ విరమణ పొందగా తల్లి రామతులసి గృహిణి. భార్య ప్రవీణ వైద్య విద్యను అభ్యసించి గృహిణిగా ఉన్నారు. 2017లో సివిల్స్‌లో ఐపీఎస్‌గా ఎంపికైన కృష్ణకాంత్ గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా, తూర్పుగోదావరి జిల్లా చింతూరు అదనపు ఎస్పీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఓఎస్‌డీగా కృష్ణకాంత్ విధులు నిర్వహించారు. 2023, ఏప్రిల్‌లో కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. విధులు నిర్వహించిన ప్రతిచోట మంచి అధికారిగా కృష్ణకాంత్ పేరు తెచ్చుకున్నారు. నేరాల నియంత్రణ, సైబర్ క్రైం కట్టడిలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

● ఎన్నికల నిర్వహణలో...

జిల్లాపై పెద్దగా పట్టు లేదు. గతంలో పని చేసిన అనుభవమూ లేదు. అయినా ఎన్నికల నిర్వహణలోను, శాంతి భద్రతల పర్యవేక్షణలోనూ ప్రస్తుత ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ ఏడాది 4న బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటి రోజు నుంచే చాలెంజ్‌గా విధులు నిర్వహిస్తూ ప్రణాళికాబద్ధంగా ఎన్నికల విధులు నిర్వహించారు. అయితే, జిల్లాలో హత్యలు, హత్యాయత్నాలు, దొంగతనాలు, దోపిడీలు, రౌడీయిజాన్ని అదుపు చేయడంలో మాత్రం ప్రత్యేక మార్క్ చూపలేక పోయారన్న విమర్శలను ఆరీఫ్ హఫీజ్ మూటగట్టుకున్నారు.





- ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- దెబ్బతిన్న ఆప్రాన్.. ప్రమాదంలో సోమశిల
- బిల్లుల సమస్యతో ఆగిన ప్రధాన ప్రాజెక్టులు
- కూటమి ప్రభుత్వంపైనే అన్నదాతల ఆశలు
- నేడు జిల్లాలో ఇరిగేషన్ మంత్రి పర్యటన

అమాత్యా.. ఆలకించు!

నెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఆధార మైన జిల్లాలో ఇరిగేషన్ శాఖను వైసీపీ ప్రభుత్వం భ్రష్టుపట్టిం చింది. జీవనాడి వంటి సోమశిలను అత్యంత ప్రమాదంలోకి నెట్టింది. బిల్లులు ఇవ్వక ప్రధాన ప్రాజెక్టులను అటకెక్కించింది. చివరకు పిల్ల కాలువల్లో కూడా పూడిక తీయకుండా రైతాంగంతో ఆటలాడుకుంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ఎకరాను కూడా సాగులోకి తీసుకురాలేక పోయారు. 90 శాతం పూర్తయిన నెల్లూరు, పెన్నా బ్యారేజీలను పూర్తి చేయకుండానే చేసినట్లుగా హడావిడిగా ప్రారంభించడం తప్ప చేసిందేమీ లేదు. ఆఖరుకు ఆ బ్యారేజీలను నిర్వహించేం దుకు ఒక్క మనిషినీ నియమించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో జిల్లా ఇరిగేషన్ శాఖపై చర్చించారు. జిల్లాకు వచ్చి కీలక ప్రాజెక్టులను సందర్శించి ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టేందుకు సహకరించాలని కోరారు. ఆ క్రమంలో నిమ్మల రామానాయుడు ఆదివారం నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ప్రధానమైన సోమశిల, కండలేరు ప్రాజెక్టులను సందర్శించడంతోపాటు ఇరిగేషన్ అధికారులతో సమీక్షించనున్నారు. దీంతో రైతాంగం ఆశలన్నీ నిమ్మలపైనే పెట్టుకున్నాయి. ప్రధాన ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా సీజన్ సమీపిస్తుండటంతో అత్యవసరంగా పంట కాలువల్లో పూడిక తీసేలా చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

● ప్రమాదంలో సోమశిల

2020, 2021లో పెన్నాకు వచ్చిన వరదలకు సోమశిల ఆప్రాన్ పూర్తిగా దెబ్బతిన్నది. ప్రాజెక్టు ముందుభాగంలో ఉండే కాంక్రీట్ కొట్టుకుపోయింది. దీంతో మరోమారు భారీ వరద వస్తే సోమశిల జలాశయం తీవ్ర ప్రమాదంలో పడుతుందని నిపుణుల కమిటీ తేల్చింది. ఈ మేరకు ఆప్రాన్‌ను పరిశీలించి అత్యవసరంగా పునఃనిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో రూ.100 కోట్లతో ఆప్రాన్ పనులు మొదలు పెట్టారు. సుమారు రూ.20 కోట్ల పనులు కూడా జరిగాయి. కానీ కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి కూడా బిల్లు ఇవ్వకపోవడంతో రెండేళ్ల నుంచి పనులు నిలిపేశారు. గతేడాది వరదలు రాలేదు కాబట్టి బతికిపోయాం కానీ ఈ దఫా వరదలు వస్తే పరిస్థితి ఊహించేందుకు కూడా కష్టంగా ఉంటుందని ఇంజనీర్లే చెబుతుండటం గమనార్హం. సోమశిల ఆప్రాన్ పనులను అత్యవసరం చేపట్టాల్సి ఉంది.

● పగలగొట్టారు.. ఆపేశారు

ప్రధానమైన సోమశిల-కండలేరు వరద ప్రవాహ కాలువ (ఎస్‌కేఎఫ్ఎఫ్), సోమశిల ఉత్తర కాలువ(జీకేఎన్ కెనాల్)లను విస్తరించేందుకు మూడేళ్ల క్రితం రూ.1300 కోట్లతో పనులు మొదలుపెట్టారు. చాలా వరకు ఈ కాలువల లైనింగ్‌ను పగలగొట్టారు. కానీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదన్న కారణంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఇది తీవ్ర ఇబ్బందిగా మారింది. సోమశిల నుంచి కండలేరుకు నీటిని తరలించాలన్నా, సోమశిల నుంచి ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలన్నా ఎస్‌కేఎఫ్ఎఫ్, జీకేఎన్ కాలువలు చాలా ప్రధానమైనవి. ఈ కాలువల విస్తరణ పనులను త్వరగా మొదలుపెట్టాల్సిన అవసరముంది.

● అటకెక్కిన బండేపల్లి-దేగపూడి

కనుపూరు కాలువ టెయిలెండ్ అయిన మనుబోలు మండలం లోని ఆయకట్టు ఏటా చివరి తడి సమయంలో ఎండిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే కండలేరు వాగు నుంచి ప్రత్యేక కాలువను బండేపల్లి కాలువకు కలుపడమేనని ఇంజనీర్లు నిర్ధారించారు. దీంతో బండేపల్లి- దేగపూడి కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని మనుబోలు, పొదల కూరు ప్రాంత రైతులు పాతికేళ్ల నుంచి కోరుతూ వస్తున్నారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.24 కోట్లతో అత్యవసరమైన ఈ కాలువ పనులు మొదలయ్యాయి. కొద్ది దూరం కాలువను కూడా తవ్వారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులు ఆగిపోయాయి. ఇది పూర్తయితే 25 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో ఈ కాలువ కూడా ఉంది.

> **మంత్రి పర్యటన ఇలా..**
>
> నెల్లూరు (హరనాథపురం) : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణలు ఆదివారం ఉదయం 10.45 గంటలకు సోమశిల రిజర్వాయర్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కండలేరు రిజర్వాయర్‌ను తనిఖీ చేస్తారు. అనంతరం అక్కడే ఇరిగేషన్ అధికారులతో జలవనరుల శాఖపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుంటారు.

● గేట్లు ఎత్తేవారు లేరు

అత్యంత కీలకమైన సంగం, నెల్లూరు బ్యారేజీలను పుష్కరకాలంపాటు శ్రమించి ఎలాగోలా పూర్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులకు దాదాపు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో పనులు పూర్తి కాకుండానే వీటిని ప్రారంభించారు. కానీ ఆ తర్వాత ఈ బ్యారేజీల నిర్వహణను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్ల లయబుల్ పీరియడ్ కూడా ముగిసింది. ఇప్పుడు ఆ రెండు బ్యారేజీల వద్ద గేట్లు ఎత్తేందుకు ఒక్కరు కూడా లేరు. ఇప్పుడు భారీ వరదలు వస్తే ఆ రెండు బ్యారేజీలు ప్రమాదంలో పడతాయి. ఈ బ్యారేజీల వద్ద పనిచేయడానికి సుమారు 60 మంది వరకు అవసరమవుతారని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం అనుమతులివ్వలేదు.

● ప్రక్షాళన అవసరం

జిల్లాలో ఇరిగేషన్ శాఖ పనితీరు అత్యంత దారుణంగా మారిపోయింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఈ శాఖను ఒక బంగారు బాతులా భావించారు తప్ప రైతులకు సేవ చేయలేదు. రూ.వందల కోట్లు నిధులు తీసుకొచ్చి పనులు చేయకుండానే బిల్లులు తినేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా వారితో జతకలిశారు. ఈ అక్రమాలపై విచారించాలంటూ ప్రస్తుత ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం రెగ్యులర్, సోమశిల, టీజీపీ ప్రాజెక్టులు మూడింటికీ ఎస్ఈలు ఇన్‌చార్జిలే కావడం గమనార్హం. వీరేకాదు అనేక ఈఈలు, డీఈఈలు పోస్టులు కూడా ఇన్‌చార్జిల పాలనలో మగ్గుతున్నాయి. జీతం తీసుకునేది ఓ చోట.. పని చేసేది మరో చోటగా ఇక్కడ అధికారుల పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది.

- బోర్డులు పెట్టినవారే 22-ఏ జాబితాలో తొలగింపునకు ప్రతిపాదనలు
- భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ ఆనంద్

కోడూరుపాడు ప్రభుత్వ భూములపై

కదులుతున్న డొంక

నెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన 'ఎవరు చేశారు.. ఎందుకు చేశారు!?' కథనం రెవెన్యూ శాఖలో పెద్ద కుదుపునే తెచ్చింది. నిషేధిత జాబితాలో ఉండాల్సిన రూ.100 కోట్ల విలువైన 21 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవరు తొలగించారన్నదానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. తీగలాగితే డొంక కదిలినట్లుగా గతంలో జరిగిన వ్యవహారాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడు వద్ద సర్వే నెంబర్లు 521, 525, 527, 529-ఏలలోని 21 ఎకరాల ప్రభుత్వ భూమిపై కలెక్టర్ ఓ ఆనంద్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. వెంటనే పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని ఆర్‌డీవో, తహసీల్దార్లకు సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలో కొన్ని విషయాలు చర్చనీయాంశంగా మారాయి.

2024లోనే బీజం..

2004లో అప్పటి కలెక్టర్, తహసీల్దార్లు హైకోర్టులో పిటిషన్ వేసి ప్రభుత్వ భూమి పరులపాలు కాకుండా అడ్డుకోగలిగారు. అవతలిపార్టీ సుప్రీంకోర్టుకు వెళ్లినా అధికారులు పోరాడుతూ వస్తున్నారు. 2021లో చుట్టూ ఉన్న పట్టా భూమిలో లేఅవుట్ వేస్తున్న వ్యక్తులు, ఈ ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు స్వయంగా తన పేరుతో 2021 డిసెంబరులో హైకోర్టుకు కౌంటర్ వేశారు. అయితే 2023 జనవరిలో వచ్చిన నిషేధిత భూముల తొలగింపు జాబితాలో ఈ ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. అప్పటికీ ఆయనే కలెక్టర్‌గా ఉండటం గమనార్హం. ఇక 2023 ఏప్రిల్‌లో మారోమారు ఈ భూములను ఆక్రమిస్తున్నారంటూ ఫిర్యాదులు అందడంతో స్వయంగా అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్ విచారణకు వెళ్లారు. పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకొని ఆ భూములు ఆక్రమణకు గురికాకుండా చూస్తామని ప్రకటించారు. మరి అప్పుడు ఆయన దృష్టికి ప్రభుత్వ భూములను 22-ఏ నుంచి తొలగించిన విషయం వెళ్లలేదా? అన్న చర్చ నడుస్తోంది. నెల్లూరు రూరల్ మండలంలో 2021లో ఉన్న అధికారులే 2023లో కూడా ఉన్నారు. మరి వారు కూడా ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్న అనుమానాలు కలుగుతున్నాయి. నిషేధిత జాబితాలో తొలగింపునకు మొదట తహసీల్దార్లు ప్రతిపాదనలు పంపగా, ఆర్‌డీవో పరిశీలించి కలెక్టరేట్‌కు పంపారు. అక్కడ జేసీ, కలెక్టర్‌లు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి తొలగింపు జాబితా విడుదలైంది. ఇలా ప్రతిపాదనలు పెట్టే సమయంలోనే అధికారు లెవరూ పట్టించుకోక పోవడం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ వ్యవహారం వెనుక భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ భూముల్లో నాటిని హెచ్చరిక బోర్డులు కూడా మాయమైపోవడం గమనార్హం.



ఉదయగిరి : ఆక్రమిత భూముల్లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు


● ప్రభుత్వ భూముల పరిశీలన

ఉదయగిరి : మండలంలోని కొండాయపాళెం మజారా ప్రభుత్వ భూముల్లో బినామీ పట్టాలు పొందిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'భూముల్లో బినామీల పాగా' కథనంపై ఆయన స్పందించారు. ఆత్మకూరు ఆర్డీవో మధులత ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను పరిశీలించారు. సర్వే నెంబర్ల ప్రకారం ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తక్షణమే నివేదికలు తయారు చేయాలని వీఆర్వో వెంకట్, సర్వేయర్ మీరావలికి సూచించారు. నివేదికలను ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు.

సమగ్ర సోమశిలకు సహకరించండి!

అనంతసాగరం : సోమశిల జలాశయ అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. సమగ్ర సోమశిల దిశగా అడుగులు ముందుకు పడలేదు. అత్యవసరంగా చేయాల్సిన పనులు సైతం విస్మరించి జలాశయం పటిష్టతను గాలికి వదిలిశారు. ఈ తరుణంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంపై జిల్లావాసులు ఆశలు పెంచుకొన్నారు.

ప్రధాన సమస్యలివీ..



- జలాశయం వద్ద సిబ్బంది కొరత ఉంది. దీంతో ఉన్నవారిపై పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు.
- క్రస్ట్‌గేట్ల వ్యవస్థ సరిగా లేదు. 2021, 22లో సోమశిలకు భారీ వరద రాగా కొన్ని గేట్లు మొరాయించడంతో ఇబ్బంది పడ్డారు. గేట్ల వ్యవస్థను ఆధునీకరించాలి. లీకేజీలు లేకుండా పనులు చేపట్టాలి.
- ఎగువ నుంచి డ్యాంకు వరద వచ్చే సమయంలో నైపుణ్యం కలిగిన సిబ్బంది లేక గేట్లు ఎత్తడం.. దించడంలో అవస్థలు తప్పడం లేదు. టెక్నికల్ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.
- 2013లో ఏర్పాటు చేసిన టూరిజం భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వసతులు కరువై పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రముఖ సోమేశ్వరుడి ఆలయం వరదలకు ధ్వంసమౌ రెండేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి లేదు.
- జలాశయ పరిసరాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది.
- రాళ్ల వ్యర్థాలతో డ్యాం పరిసరాలు కళావిహీనంగా ఉంది. ఖాళీ ప్రదేశాలలో పచ్చదనం పెంపొందించి పార్కుల అభివృద్ధి చేస్తే బాగుంటుంది.
- తెలుగు గంగ కాలువ గేట్లనూ ఆధునీకీకరించాల్సి ఉంది.
- తెలుగుగంగ రక్షణ గోడల ద్వారా నీరు లీకవుతుంది. కాలువ గోడలను పటిష్ఠ పరచాల్సి ఉంది.
- స్టాప్‌లాగ్ గేట్లతోపాటు విద్యుత్ వ్యవస్థను మెరుగు పరచాల్సి ఉంది.
- డ్యాం వద్ద బోటు షికారు కలగా మారింది. గతంలో ప్రతిపాదనలు జరిగినా కార్యరూపం దాల్చలేదు.
- డ్యాం ముందు దెబ్బతిన్న పొర్లుకట్టలను అభివృద్ధి చేయాల.
- ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ అభివృద్ధి పనులు కూనరిల్లుతున్నాయి. మెట్ట గ్రామాల్లో నీటి ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. హైలెవల్ త్వరగా పూర్తి చేయాలి.

వెంకటేశ్వరపురం వద్ద కుంగిన ఫ్లైఓవర్ బ్రిడ్జి



కుంగిన ఫ్లైఓవర్ బ్రిడ్జి

- ముంబయి హైవేపై వెళ్లే వాహనాలకు బ్రేక్
- కోవూరు,ఇనమడుగు మీదుగా మళ్లింపు
- రొట్టెల పండుగ నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 13 : నగరంలోని వెంకటేశ్వరపురం వద్దనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జ్‌లో కొంతభాగం పూర్తిగా కుంగిపోయింది. దీంతో ముంబయి జాతీయ రహదారివైపు వెళ్లే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. రైల్వేవంతె నకు రోడ్డు వంతెనకు మధ్య కొంతకాలం క్రితం గుంత ఏర్పడింది. ఇదే ప్రాంతంలో శనివారం ఉదయం భారీ గుంత ఏర్పడింది. విషయం తెలుసుకొన్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని వాహన రాకపోకలను పూర్తిగా ఆపివేశారు. నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏ) అధికారులు, రైల్వే అధికారులు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే, ఈ నెల 17న రొట్టెల పండుగ జరగనున్న నేపథ్యంలో దెబ్బ తిన్న బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేయలని, పండుగ తరువాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని జిల్లా మంత్రులు, కలెక్టర్ నిర్ణయించారు. ఈ మేరకు ఎన్‌హెచ్ఏ పీడీ యంకే చౌదరి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆదివారం నుంచి తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే శాశ్వత మరమ్మతు పనులు చేయాలంటే దాదాపు 2 నుంచి 3 నెలలు సమయం పట్టనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌వో పీడీ ఎంఎన్ చౌదరి

● రాకపోకల మళ్లింపు

ముంబయి జాతీయ రహదారి వంతెన కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కసారిగా బ్రిడ్జీని మూసివేయడంతో వాహనాల రాకపోకలను కోవూరు, ఇనమడుగు వైపు మళ్లించారు. కేవలం చిన్నవాహనాలనే పెన్నా బ్యారేజీపై నుంచి వెళుతున్నాయి. కడప వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అందని సాగునీరు

● నిరుపయోగంగా సోమశిల ఉప కాలువలు

● బీళ్లుగా మారిన పొలాలు

ఆత్మకూరు, జూలై 13: సోమశిల జలాలు చెంతనే ఉన్నా సాగునీటికి నోచుకోక పోవడంతో మండలంలోని గ్రామాల రైతులు దశాబ్దల కాలంగా పొలాలను బీడులుగానే పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పొలాలకు సాగునీరు అందించేందుకు లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన ఉప కాలువలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి కింద నిర్మించిన ఈ కాలువలు అప్పుడప్పుడు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారుతున్నాయో తప్ప రైతులకు మాత్రం వీటితో ఎలాంటి ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. ఇందుకు సోమశిల 12ఆర్ ఉపకాలువే ప్రత్యక్ష నిదర్శనం. అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు గ్రామానికి చెందిన 175ఎకరాలకు సాగునీరు అందించేందుకు సోమశిల ఉత్తర కాలువ నుంచి 12ఆర్ ఉపకాలువను 18సంవత్సరాల క్రితం నిర్మించారు. సుమారు రూ.50లక్షలకు పైబడి నిధులతో కాలువ పనులు, కల్వర్టులు నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయకట్టు చివరకు సాగునీరు అందిన దాఖలాలు లేవు.



ఆర్ ఉప కాలువ కింద బీడుగా ఉన్న పొలాలు

పదేళ్ల క్రితం అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కామిరెడ్డిపాడుకు విచ్చేసిన సందర్భంగా రైతులు 12 ఆర్ ఉపకాలువ మరమ్మతుల విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన తిరిగి నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో కొంత మేర పనులు జరగడంతో 20 ఎకరాలకు పైబడి మాత్రమే సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయకట్టు చివరి వరకు మిగిలిన 150 ఎకరాలకు సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన మేకపాటి దంపతులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి

ఉదయగిరి రూరల్, జూలై 13: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శాంతికుమారిలు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారితో చంద్రబాబు కొద్దిసేపు ఏకాంతంగా చర్చించారు. జరిగిన ఎన్నికల్లో ఉదయగిరి, ఆత్మకూరు అభ్యర్థుల విజయానికి మీరు చేసిన కృషి మరువలేనిదని సీఎం అభినందించినట్లు తెలిపారు.

మేలైన పశుగ్రాసం సాగుపై అవగాహన

ఆత్మకూరు, జూలై 13: మండలంలోని కరటంపాడు, బీ.చిరువెళ్లలో పశు గ్రాస వారోత్సవాల సందర్భంగా శనివారం పశువైద్యాధికారి కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కర్యక్రమానికి ఆత్మకూరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ జయచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు మేలైన పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. పశుగ్రాసాల చెట్ల పెంపకం, పప్పుజాతి పశుగ్రాసాల పెంపకం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రైతులకు 4జి సూపర్ నేపియర్, ఆఫ్రికన్ టాల్ మొక్కజొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు సేవా కేంద్రం పశుసంవర్ధకశాఖ సహాయకులు వేణు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఆత్మకూరు ఏడీ డాక్టర్ జయచంద్ర

నేటినుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఆత్మకూరు, జూలై 13: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.10.72 కోట్ల ఉపాధి పనులపై ఆదివారం నుంచి అన్ని గ్రామాల్లో సామాజిక బృందం సభ్యులు తనిఖీ నిర్వహిస్తున్నట్లు సోషల్ ఆడిట్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎం.నాగార్జున తెలిపారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఈసీ జానకి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక బృందం సభ్యుల తనిఖీల అనంతరం గ్రామసభలు నిర్వహించి అంచనాలను ప్రజలకు వివరిస్తామన్నారు. తదనంతరం మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సమావేశంలో తుది నివేదికలు వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శిరీషా, సామాజిక తనిఖీ డీఆర్‌పీఎస్‌లు, గ్రామ ఫీల్డ్‌అసిస్టెంట్లు, టీఏ, ఈసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సాయి భక్తుల భిక్షాటన



భిక్షాటనలో పాల్గొన్న భక్తులు

వరికుంటపాడు, జూలై 13: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న నిర్వహించే గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం సాయిభక్తులు గ్రామాల్లో భిక్షాటన చేపట్టారు. ప్రత్యేక వాహనంలో పల్లెల్లో ప్రచారం నిర్వహించి నగదు, ఇతర వస్తువులను సేకరించారు. గురుపౌర్ణమిరోజు పూజా కార్యక్రమాలు, మహా అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి పట్టవా..?



ఉదయగిరిలోని పేరు మారని రైతుసేవా కేంద్రం

ఉదయగిరి రూరల్, జూలై 13: గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలను ఎన్డీఏ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ గత నెల 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో అమలు కావడం లేదు. అందులో భాగంగా ఉదయగిరి బిట్-1 రైతు సేవాకేంద్రంలో ఇప్పటికీ పేరు మార్చలేదు. భవనానికి ఉన్న రంగులు మార్చలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా ఆ రంగులు మార్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నానా తంటాలు పడ్డారు. నిధులు లేక పోవడంతో అధికారులు, సిబ్బంది నిమ్మకున్నట్లు తెలుస్తోంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 13: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 11కేవీ దుత్తలూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు అందుకు సహకరించాలని ఆయన కోరారు.

మంత్రిని కలిసిన చెంచలబాబు



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, జూలై 13: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్‌లను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

విజంమూరులో కోతులు, కుక్కల బెడద !

వింజమూరు, జూలై 13: మండలకేంద్రంలోని అన్ని కాలనీల్లో కుక్కలు, కోతల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులను, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ఒంటరిగా ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఇటీవల టీచర్స్ కాలనీలో ఒక పాపను కుక్క కరిచింది. అలాగే ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులుగా ఉండి అరుస్తు ఉండటంతో వాహనదారులు ఆ మార్గంలో వెళ్లేందుకు జంకుతున్నారు. యాదవ బజార్, వెలమ బజార్, గంగమెట్ట ప్రాంతాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. వీటిని తరిమేందుకు గృహిణులు ప్రయత్నం చేస్తే వారిపై దాడి చేస్తున్నాయి. వీటి వలన పట్టణ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులు దృష్టి సారించి కుక్కలు, కోతులు బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

మాలకొండ ఆదాయం రూ.11.29 లక్షలు

వలేటివారిపాలెం, జూలై 13: మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల కానుకలతో రూ.11.30లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ.8,400, కుంకుమార్చనతో రూ.24,640, వివాహాలతో రూ.2వేలు, తలనీలాలు ద్వారా రూ.56,300, వాహనపూజలతో రూ.6,100, ప్రత్యేకదర్శనం ద్వారా రూ.3,78,000, స్థలపురాణం పుస్తకాలు విక్రయంతో రూ.640, రూముఅద్దెలతో రూ.32,120, కవర్లు ద్వారా రూ.7,500, లడ్డుప్రసాదంతో రూ.2,09,640, అన్న దానం ద్వారా రూ.3,86,005, విరాళముల ద్వారా రూ.17,117 వచ్చిందని పేర్కొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



జీవో ప్రతులు దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, జూలై 13: సీపీఎస్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయం ఎదుట శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ పేరుతో విడుదల చేసిన జీవో 54 ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ నాయకులు మాట్లాడారు. ఉద్యోగులకు సీపీఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని తుంగలో తొక్కిందని మండిపడ్డారు.

పాడి పశువులకు టీకాలు

వింజమూరు, జూలై 13: బుక్కాపురం గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ అధికారి కొమ్మి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచితంగా గుండెజబ్బు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గేదెకు టీకా వేయిస్తున్న బుక్కాపురం రైతు

విద్యార్థులకు నగదు, బహుమతుల అందజేత

ఉదయగిరి రూరల్, జూలై 13: గండిపాళెం గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఏఏఏజీ ఆధ్వర్యంలో నగదుతో పాటు బహుమతులు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎస్.వేణుకు రూ.10 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన బీ.చైతన్యకు రూ.7,500లు, తృతీయస్థానంలో నిలిచిన శివాజీ, హర్షవర్ధన్‌లకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు అందజేయడంతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో రూ.25వేలు ఆర్థికసాయం అందజేసిన ఎన్‌వీ.శ్రీధర్‌కు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఏఏఏజీ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఏఏజీ సభ్యులు షారన్, సుమన్, కిషన్, గాజులపల్లి సుబ్బారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాతలను ప్రోత్సహించి, ఆలయ అభివృద్ధి చేయాలి

వలేటివారిపాలెం, జూలై 13 : దాతలను ప్రోత్సహించి, ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం కోనేరు, మహా అన్నదానం, లడ్డూ కౌంటర్, స్వామి దర్శనం అనంతరం బయటకు వచ్చే మెట్లమార్గం, కేశఖండన శాల, దుకాణాలు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించే దాతలను సకల మర్యాదలతో స్వాగతించి ప్రత్యేక పూజలు చేయించాలన్నారు. భక్తులకు నాణ్యమైన బోజనం పెట్టాలని తెలిపారు. ఆలయంలో అవినీతి అక్రమాలకు చోటులేకుండా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, టీడీపీ



నృసింహుడి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, నవ్వులూరి రాజారమేష్, కామినేని అశోక్, కాకుమాను ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 కోట్లతో కావలి అభివృద్ధికి ప్రతిపాదనలు

కావలి, జూలై13: పట్టణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల నెల్లూరులో ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో కావలిలో అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరు చేస్తానని, అందుకు ప్రతిపాదనలు పంపమని పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ చెప్పారు. దీంతో ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి ఆవివరాలను అధికారులకు తెలియచేసి, ప్రతిపాదనలను సిద్ధం చేయమని ఆదేశించారు. దీంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు, జూలై 13 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కథనం మేరకు, గుండ్లపాలెం మన్నేరు రేవు నుంచి ఇసుకను అక్రమంగా లోడుచేసుకొని తరలిస్తున్నట్లు సమాచారం అండడంతో పోలీసులు గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద మాటువేసి, రెండు ట్రాక్టర్లను, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్లపై కేసు నమోదుచేసి కందుకూరు కోర్టులో హాజరుపరిచామని ఎస్సై లక్ష్మణరావు శనివారం తెలిపారు.

నేటి నుంచి కలిగిరమ్మ తిరునాళ్ల



కలిగిరి, జూలై 13: నర్రవాడ వెంగమాంబ తిరునాళ్ల అనంతరం మెట్ట ప్రాంతంలో జరుపుకునే కలిగిరమ్మ తిరునాళ్లను జిల్లాలో జరిగే పెద్దఉత్సవాల్లో ఒకటిగా పేర్కొనవచ్చు. ఆదివారం నుంచి గురువారం వరకు వైభవంగా ఈ తిరునాళ్లను నిర్వహించనున్నారు. స్థానికులు దూరప్రాంతంలో ఉన్న తమ బంధుమిత్రులను ఆహ్వానించి తిరునాళ్లను ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకుంటారు. అనాది నుంచి వస్తున్న ఆచారాల ప్రకారం అమ్మవారి తిరునాళ్లను ఆచార కాపులు అయిన కలిగిరి చెందిన 'అక్కరాజు'వంశం, పాపనముసిలిపాలెంకు చెందిన 'పాపన' వంశం, జిర్రవారిపాలెంకు చెందిన 'జిర్రా' వంశం వారి అనుమతులతో ప్రారంభిస్తారు. ఉత్సవాలకు ముందురోజున అమ్మవారి గుడి ముందు సుడిమాను ప్రతిష్ఠించడం ఆచారంతోపాటు ప్రత్యేక ఆకర్షణ. ఈ ఉత్సవాల్లో పొట్టేళ్ళు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై అందంగా ప్రభలను అలంకరించుకొని, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. అమ్మవారి తిరునాళ్లకు భారీగా భక్తులు తరలిరానున్నారు.

కొండబిట్రగుంటకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర



తిరివీధి పాదయాత్రలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, జూలై 13: దగుమాటి కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయానికి పాదయాత్ర చేపడతానన్న మొక్కును తిరివీధి ప్రసాద్ శనివారం తీర్చుకున్నారు. కచ్చేరిమిట్టలోని వేంకటేశ్వస్వామి ఆలయం వద్ద జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని ప్రసాద్‌ను స్వామి వస్త్రంతో సత్కరించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. ముసునూరు టోల్ ప్లాజా వద్ద జబర్దస్త్ ఫేమ్ శాంతి పాల్గొని తిరివీధిని సత్కరించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ చౌదరి, కావేటి కోటయ్య, పాలడుగు మురళి, పెంచలయ్య, గోపాల్, విష్ణుతేజారెడ్డి, ఆసిఫా తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

కలిగిరి, జూలై13: ఆకాశం మబ్బులుపట్టి వర్షాలు కురుస్తుండడంతో మండల ప్రజలు ఉపశమనం పొందారు. రుతుపవనాలు బలంగా ఉన్న నేపథ్యంలో శనివారం రోజంతా చిరుజల్లులు పడుతుండటంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల ప్రకటనతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు.

బిలకూట క్షేత్రంలో గోవిందనామ స్మరణ

బిట్రగుంట, జూలై 13: బోగోలు మండలం బిలకూట క్షేత్రం శనివారం భక్తుల గోవిందనామ స్మరణలతో మారుమోగింది. స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు చుట్టపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కావలి చెందిన టీడీపీ నాయకుడు తిరువీధి ప్రసాద్, ఆయన అనుచరులు పాదయాత్ర చేస్తూ స్వామివారి దర్శనానికి వచ్చారు. ఆయన్ను టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలశారు. దగదర్తి మండలం చెన్నూరుకు చెందిన కొమ్మి వెంకటేశ్వర్లు, అలివేలమ్మ దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. బెంగళూరు వాసులు గుదిమెళ్ళ అనంతాచార్యులు-కొమలవల్లితాయారు, శ్రీనివాస్-మంజీర, మురళీకృష్ణ-ప్రత్యూష, రవికిరణ్ - శ్రీవాణి దంపతులు స్వామి వారి గరుడ సేవకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వండి

కందుకూరు, జూలై 13: ప్రతిపక్షంలో ఉన్నకాలంలో టీడీపీ కోసం కష్టపడ్డ వారికి, గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతనివ్వాలని నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి జీ మోషే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు విజ్ఞప్తిచేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం పల్లాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు మోషే తెలిపారు. పార్టీకోసం కష్టపడ్డ వారికి నామినేటెడ్ పదవుల్లో సముచితస్థానం కల్పిస్తామని పల్లా హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు గోన ప్రతాప్‌కుమార్, గడ్డం నవీన్ తదితరులు ఉన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కందుకూరు టీడీపీ నాయకులు

విద్యుదాఘాతంతో మహిళకు తీవ్ర అస్వస్థత

బిట్రగుంట, జూలై 13: బోగోలు మండలం తాళ్ళూరు సబ్ పోస్టాఫీస్ వీధిలో ఉంటున్న తిరుమలశెట్టి లక్ష్మి విద్యుదాఘాతంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికుల కథనం మేరకు, శుక్రవారం రాత్రి లక్ష్మి తన స్వగృహంలో నీటి మోటరు వేసేందుకు స్విచ్ వేయగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు మెయిన్ ఆఫ్ చేయడంతో ప్రమాదం తప్పింది. వెంటనే 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేయించామని బంధువులు తెలిపారు.

కావలిలో పూడికతీత పనులు

కావలి, జూలై13: పట్టణంలో కొన్నేళ్లుగా పూడికతీతకు నోచుకోని కాలువల్లో మున్సిపల్ అధికారులు పూడికతీతకు శ్రీకారం చుట్టారు. వర్షాకాలం వస్తుండటంతో పూడిపోయిన కాలువల్లో పూడిక తీసి వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్లతో పూడిక తొలగిస్తున్నారు. అలాగే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కూడా కాలువల్లో దిగి పూడికను తీస్తున్నారు. తీసిన పూడికను కూడా ఎప్పటికప్పుడు పట్టణం వెలుపలకు తరలిస్తున్నారు.



వెంగళరావునగర్‌లోని మురుగుకాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

పెదపవనికి రాత్రిళ్లు బస్సు నడపండి

లింగసముద్రం, జూలై 13 : కందుకూరు డిపో నుంచి పెదపవని గ్రామానికి సాయంత్రం 6 గంటల తర్వాత బస్సు లేదు. దీంతో పెదపవనితోపాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన ఎస్ఎం బాషా, మరికొందరు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కందుకూరు నుంచి రాత్రి 7.30 గంటలకు పెదపవని మీదుగా వింజమూరుకు, అలాగే 8.30 గంటలకు పెదపవనికి వచ్చి అంగిరేకులపాడు వెళ్లే బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారని వారు తెలిపారు. కలెక్షన్లు లేవనే కారణంతో ఈ బస్సులను రద్దు చేశారని వారు చెప్పారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కొమ్మిలో పశుగ్రాస వారోత్సవాలు



పశుగ్రాస క్షేత్రంలో పశు వైద్యాధికారి మధు, రైతులు

కొండాపురం, జూలై13: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కొమ్మి గ్రామంలో సాయిపేట పశువైద్యాధికారి ఎం.మధు పాడి రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసీజన్‌లో పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. 75 శాతం రాయితీపై జొన్నలు కేజీ రూ. 23, మొక్కజొన్నలు కేజీ రూ. 17లకే అందచేస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాసుపుస్తకం తీసుకొని సచివాలయంలో వాటిని తీసుకోవచ్చని తెలియచేశారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు, పశువైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వరికుంటపాడు, జూలై 13: బెంగళూరులో ఆదివారం జరుగనున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పిడుగు చెన్నకేశవులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ మహాసభలకు జాతీయ, రాష్ట్రస్థాయి బాధ్యులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బాధ్యులు, సభ్యులు తప్పనిసరిగా మహాసభలకు హాజరై, విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

కాలనీలకు అందని సురక్షిత తాగునీరు

అల్లూరు, జూలై 13 : నగర పంచాయతీ పరిధిలోని మజరా గ్రామాల కాలనీల్లో సురక్షిత తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బోడిసత్రం, ఆర్‌డీఆర్ కాలనీ, దళితవాడ, అరుంధతీయవాడ, రామాపురం కాలనీలతోపాటు చుట్టుపక్కల ఉండే 18 మజరా గ్రామాలకు తాగునీరందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంచాయతీ సరఫరా చేసే నీరు తాగేందుకు ఉపయోగకరంగా లేదు. దీంతో దూరప్రాంతాల్లోని చేతిపంపులు, ఆర్‌వో ప్లాంట్లకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి సరఫరాకు ప్రత్యేక అధికార వ్యవస్థ, నిధులు ఉన్నా, సమగ్రంగా తాగునీటిని అందించే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు తమకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



కుళాయి వద్ద నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు